గురువారం
14-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 53
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చైనాతో సహకారాన్ని పెంచుకుంటాం: రష్యా

బీజింగ్: చైనాతో సహకారాన్ని పెంచుకునేందు రష్యా సిద్ధమని ఆ దేశ భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షొయిగు అన్నారు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్, భద్రతా, ఉగ్రవాదంపై పోరు, ట్రాన్స్‌నేషనల్ నేరాలు వంటి వాటిలో మరింతగా సమన్వయం చేసుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తమ దేశాల భద్రతా, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల మధ్య ఉన్నతస్థాయి సంప్రదింపులు జరుగుతుంటాయని, ఈ రంగాల్లో లోతైన సహకారాన్ని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. ఆయన బుధవారం చైనా కేంద్ర రాజకీయాలు, న్యాయ వ్యవహారాల కమిషన్ కార్యదర్శి చెన్ వెన్‌కింగ్‌తో భేటీ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అన్ని రకాల ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు మాస్కో కట్టుబడి ఉందని సెర్గీ షొయిగు చెప్పారు.

దాడి బీఆర్ఎస్ కుట్రే

- చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం
- ఫార్ములా ఈ- రేస్ కేసు నుంచి తప్పించుకోవడానికి బీజేపీ పెద్దలతో కేటీఆర్ ఒప్పందం
- రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ... ఉద్యోగాలు: భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: ముందస్తు ప్రణాళిక ప్రకారమే బీఆర్ఎస్ కుట్రపూరితంగా అరాచక శక్తులతో అమాయకులైన దళిత, గిరిజన రైతులను రెచ్చగొట్టి లగచర్లలో కలెక్టర్, ఆర్డీవోపై దాడి చేయించిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. దాడి వెనుక కాల్ డేటా తీయగా బీఆర్ఎస్ అభ్యర్థి ఉన్నట్టు తెలుస్తుందన్నారు. ఎంతటి పెద్దవారున్నా ఉపేక్షించమన్నారు. చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని భట్టి స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాడిని ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎవరి సమస్యనైనా వినడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏదైనా సమస్య పరిష్కారానికి వినతి పత్రాలు ఇవ్వడం, అధికారులతో చర్చించడం, న్యాయస్థానాలకు వెళ్లే అవకాశాలు ఉండగా, బీఆర్ఎస్ నాయకులు అమాయకులైన రైతులను రెచ్చగొట్టి అధికారులపై దాడులు చేయించడం దుర్మార్గపు చర్య అన్నారు. కలెక్టర్ పై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేద్దామని అనుకుంటే పొరబాటని... చట్ట ప్రకారం వారిపై చర్యలు తప్పవన్నారు. పది సంవత్సరాలు సీఎంగా ఉన్న కేసీఆర్‌ని అడుగుతున్నా... ఇలా దాడులు చేయించడం సబబేనా అని నిలదీశారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా ఈ విషయంపై మాట్లాడాలన్నారు. అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, దుండగుల పట్ల ప్రభుత్వం కఠినంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టించే రంగాలను అభివృది చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తూనే పరిశ్రమలను తీసుకువచ్చి ప్రైవేటు రంగంలో కూడా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నది తమ ధ్యేయం అన్నారు. అత్యంత వెనుకబడి ఉన్న కొడంగల్ నియోజకవర్గంలో పారిశ్రామికీకరణ అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళిక అనుసరిస్తున్నట్టు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు భూములు కావలసిన విషయం అందరికీ తెలిసిందేనని, భూములు పోతే రైతుల బాధలు ఏంటో మాకు తెలుసని పేర్కొన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. లగచర్లలో గొడవలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ చూస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగమే రీజనల్ రింగ్ రోడ్-ఔటర్ రింగ్ రోడ్ మధ్య పరిశ్రమల ఏర్పాటుకు క్లస్టర్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తలకిందులుగా తపస్సు చేసిన ప్రభుత్వాన్ని అస్థిరపరచలేరని స్పష్టం చేశారు. ఫార్ములా ఈ- రేస్ కేసు నుంచి తప్పించుకోవడానికి కేటీఆర్ ఢిల్లీ పోయి బీజేపీ పెద్దలను కలిసి ఒప్పందం చేసుకుండని ఆరోపించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ వ్యతిరేకంగా ఓటు వేయమని చెప్పడం అంటే బీజేపీకి ఓటు వేయమని చెప్పడమే అన్నారు. ఫార్ములా ఈ- రేస్ కేసు విచారణకు గవర్నర్ సహకరిస్తారని ఆశిస్తున్నామని, తిరస్కరిస్తే చట్టం ప్రకారం ఏం చేయాలో అదే చేస్తామన్నారు.

బీజేపీ ... తన వైఖరేంటో చెప్పాలి: మంత్రి పొన్నం

బీజేపీ... రైతుల అరెస్టును ఖండిస్తున్న సందర్భంలో అధికారులపై జరిగిన దాడిపై కూడా ఆ పార్టీ నేతలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ తమ వైఖరేంటో చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ఉందని, న్యాయ స్థానాలకు వెళ్లే హక్కు ఉందన్నారు.

కలెక్టర్‌పై దాడి కేసులో
పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్

విశాలాంధ్ర-హైదరాబాద్: వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు బుధవారం ఉదయం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ దాడి వెనుక ఓవైపు బీఆర్ఎస్ పార్టీ నేతల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తుండగా, తమపై కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని గులాబీ పార్టీ

- మిగతా 2 లో

పిల్లలను భావిభారత పౌరులుగా
తీర్చిదిద్దుదాం

విశాలాంధ్ర-హైదరాబాద్: పిల్లలను జాతి సంపదగా భావించి, వారి భవితవ్యానికి కృషి చేయాలని చెప్పిన నెహ్రూ ఆకాంక్షల మేరకు చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ

- మిగతా 2 లో

నదుల అనుసంధానంపై వెనక్కి తగ్గం

గోదావరి-కృష్ణా-పెన్నాపై దృష్టి

పోలవరం కాల్వ సామర్థ్యం పెంపుపై కసరత్తు: ఏపీ సీఎం చంద్రబాబు

2వ

శ్రీలంకలో నేడు పోలింగ్

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

2వ

ట్రంప్ కొలువులో మస్క్, వివేక్!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు. ట్రంప్ గెలుపులో ప్రధాన కారకులుగా ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి ముందువరుసలో ఉన్నారు. దీంతో ఆ ఇద్దరు బిలియనీర్లకు తన ప్రభుత్వంలో కీలక పదవులు కట్టబెట్టేందుకు ట్రంప్ సిద్ధమయ్యారు. వీరిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (డీఓజీఈ) హెడ్‌గా నియమించారు. 'మస్క్, రామస్వామి వృథా ఖర్చులు తగ్గించి, పరిపాలన సుగమం చేసేందుకు

- మిగతా 2 లో

ది గార్డియన్ ఇకపై 'ఎక్స్'కు దూరం

లండన్: ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'కు సంబంధించి బ్రిటన్ మీడియా సంస్థ 'ది గార్డియన్' కీలక నిర్ణయం తీసుకుంది. ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టబోమని ప్రకటించింది. ఇది జాత్యహంకారం, కుట్రలతోపాటు కలవరపరిచే అంశాలతో కూడుకున్న మాధ్యం కాబట్టే దానికి దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు తెలిపింది. 'ది గార్డియన్'కు ఎక్స్‌లో 1.07కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ వేదికలో ఆందోళన కలిగించే అంశాలే ఎక్కువగా కనిపిస్తున్నట్లు వార్తా సంస్థ పేర్కొంది. ప్రయోజనాల

- మిగతా 2 లో

పట్టాలెక్కనున్న హైడ్రోజన్ రైలు

న్యూఢిల్లీ: హైడ్రోజన్ రైలు త్వరలో పట్టాలెక్కబోతోంది. అతి పెద్ద రైల్వే నెట్‌వర్క్ కలిగిన భారతీయ రైల్వే ఈ రైలును తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. నీటినే ఇంధనంగా చేసుకుని నడిచే ఈ రైలు డిసెంబర్ నెలలో పట్టాలెక్కనుంది. హర్యానాలోని జింద్-సోనిపట్ మార్గంలో (90 కిలో మీటర్ల) దీన్ని కూత పెట్టించనుంది. ఆ తర్వాత పర్వత ప్రాంతాల రైల్వేలైన డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే, నీలగిరి మౌంటైన్ రైల్వే, కల్కా-సిమ్లా

- మిగతా 2 లో

బుల్డోజర్ న్యాయం రాజ్యాంగ విరుద్ధం

- అధికారులు న్యాయమూర్తులు కాలేరు
- మితిమీరిన చర్యలపై వారికి జరిమానా వేయాల్సిందే
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: 'బుల్డోజర్ జస్టిస్' రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ప్రభుత్వాలు, కార్యనిర్వాహక అధికారులు ఇష్టానుసారం ఇళ్లు కూల్చడం సరికాదని ఆగ్రహం వెలిబుచ్చింది. ఇష్టానుసారం ఇళ్లు కూల్చివేయడమంటే రాజ్యాంగాన్ని, పౌర హక్కులను, ప్రజాస్వామ్యాన్ని విస్మరించడమేనని స్పష్టంచేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. దీనిపై 11 కీలక విషయాలను తీర్పులో వెల్లడించింది. కార్యనిర్వాహకుడు ఎప్పటికీ న్యాయమూర్తి కాలేరని, నిందితుడిని దోషిగా ప్రకటించలేరని, వారి ఇంటిని కూల్చివేయలేరని ఘాటుగా వ్యాఖ్యానించింది. నేరాలకు పాల్పడిన వారి ఇళ్లు కూల్చివేయడం, బుల్డోజర్ న్యాయం అనే భావనను సుప్రీం కోర్టు తప్పుపట్టింది. అక్రమంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఇళ్లు కూల్చివేతకు పాల్పడిన అధికారుల నుంచి... వారి వేతనం నుంచి బాధితులకు పరిహారం అందించాలని ఆదేశించింది.

చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా, నిందితుల పేరుతో ప్రభుత్వ యంత్రాంగం నివాస, వాణిజ్య ఆస్తులు కూల్చివేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సుదీర్ఘ తీర్పు

- మిగతా 2 లో

అసభ్య పోస్టులపై
కేసులు పెడితే తప్పేంటి?

- పోలీస్ చర్యలను నిలువరిస్తూ ఉత్తర్వులు ఇవ్వలేం
- అభ్యంతరాలుంటే నిందితులే కోర్టును ఆశ్రయించవచ్చు
- సోషల్ మీడియా పోస్టులపై ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసభ్యకర పోస్టులు పెట్టినవారిపై పోలీసులు కేసులు పెడితే తప్పేమిటని హైకోర్టు ప్రశ్నించింది. సోషల్ మీడియాలో పోస్టుల వ్యవహారంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు కేసులు పెడుతున్నారంటూ పిల్ దాఖలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు మూకుమ్మడిగా కేసులు నమోదు చేస్తున్నారంటూ జర్నలిస్టు విజయబాబు దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టులో బుధవారం విచారణ జరగ్గా... ఈ కేసులకు సంబంధించి పిటిషన్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అసభ్యకర పోస్టులు పెట్టినవారిపై పోలీసులు కేసులు పెడితే తప్పేమిటని కోర్టు ప్రశ్నించింది. చివరికి న్యాయమూర్తులను కూడా

- మిగతా 2 లో

'అనుముల' కుంభకోణాలు
బయటపెట్టేందుకే ఢిల్లీ వెళ్లా

సీఎం మూర్ఖపు నిర్ణయాల వల్లే కొడంగల్ రైతుల తిరుగుబాటు: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: తాను ఢిల్లీకి వెళ్లింది అనుముల కుటుంబ కుంభకోణాలు బయటపెట్టేందుకేనని, ఇలా... కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తాను ఢిల్లీకి వెళితే బీజేపీతో కాళ్ల బేరానికి వెళ్లినట్లా... మరీ బీజేపీకే చెందిన గవర్నర్‌ను రేవంత్ రెడ్డి కలిస్తే అది కాళ్ల బేరానికి వెళ్లినట్లు కాదా అని ప్రశ్నించారు. అదాని కాళ్లు పట్టుకొని... పొంగులేటి తనపై ఈడీ కేసు లేకుండా చూసుకున్నాడా లేదా చెప్పండన్నారు. తాను మలేషియా వెళ్లకుండానే వెళ్లినట్లు మీడియా వాళ్లు ఎలా రాస్తారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, తుగ్లక్ పాలన వల్లే కొడంగల్ లో రైతులు తిరగబడ్డారని ఆరోపించారు. కేసీఆర్ ఎంతో ముందు చూపుతో వ్యవహరించి ముచ్చర్లలో ఫార్మా పార్క్ పెట్టి , 50 ఏళ్ల పాటు ఎలాంటి సమస్య లేకుండా ఫార్మా సిటీని డిజైన్ చేశారన్నారు. ఎనిమిదేళ్లు కష్టపడి దాదాపు 14 వేల ఎకరాలను సేకరించామని, అప్పుడు ఇదే కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... ఫార్మా సిటీ వస్తే మీ ప్రాంతం కాలుష్యం అవుతుందని ప్రజలను రెచ్చగొట్టారని విమర్శించారు. ఫార్మా సిటీని వదిలి ముఖ్యమంత్రి తుగ్లక్ నిర్ణయాలు తీసుకున్నాడని దాని

- మిగతా 2 లో

ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తం

- పన్నులు 52 పైసలు వస్తే... 30 పైసలు రుణాలు
- జీతాలకు 15, డీబీటీకి 13, వడ్డీలకు 12 పైసల చెల్లింపు
- ప్రధాన పనులకు కేవలం 9 పైసలే ఖర్చు
- వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగట్టిన కాగ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తంగా సాగినట్లు కాగ్ తన నివేదికలో ఎండ గట్టింది. ఆదాయానికి, ఖర్చుకు పొంతనలేదని పేర్కొంది. అభివృద్ధి పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అక్షింతలు వేసింది. ఆదాయానికి మించి అప్పులు చేయడం, సంక్షేమం పేరుతో జరిగిన దుబారా తదితర ఆర్థిక వ్యవహారాల తీరును కాగ్ నివేదిక బయటపెట్టింది. 2023-24లో రూపాయిలో 52 పైసలు పన్ను వసూళ్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ కాగా... రూపాయిలో 30 పైసలు రుణాల ద్వారా తెచ్చారని కాగ్ వెల్లడించింది. అత్యంత కీలకమైన స్థానిక సంస్థల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులపై నిర్లక్ష్యం చేసిందని, రూపాయిలో కేవలం 9 పైసలే చెల్లించినట్లు తెలిపింది. గ్రాంట్-ఇన్-ఎయిడ్ 14 పైసలు, రుణాల రికవరీ ద్వారా పైసా ఆర్జించినట్లు వివరించింది. రూపాయిలో 15 పైసలు జీతాలకు వెచ్చించిందని, వివిధ రకాల సంక్షేమ పథకాలకు సంబంధించి డీబీటీలకు 13 పైసలు, వడ్డీలకు 12 పైసలు చెల్లించినట్లు తెలిపింది. ప్రధానమైన పనులకు 9 పైసలే వెచ్చించిందని, మూలధన వ్యయంగా 9 పైసలే ఖర్చు చేసినట్లు పేర్కొంది. 2023-24లో రాష్ట్ర సొంతపన్ను ఆదాయం రూ.922 కోట్లుగా ఉండగా, 2023 ఏప్రిల్‌లో ఆర్బీఐ వద్ద రాష్ట్ర నిల్వ రూ.19 కోట్లు, 2024 మార్చిలో రూ.33 కోట్లు లోటు ఉందని కాగ్ వెల్లడించింది. ఏడాది చివరికి పెట్టుబడుల ఖాతాలో అసలు నగదు నిల్వ ఏమాత్రం లేదని తెలిపింది. అలాగే 2023-24లో ప్రభుత్వ అప్పులు రూ.4,86,151 కోట్లుగా పేర్కొన్న కాగ్... ప్రభుత్వ అప్పులు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 34 శాతంగా ఉన్నాయని వివరించింది. 2023-24లో రూ.2,23,004 కోట్ల మేర

- మిగతా 2 లో

విశాఖ మెట్రోపై
సీఎంపీ సిద్ధం

- కేంద్రం అనుమతి రాగానే పనులు మొదలు
- రెండు దశల్లో... నాలుగు కారిడార్లలో ప్రాజెక్టు
- ఏపీ అసెంబ్లీలో మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర రవాణా ప్రణాళిక (సీఎంపీ) సిద్ధం చేసినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఈ ప్రణాళికను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, వారి నుంచి అనుమతి రాగానే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖపట్నంకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

శ్రీలంకలో నేడు పోలింగ్

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కొలంబో: సార్వత్రిక ఎన్నికలకు శ్రీలంక సిద్ధమైంది. గురువారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారి తెలిపారు. దేశంలోని 13,314 పోలింగ్ స్టేషన్లలో 14వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, ఇతర పరికరాలను చేర్చినట్లు ఎన్నికల కమిషన్ డైరెక్టర్ జనరల్ తెలిపారు. ద్వీపదేశంలో అర్హులైన ఓటర్లు 1.7 కోట్ల మంది ఉన్నారు. దామాషా పద్ధతిలో జరిగే ఓటింగ్ ద్వారా 225 మంది పార్లమెంటుకు ఎన్నికవుతారు. అత్యధికంగా పశ్చిమ ప్రావిన్స్ జిల్లా గంపాహా నుంచి 19 మంది, రాజధాని కొలంబో నుంచి 18 మంది ఎంపీలు కాబోతున్నారు. అత్యల్పంగా ట్రిన్‌కోమాలె నుంచి నలుగురు పార్లమెంటులో అడుగుపెడతారు. ఎన్నికల వేళ భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసులు, సైన్యాన్ని రంగంలోకి దింపారు. 90వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. మొబైల్ పోలీసు పెట్రోల్స్‌కు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు పోలీసు అధికారి నిహాల్ థాల్దువా తెలిపారు. అధికార పార్టీ నేషనల్ పీపుల్స్ పవర్ నేతృత్వ అధ్యక్షుడు అనురా కుమార దిసనాయకేకు తొలి అగ్నిపరీక్షగా ఈ ఎన్నికలు ఉన్నాయి. సెప్టెంబరు 21న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో దిసనాయకే 50శాతం ఓట్లు పొందారు. తాను ప్రతిపాదించిన అవినీతి వ్యతిరేక జవాబుదారీ సంస్కరణల కార్యక్రమం అమలు కోసం పార్లమెంటులో 113 సీట్ల మెజారిటీని కోరుకుంటున్నారు. మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె పోటీ చేయడంలేదు. 1977 నుంచి పోటీ చేస్తున్న ఆయన తప్పుకోవడం ఇదే మొదటిసారి. రాజపక్సే సోదరులు-మహీంద్ర, గోటబాయ, చమల్, బసిల్ కూడా ఎన్నికలకు దూరంగా ఉన్నారు. కాగా, దామాషా పద్ధతిలో 22 జిల్లాల నుంచి 196 మంది పార్లమెంటుకు ఎన్నికవుతారు. మరో29 మంది కుములేటివ్ ఓట్ల ద్వారా ఎన్నికవుతారు. తమకు అనకూలంగా వచ్చిన ప్రిఫరెన్షియల్ ఓట్ల ఆధారంగా స్వతంత్ర ఎంపీల ఎన్నిక ఉంటుంది.

ఇరాన్‌లో కామాంధుడికి బహిరంగ ఉరి

20 ఏళ్లలో 200 మందిపై అత్యాచారాలకు పాల్పడిన సీరియల్ రేపిస్ట్

టెహ్రాన్: ఇరాన్‌లో కామాంధుడిని బహిరంగంగా ఉరితీశారు. దోషి మహమ్మద్ అలీ సలామత్ సీరియల్ రేపిస్టు. 20 ఏళ్లుగా దాదాపు 200 మందిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఇతనికి ఇరాన్ సుప్రీంకోర్టు అక్టోబరులో మరణదండన విధించింది. పశ్చిమ నగరం హేదన్ శ్మశానంలో మంగళవారం తెల్లవారుజామున అతనిని ఉరి కంభమెక్కించారని ఇరాన్ మీడియా బుధవారం నివేదించింది. 43ఏళ్ల సలామత్ నగరంలో మందుల దుకాణం, జిమ్ నడిపేవాడు. అతను తమను లైంగికంగా వేధించినట్లు 200 మంది మహిళలు ఆరోపించారు. ఈ నేరాలనీ రెండు దశాబ్దాల కాలంలో జరిగాయి. డేటింగ్, పెళ్లి ప్రతిపాదనల ద్వారా మహిళలను సలామత్ లొంగదీసుకునేవాడని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. కొందరికి అబార్షన్ గుళికలూ ఇచ్చేవాడని తేలిపాయి. అయితే ఇరాన్‌లో ఈ మందులపై నిషేధముంది. ఇంత పెద్ద సంఖ్యలో అత్యాచారాలకు పాల్పడిన వ్యక్తి ఇరాన్ చరిత్రలో లేరు. సలామత్ జనవరిలో అరెస్టు అయిన తర్వాత వందల మంది నగర న్యాయశాఖ వద్దకు చేరుకొని అతనిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. 2005లో 20 మంది పిల్లలపై హత్యాచారానికి పాల్పడిన 24 ఏళ్ల కుర్రాడిని ఇరాన్ ఉరితీసింది. టెహ్రాన్‌లో తొమ్మిది మంది బాలికలు, మహిళలను అపహరించి, అత్యాచారం చేసిన చంపిన 28 ఏళ్ల వ్యక్తికీ 1977లో ఉరిశిక్ష విధించింది. మరణదండన విధించే టాప్ దేశాల్లో ఇరాన్ ఉన్నట్లు ఐరాస నిపుణులు సెప్టెంబరులో వెల్లడించారు.

బ్రిటన్ రచయిత్రి సమంత హార్వేకు బుకర్ ప్రైజ్

లండన్: బ్రిటిష్ రచయిత్రి సమంత హార్వేను ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్-2024 వరించింది. 'ఆర్బిటల్' నవలకుగాను ఆమె ఈ పురస్కారాన్ని గెలుచుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఆధారంగా ఈ నవలను ఆసక్తికరంగా మలిచారు. భూగోళం గురించి అందంగా వర్ణించినందుకు ఆమె అందరి మన్ననలు అందుకున్నారు. సమంత హార్వేకు 50,000 పౌండ్ల నగదు పురస్కారాన్ని అందజేశారు. భూగోళం, శాంతి కోసం గొంతెత్తే వారికి ఈ అవార్డు అంకితం ఇస్తున్నట్లు సమంత హార్వే ప్రకటించారు. 2020 తర్వాత బుకర్ పురస్కారాన్ని అందుకున్న తొలి బ్రిటిష్ రచయిత్రిగా సమంత హార్వే నిలిచారు.

నదుల అనుసంధానంపై వెనక్కి తగ్గం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్థిక సమస్యలు, సవాళ్లు ఉన్నప్పటికీ...నదుల అనుసంధానంపై ముందుకు పోతామని, అందులో భాగంగా గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానంపై దృష్టిపెట్టినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో కొత్త సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జలవనరుల శాఖపై అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో బుధవారం సీఎం సమీక్షించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం పూర్తిచేసి లక్షల ఎకరాల సాగునీటి అవసరాలు తీర్చామని సీఎం అన్నారు. దానికి కొనసాగింపుగా నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టంచేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్లేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఆ ప్రతిపాదనలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరముందన్నారు. గోదావరి నీటిని పోలవరం నుంచి కృష్ణా నదికి, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి బనకచర్లకు తరలించే ప్రాజెక్టు ప్రతిపాదనలపై చర్చించారు. రెండో ప్రతిపాదన కింద పోలవరం నుంచి కృష్ణానదికి, అక్కడి నుంచి బొల్లాపల్లికి, అక్కడి నుంచి సోమశిల ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎక్కువ మొత్తంలో గోదావరి నీటిని తీసుకునేందుకు పోలవరం కుడి కాలువ సామర్థ్యం పెంచడం కోసం విస్తరణ చేపట్టాలా లేక కాల్వలకు సమాంతరంగా మరో కాలువ తవ్వాలా అనే అంశంపైనా చర్చించారు. రెండు ప్రతిపాదనల్లో దేని ద్వారా అయితే సత్వర ఫలితాలు వస్తాయి ?, దేనికి తక్కువ ఖర్చు అవుతుందనే అంశాలపైనా అధికారులు ప్రాథమిక వివరాలు తెలిపారు. మూడు నదుల అనుసంధానంతో పాటు పోలవరం కాలువ సామర్థ్యం పెంపుపై మరింత కసరత్తు చేయాలని సీఎం సూచించారు. ఆర్థికంగా ఇదొక పెద్ద సవాల్ అయినా... రైతుల అవసరాలను, రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టు చేపట్టాలనే ఆలోచనలో తాను ఉన్నట్లు తెలిపారు.

పోలవరం ఆర్‌అండ్‌ఆర్ పనులపై చర్చ

పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ పనులపై అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. పునరావాసం కోసం ఇంకా 18,925 ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2022 నుంచి పోలవరం పునరావాస కాలనీల్లో అన్ని నిర్మాణాలను కాంట్రాక్టర్లు నిలిపివేసినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులే రూ.155 కోట్లు వరకు ఉన్నాయని తెలిపారు. పాతధరతో ఇప్పుడు పనులు చేయలేమని కాంట్రాక్టర్లు చెపుతున్నారని అధికారులు వివరించారు. దీనిపై చర్చించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. తిరిగి పోలవరం పనులు ప్రారంభించడంతో పాటు భూసేకరణ, పునరావాసం పనులు కూడా సమాంతరంగా చేపట్టాలని సీఎం సూచించారు. తక్షణ అవసరాల కింద రూ.2,600 కోట్లు అవసరమని అధికారులు తెలపగా, దీనిపై త్వరలో ఆదేశిస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న వాటర్ పాలసీపైనా చర్చించారు. సమీక్షలో జనవనరుల శాఖమంత్రి రామానాయుడు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశాఖ మెట్రోపై సీఎంపీ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వెలగపూడి రామకృష్ణ బాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2014 విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ఐటం 12 ప్రకారం విజయవాడ, విశాఖకు మెట్రో రైలుపై ఫీజిబులిటీ రిపోర్ట్ ఇవ్వాలని పొందుపరిచారు. దీని ప్రకారం 2014లో డీపీఆర్ సిద్ధం చేయాలని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు నాటి టీడీపీ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఆ తర్వాత 2015 లోనే డీఎంఆర్సీ ఏపీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. విశాఖపట్నంకు సంబంధించి 42.5 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో మూడు కారిడార్లతో మీడియం మెట్రో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇచ్చారు. 2019 ఏప్రిల్‌లో టెండర్లు పిలవగా కొన్ని కంపెనీలు బిడ్లు కూడా దాఖలు చేశాయి. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసి ఉంటే విశాఖపట్నంతో పాటు విజయవాడకు మెట్రో రైలు వచ్చి ఉండేది. కానీ విశాఖపట్నంలో భోగాపురం వరకూ పొడిగింపు సాకుతో ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టేశారని మంత్రి నారాయణ తెలిపారు. తిరిగి 2020 మార్చి 19వ తేదీన గుర్‌గ్రామ్‌కు చెందిన వీఎంటీసీ అనే కంపెనీకి విశాఖ మెట్రో డీపీఆర్ బాధ్యతలు అప్పగించగా మొత్తం 76.9 కి.మీతో రూ.14,300 కోట్ల ఖర్చుతో నాలుగు కారిడార్లలో ఏర్పాటుకు డీపీఆర్ ఇచ్చిందని వివరించారు. 2021 ఏప్రిల్‌లోనే డీపీఆర్ ఇచ్చినప్పటికీ 2023 డిసెంబరు 15 వరకూ వైసీపీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరలా కలకత్తా మెట్రో రైల్ తరహాలో వంద శాతం కేంద్ర ప్రభుత్వం భరించేలా రైల్వే శాఖకు అప్పగించేలా కేంద్రం ముందు ప్రతిపాదన ఉంచామన్నారు. రెండు దశల్లో నాలుగు కారిడార్లలో మెట్రో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. మొదటి దశలో 46.23 కి.మీ మేర మూడు కారిడార్లలో నిర్మాణం చేస్తామన్నారు. మొదటి కారిడార్‌ను స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకూ 34.4 కి.మీ, రెండో కారిడార్‌లో గురుద్వార నుంచి ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ వరకూ 5.07 కి.మీ మేర, మూడో కారిడార్‌లో తాటిచెట్ల పాలెం నుంచి చిన వాల్తేరు వరకు 6.75 కి.మీ మేర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తంగా 46.23 కి.మీ మేర 42 స్టేషన్లతో నిర్మించే ప్రాజెక్టుకు రూ.11,498 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామన్నారు. ఇక రెండో దశలో కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం ఎయిర్ పోర్ట్ వరకూ 30.67 కి.మీ మేర 12 స్టేషన్లతో మెట్రో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు.

పట్టాలెక్కనున్న హైడ్రోజన్ రైలు

(మొదటిపేజీ తరువాయి)

రైల్వేతో పాటు మరికొన్ని మార్గాల్లో నడిపేందుకు ఆలోచన ఉంది. ఈ రైలు నడవడానికి హైడ్రోజన్ ఫ్యూయల్ టెక్నాలజీ వినియోగిస్తారు. హైడ్రోజన్ రైలు అభివృద్ధికి రూ.80 కోట్లు ఖర్చు అవుతుందన్న అంచనా ఉంది. 2025 నాటికి మొత్తం 35 హైడ్రోజన్ రైళ్లు పట్టాలెక్కాలని భారతీయ రైల్వే లక్ష్యం పెట్టుకుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ కలిసి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ రైలు నడిచేందుకు గంటకు 40వేల లీటర్ల నీరు అవసరం అవుతుంది. గంటకు గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. శబ్దం కూడా చాలా తక్కువే. ఒకసారి ఫ్యూయల్ ట్యాంక్ నింపితే వెయ్యి కిలోమీటర్లు వెళ్లగలదు. 2018 నుంచి జర్మనీలో హైడ్రోజన్ రైళ్లు తిరుగుతున్నాయి.

ది గార్డియన్ ఇకపై 'ఎక్స్'కు దూరం

(మొదటిపేజీ తరువాయి)

కంటే ప్రతికూలత ఎక్కువగా ఉన్నందున ఎక్స్‌ను నిషేధిస్తున్నట్లు తెలిపింది. దీనిపై ఎక్స్ అధినేత మస్క్ స్పందిస్తూ.. అవన్నీ అసంబద్ధమైనవన్నారు. అమెరికా ప్రభుత్వంలో మస్క్ కీలక బాధ్యతలు తీసుకోనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

బయటపెట్టేందుకే ఢిల్లీ వెళ్లా

(మొదటిపేజీ తరువాయి)

కారణంగానే ప్రజలు తిరగబడుతున్నారు తప్ప ప్రజల తిరుగుబాటులో ఎవరి కుట్ర లేదని స్పష్టం చేశారు. కొడంగల్‌లో ఫార్మా విలేజ్ విషయంలో ఆరు నెలల నుంచే ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ముఖ్యమంత్రి సోదరుడు తన్ని తీసుకుంటామని రైతులను బెదిరించిన ఆడియో కూడా ఉందన్నారు. ఫార్మా విలేజ్ వద్దని కొడంగల్ రైతులు సీఎంను, తమను, బీజేపీ వాళ్లను కూడా కలిశారని వివరించారు. కొడంగల్ రగలుతుండటానికి రేవంత్ ఆనాలోచిత నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు. సొంత నియోజకవర్గంలో రైతులు అరెస్ట్ అవుతుంటే సీఎం మహారాష్ట్రలో ప్రచారానికి వెళ్లడాన్ని కేటీఆర్ తప్పుపట్టారు. పట్నం నరేందర్ రెడ్డి ని పోలీసులు అరెస్ట్ చేయలేదని... కిడ్నాప్ చేశారని, ఆయనేమైనా బందిపోటా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అల్లుడుకు చెందిన మ్యాక్స్ బీఎన్ కంపెనీ విస్తరణ కోసమే రైతుల భూములను తీసుకుంటున్నారని, అన్నం శరత్ అనే వ్యక్తి కూడా ఉన్నాడని ఆయన మెడికవర్ హాస్పిటల్ యజమాని అని తెలిపారు. శరత్ అల్లుడు, రేవంత్ రెడ్డి అల్లుడు ఇద్దరు ఒకే సంస్థలో డైరెక్టర్లు అని తెలిపారు. వాళ్ల ఇద్దరి కోసమే ఫార్మా విలేజ్ పేరుతో అక్రమాలు చేసేందుకు ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. బెంగళూరులోనూ మెడికవర్ హాస్పిటల్‌ను అక్కడి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రారంభించారని గుర్తు చేశారు. కొడంగల్‌లో సురేశ్ అనే బీఆర్ఎస్ కార్యకర్త ... తన ఏడు ఎకరాల భూమి పోతోంది... అంత విలువైన భూమి పోతదంటే అడగటం తప్పా అని నిలదీశారు. కలెక్టర్ అభిప్రాయ సేకరణకు వచ్చినప్పుడు రైతుల బాధలను ఆయనకు చెప్పాడు, ఎక్కడా దాడి చేయలేదని, అతడు దాడికి పాల్పడినట్లు ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

అసభ్య పోస్టులపై కేసులు పెడితే తప్పేంటి?

(మొదటిపేజీ తరువాయి)

అవమానపర్చేలా పోస్టులు పెట్టారని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. సోషల్ మీడియా పోస్టులపై పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వలేమని తెలిపింది. ఒకవేళ పోలీసులు పెట్టిన కేసులపై అభ్యంతరం ఉంటే సంబంధిత వ్యక్తులు నేరుగా కోర్టును ఆశ్రయించవచ్చునని తెలిపింది. సోషల్ మీడియా వేదికగా అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై... పోలీసులు చట్టనిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తుంటే తాము ఎలా నిలువరించగలమని వ్యాఖ్యానించింది. పిల్‌కు సంబంధించి తగిన ఉత్తర్వులు ఇస్తామని హైకోర్టు పేర్కొంది. ఇటీవల కాలంలో కొన్ని సోషల్ మీడియాల్లో కొంతమంది ఒక గ్రూపుగా ఏర్పడి మహిళలను దూషిస్తూ పెట్టిన పోస్టులను అడ్వకేట్ జనరల్ హైకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడే విధంగా వీరి పోస్టులు అత్యంత జుగుప్సాకరంగా ఉంటాయని తెలియజేశారు. అటువంటివారి మీద మాత్రమే పోలీసులు విచారణ చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు వివరించారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారిని పోలీసులు చట్ట ప్రకారం తప్పనిసరిగా కేసులు నమోదు చేస్తారని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ హైకోర్టు బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వబోదని పునరుద్ఘాటించింది. ఈ విధంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టడం క్షమార్హం కాదని హైకోర్టు స్పష్టం చేసింది.

ఇజ్రాయిల్ దాడిలో 33 మంది మృతి

బీరుట్: ఇజ్రాయిల్ దాడుల్లో సుమారు 33 మంది మరణించినట్లు లెబనాన్ తెలిపింది. మృతుల్లో అధిక శాతం మంది నిరాశ్రయులేనని పేర్కొంది. బీరుట్‌లోని దక్షిణ శివారుల్లోని హిజ్బుల్లా స్థావరాలే కాకుండా సాధారణ ప్రాంతాలు లక్ష్యంగా ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తున్నట్లు తెలిపింది. బీరుట్‌కు దక్షిణంగా ఉన్న చౌఫ్ ప్రాంతంపై జరిగిన దాడిలో సుమారు 15 మంది మరణించినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. వీరిలో నలుగురు చిన్నారులు, ఎనిమిది మంది మహిళలు ఉన్నట్లు తెలిపింది. మరో 12 మంది గాయపడ్డారని పేర్కొంది.

ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ గ్యారెంటీలు ఇచ్చారని, రూ.69,626 కోట్లు కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి పీడీ ఖాతాలకు బదిలీ చేశారని తెలిపింది. చెల్లించిన అప్పు రూపాయిలో 7 పైసలే ఉందని, శాసనసభ అనుమతి లేకుండానే విద్యాశాఖలో రూ.249 కోట్లు ఖర్చు చేశారని కాగ్ తన నివేదికలో వెల్లడించింది. ఇంకా వివిధ శాఖల్లో జరిగిన దుబారాను, ఆర్థిక అవకతవకలను కాగ్ ఎండగట్టింది.

ఇప్పటి వరకు ఎందుకు ఆలస్యమైంది

మోదీకి జైరాం రమేశ్ ప్రశ్న

న్యూదిల్లీ: బీహార్ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీకి కాంగ్రెస్ ప్రతినిధి జైరాం రమేశ్ కీలక ప్రశ్నలు సంధించారు. దర్భంగాలో ఎయిమ్స్ ఎందుకు ఆలస్యమైందని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ ఆలస్యంపై నాన్ బయోలాజికల్ పీఎం సమాధానమిస్తారా, మైథిలీ భాషను బీజేపీ ఎందుకు నిర్లక్ష్యం చేసిందని, ముజఫర్‌పూర్, పూర్నియా లేదా భగల్‌పూర్‌కు హామీ ఇచ్చిన విమానాశ్రయం ఎక్కడ ఉందని నిలదీశారు. ప్రధాని మోదీ బుధవారం బీహార్‌లోని దర్భంగాలో పర్యటించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పై ప్రశ్నలకు సమాధానమివ్వాలని జైరాం రమేశ్ ఎక్స్‌లో డిమాండ్ చేశారు. 2015-16 కేంద్ర బడ్జెట్‌లో అప్పటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ దర్భంగాలో ఎయిమ్స్‌ను ప్రకటించారు. అప్పటి నుండి స్థానికులు ఆస్పత్రి కోసం ఎదురు చూస్తున్నారు. కానీ పని ప్రారంభం కావడానికి తొమ్మిదేళ్లు పట్టిందని జైరాం రమేశ్ విమర్శించారు. తమ గొప్ప కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే.. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పన్నాగాలతో ఆలస్యమైందని ఎద్దేవా చేశారు. మైథిలీ అనేది షెడ్యూల్ చేయబడిన భాష. ఇది రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చబడింది. 1968లో అధికారిక భాషా తీర్మానానికి కట్టుబడి ఉంది. పదేళ్ల పాటు కేంద్రంలో, 13 ఏళ్ల పాటు బీహార్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ఈ తీర్మానాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. 2015లో మోదీ ముజఫర్‌పూర్, పూర్నియా లేదా భగల్‌పూర్‌లో విమానాశ్రయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆరేళ్లు, మూడుసార్లు నితీశ్‌కుమార్ యూటర్న్‌ల తర్వాత కూడా ఆయన ప్రభుత్వం హామీని నెరవేర్చలేదని అన్నారు. భారతీయ జుమ్లా పార్టీ హయాంలో బీహార్ ప్రజలకు లభించినవన్నీ ఉత్తుత్తి వాగ్దానాలేనని ఎద్దేవా చేశారు. 2021లో చేపట్టాల్సిన జనగణనను ఇప్పటికైనా ముందుకు తీసుకువెళ్తారా అని ప్రశ్నించారు.

'బుల్డోజర్ న్యాయం' రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వెలువరించింది. 'అధికారి ఏకపక్ష పద్ధతిలో, ఒక పౌరుడిపై నేరారోపణలు ఉన్నాయనే కారణంతో వారి ఇంటిని కూల్చివేయడం చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే అవుతుంది' అని న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. అధికారులు ఒక వ్యక్తి దోషి అని తేల్చి చెప్పలేరని, జడ్జిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని ధర్మాసనం పేర్కొంటూ... రాష్ట్రాలు, ఆయా ప్రభుత్వాల అధికారులు మితిమీరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ధిక్కార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కూల్చివేత ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘిస్తే... ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల జీతం నుంచి వసూలు చేయాలని తెలిపింది. అనేక ఆదేశాలు జారీ చేస్తూ ధర్మాసనం ఇలా పేర్కొంది. 'రాష్ట్రాల ఏకపక్ష చర్యల నుంచి పౌర హక్కులకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో అతడి ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు కలగలిసి ఉంటాయి. దానిలో వారి భవిష్యత్, భద్రత ఇమిడి ఉంటుంది. ఆ ఇంట్లో ఒక్కరే నిందితుడు అయినప్పుడు... అందులో నివసించే మిగతా వ్యక్తులకు ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారు? అలాగే... 'స్థానిక మునిసిపల్ చట్టాల ద్వారా అందించబడిన సమయానికి అనుగుణంగా లేదా అటువంటి నోటీసును అందించిన తేదీ నుంచి 15 రోజులలోపు ముందస్తు షోకాజ్ నోటీసు లేకుండా కూల్చివేతలు నిర్వహించకూడదు' అని పేర్కొంది. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా యజమానికి నోటీసు అందించాలని, అదనంగా నిర్మాణం బయటి భాగంలో కూడా నోటీసు అతికించాలని ఆదేశించింది. మూడు నెలల్లో మునిసిపల్ అధికారులు ఒక డిజిటల్ పోర్టల్‌ను సిద్ధం చేయాలి. ఇప్పటివరకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు, అక్రమ నిర్మాణాలపై తుది ఉత్తర్వులకు సంబంధించిన వివరాలు అందులో పొందుపరచాలని స్పష్టం చేసింది. కాగా, బుధవారం సుప్రీంకోర్టు తీర్పు నుంచి 11 కీలక సారాంశాలు ఇక్కడ ఉన్నాయి.

'ఏకపక్షంగా ఇళ్లు కూల్చివేస్తే...'

'కార్యనిర్వాహకుడు ఏకపక్షంగా నేరారోపణలు ఉన్న పౌరుల ఇళ్లు కూల్చివేయడం 'రూల్ ఆఫ్ లా' సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించడమే అవుతుంది. కార్యనిర్వాహకుడు న్యాయమూర్తిగా వ్యవహరించి, ఒక పౌరుడు నిందితుడు అనే కారణంతో కూల్చివేతకు పాల్పడినట్లయితే అది 'అధికార విభజన' సూత్రాన్ని ఉల్లంఘిస్తుంది. ఇలాంటి విషయాల్లో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న ప్రభుత్వ అధికారులు ఇటువంటి అత్యున్నత చర్యలకు జవాబుదారీగా ఉండాలని మేము అభిప్రాయపడుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.

ఈ కేసులో సమస్యను పరిశీలిస్తున్నప్పుడు ఖైదీలు, నిందితులు, అండర్ ట్రయల్ లేదా దోషులు అయినా, ఇతర పౌరుల వలే కొన్ని హక్కులు ఉంటాయని మేము పునరుద్ఘాటించవలసి ఉంటుంది. వారికి గౌరవం ఉండే హక్కు ఉంది. ఎలాంటి క్రూరమైన లేదా అమానవీయమైన ప్రవర్తనకు గురికాకూడదు. అలాంటి వారికి విధించే శిక్ష చట్టానికి లోబడి ఉండాలి. ఆ శిక్ష అమానుషం లేదా క్రూరమైనది కాకూడదని తెలిపింది. ఒక పౌరుడి ఇల్లు కేవలం నిందితుడిగా ఉన్నందున లేదా చట్టం ద్వారా నిర్దేశించబడినందున కూల్చివేయబడితే... మా దృష్టిలో ఒకటి కంటే ఎక్కువ కారణాల వల్ల అది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం అవుతుంది. ముందుగా, అధికారి ఒక వ్యక్తిని దోషిగా ప్రకటించలేరు. ఎందుకంటే ఈ ప్రక్రియ న్యాయ సమీక్షలో ప్రాథమిక అంశం. నేరారోపణల ఆధారంగా మాత్రమే, అధికారి అటువంటి నిందితుడి ఆస్తి/ఆస్తులు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా కూల్చివేస్తే, అది చట్టబద్ధమైన ప్రాథమిక సూత్రాన్ని దెబ్బతీస్తుంది. అనుమతించబడదు. అధికారి న్యాయమూర్తిగా మారలేరు. నిందితుడు దోషి అని నిర్ణయించలేరు. అందువల్ల అతని ఆస్తులను పడగొట్టడం ద్వారా అతన్ని శిక్షించలేరు. అధికారి అటువంటి చర్య దాని పరిమితులను అతిక్రమించినట్లు అవుతుంది.

అధికారులు సహజ న్యాయ సూత్రాలు పాటించడంలో విఫలమైనప్పుడు, సరైన ప్రక్రియ సూత్రానికి కట్టుబడి ఉండకుండా ప్రవర్తించినప్పుడు, ఒక భవనాన్ని బుల్డోజర్‌తో కూల్చివేయడం చట్టవిరుద్ధమైన వ్యవహారాలను గుర్తు చేస్తుంది. 'చట్టబద్ధ పాలన' పునాదిపై ఆధారపడిన మన రాజ్యాంగంలో ఇటువంటి అత్యున్నత, ఏకపక్ష చర్యలకు స్థానం లేదు. కార్యనిర్వాహకుడి చేతుల్లో ఇటువంటి మితిమీరిన చర్యలను చట్టం కఠినంగా వ్యవహరించవలసి ఉంటుంది. మన రాజ్యాంగ ధర్మాలు, విలువలు అటువంటి అధికార దుర్వినియోగాన్ని అనుమతించవు అటువంటి చర్యలను న్యాయస్థానం సహించదని ధర్మాసనం స్పష్టంచేసింది.

కుటుంబసభ్యులను వీధుల్లోకి లాగడం సంతోషమా?

కూల్చివేత ఉత్తర్వులు ఆమోదం పొందిన తర్వాత కూడా తగిన వేదిక ముందు కూల్చివేత క్రమాన్ని సవాలు చేయడానికి బాధితపక్షానికి కొంత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని మేము అభిప్రాయపడుతున్నాం. కూల్చివేతను సవాలు చేయని వారి విషయంలో కూడా ఆ వ్యక్తులు ఖాళీ చేసేందుకు, ఏర్పాట్లు చేసుకోవడానికి తగినంత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉంది. మహిళలు, పిల్లలు, వృద్ధులను రాత్రిపూట వీధుల్లోకి లాగడం సంతోషకరమైన దృశ్యం కాదు. మరికొంత కాలం అధికారులు వేచిచూస్తే జరిగే నష్టం ఏమీలేదు. దేశవ్యాప్తంగా కొద్దికాలంగా 'బుల్డోజర్' చర్యలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇది రాజకీయాల్లో కీలక అంశమైంది. బుల్డోజర్ న్యాయం పేరుతో అనేక రాష్ట్రాలు ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో తొలుత మొదలైన ఈ ధోరణి... ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకూ పాకింది. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాలు నిందితుల ఇళ్లు, ప్రైవేటు ఆస్తుల పైకి బుల్డోజర్లు పంపించడాన్ని ఇప్పటికే అనేకసార్లు సుప్రీం కోర్టు తప్పుపట్టింది.

రాంగోపాల్ వర్మకు నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మకు ఏపీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎస్ఐ శివరామయ్య అధ్వర్యంలోని ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసుల బృందం బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని వర్మ నివాసానికి వెళ్లి నోటీసులు ఇచ్చింది. ఎన్నికలకు ముందు వ్యూహం సినిమా ప్రచారంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుటుంబంతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలు కించపరిచేలా వర్మ ఎక్స్‌లో పోస్టు పెట్టారంటూ రామలింగం పోలీస్ స్టేషన్‌లో టీడీపీ మద్దిపాడు మండల కార్యదర్శి ఫిర్యాదు చేశారు. మూడు రోజులు క్రితం కేసు నమోదైంది. దీంతో విచారణకు రావాలంటూ వర్మకు నోటీసులు జారీ అయ్యారు. వర్మపై తుళ్లూరులోనూ కేసు నమోదైంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ఫొటోలను గతంలో మార్ఫింగ్ చేసి అసభ్యంగా పోస్టులు పెట్టారంటూ ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు ఈ మేరకు తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్... రాష్ట్ర పోలీసుల పనితీరును ఆక్షేపించిన తర్వాత సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై ఫిర్యాదుల దర్యాప్తులో దూకుడు పెంచారు. అసభ్య పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుదాం

(మొదటిపేజీ తరువాయి)

జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. నెహ్రూ జయంతిని జాతీయ బాలల దినోత్సవంగా నిర్వహిస్తున్న సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలబాలికలే భావి భారత పౌరులని విశ్వసించి ప్రజా ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేయరాదన్న చిత్తశుద్ధితోనే ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా రెండు జతల యూనిఫామ్ అందించాలని, ఆ బాధ్యతను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందన్నారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్తు అందించే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. విద్యా సంస్కరణల్లో భాగంగా నిపుణులతో కూడిన విద్యా కమిషన్ ఏర్పాటు, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, కొత్త నియామకాలు అన్నీ నేటి పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలన్న సంకల్పంతో చేపట్టామని పేర్కొన్నారు. నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఏకీకృత గురుకుల పాఠశాలలకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు.

పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

నేతలు ఆరోపిస్తున్నారు. నిందితుల్లో ఒకరు పట్నం నరేందర్ రెడ్డితో ఎక్కువసార్లు ఫోన్లు మాట్లాడినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. దీంతో నరేందర్ రెడ్డిని విచారించేందుకు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయం సమాచారం. కాగా, పోలీసులు ఆయనను కొడంగల్ కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ఈ నెల 27 వరకు ఆయన జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండనున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆయనను చర్లపల్లి జైలుకు తరలించనున్నారు.

'పట్నం', రైతులను విడుదల చేయాలి: హరీశ్‌రావు

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. లగచర్లలో అధికారులపై దాడి ఘటన కేసులో అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. పచ్చని పొలాల్లో ఫార్మసిటీ పేరిట చిచ్చు పెట్టడమే మీ ప్రజాపాలనా... నడి రాత్రి రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో పెట్టడమే మీ ఇందిరమ్మ రాజ్యమా... అంటూ నిలదీ శారు. ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు, కేసులు, నిర్బంధాలతో అణిచివేయ లేరన్నారు. పట్నం నరేందర్ రెడ్డిని రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ట్రంప్ కొలువులో మస్క్, వివేక్!

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నిస్తారు' అని ట్రంప్ ఓ ప్రకటనలో తెలిపారు. 250వ వార్షికోత్సవం నాటికి సమర్థవంతమైన ప్రభుత్వం... దేశానికి బహుమతిగా ఉంటుందని ట్రంప్ అన్నారు. వీరితోపాటుగా ట్రంప్ తన ప్రభుత్వంలో ఓ మహిళకు కీలకపదవిని అప్పగించారు. హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీగా పనిచేయడానికి సౌత్ డకోటా గవర్నర్ క్రిస్టీ నోయెమ్‌ను ట్రంప్ ఎంచుకున్నారు. ఆమె కూడా ట్రంప్ విజయానికి దోహదపడ్డారు. కాగా, ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి ఎలాన్ మస్క్ మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం చేశారు. ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌కు మద్దతుగా మస్క్ పాల్గొన్నారు. వివేక్ రామస్వామి రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా పోటీకి నిలబడ్డారు. అయితే ఆయనకు ఆదరణ లేకపోవడంతో పోటీ నుంచి వైదొలిగి... ట్రంప్‌కు మద్దతుగా నిలిచారు.

వైద్యులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర- కొత్తగూడెం : రైతులపై ఎవరైనా దాడులకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ జితేష్ వి పాటిల్ చెప్పారు. అదే విధంగా క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం ఆసుపత్రులకు అనుమతులు ఉండాలని స్పష్టం చేసారు. బుధవారం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌పై ఐ.యం.ఎ సభ్యులతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రతి ఆసుపత్రిలో రోగుల హక్కులు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు అక్కడ పనిచేస్తున్న డాక్టర్ల, సిబ్బంది అర్హతను ఆసుపత్రికి వచ్చే వారికీ తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించేందుకు దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు తరలించి తక్షణ చికిత్స అందేందుకు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో, రక్త పరీక్ష కేంద్రాల్లో పరీక్షల యొక్క ధరల పట్టికను ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఐ.ఎం.ఎ అధ్యక్షులు అరికల భాస్కర్ మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం అనుమతులు లేని ఆసుపత్రులను క్లినిక్ లాబ్లను సీజ్ చేసి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. యాక్ట్ సభ్యులు డా. మధువరన్, డిప్యూటీ డెమో ఫైజ్ మొహియుద్దీన్, ఉమా మహేశ్వరీ, వివేక్ పాల్గొన్నారు.

నూతన జికె ఓసి ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఇల్లందు - విశాలాంధ్ర : సింగరేణి ఇల్లందు ఏరియాలో నూతనంగా మంజూరైనా జేకే ఉపరితల గనికి సంబంధించిన పనులు వేగిరంగా పూర్తిచేయాలని సింగరేణి సంస్థ మేనేజింగ్ ఎండ్ ప్లానింగ్ డైరెక్టర్ (పా) జి.వెంకటేశ్వర రెడ్డి అధికారులకు పలు సూచనలు చేసారు. బుధవారం ఇల్లందు ఏరియాలో పర్యటించిన ఆయన ఇక్కడి జనరల్ మేనేజర్ కార్యాలయంలో నూతన ప్రాజెక్ట్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జేకే ఉపరితల గనికి సంబంధించి మొదటి దశ అనుమతులు వచ్చాయన్నారు. తదుపరి అనుమతుల కోరకు చేయవలసిన పనుల వివరాలపై సంభందిత అధికారులకు దిశ నిర్దేశం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలని పలు సూచనలు చేశారు. అనంతరం గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్షుడు వాసి రెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కే.రాజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సారయ్య, బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జియం జాన్ ఆనంద్, ఓయస్డి వి.కృష్ణయ్య, యస్ ఓ టూ జియం బొల్లం వెంకటేశ్వర్లు, డిజియం మోహన్ రావు, ఎస్టేట్ అధికారి శివకుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రియురాలిని హత్య చేసి పత్తి చేలో పాతిపెట్టిన ప్రియుడు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఆధునిక యుగం సౌకర్యాలు మనిషిని పురోగతి వైపు తీసుకెళ్లే బదులు పచ్చని కాపురాల్లో శాపాలై కుటుంబాలను బలి తీసుకుంటున్నాయి. అక్రమ సంబంధాల హత్యలు, ఆత్మహత్యలు ఈ మధ్యకాలంలో బాగా పెరిగినట్లు పోలీసుల రికార్డులు చూస్తే అర్థమవుతుంది. ఈ క్రమంలోనే ఈజీ మనీ, వివాహేతర సంబంధాలు వెరసి ఒక యువతి ప్రాణం గాల్లో కలిసింది. వివరాల్లోకి వెళ్తే జూలూరుపాడు మండలం మాచినపేట తండాలో ప్రియుడి చేతిలో హత్యకు స్వాతి (32) ఉదంతం బుధవారం వెలుగు చూసింది. ఈ పరిణామం గిరిజన తండాల్లో భయాందోళనలకు గురిచేసింది. స్వాతితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ప్రియుడు వీరభద్ర హత్య చేసి తన తల్లితో కలిసి శవాన్ని గుట్టుచప్పుడుగా ఇంటి సమీపంలోని తన పత్తి చేలో పాతిపెట్టాడు. హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వీరభద్రం కొన్నేళ్ల క్రితం నందిని అనే యువతని పెళ్లి చేసుకున్న వివాహితుడు. కాగా స్వాతికి మణుగూరుకు చెందిన సాంబా అనే వ్యక్తితో గతంలోనే వివాహమైంది. సాంబ ఈ మధ్య కాలంలోలే మృతి చెందినట్లు తెలుస్తుంది. భర్త చనిపోయాక ఆమె కొత్తగూడెం పుట్టింటికి వచ్చేసింది. కొత్తగా ప్రారంభమైన ఇక్కడి షాపింగ్ మాల్‌లో పనికి కుదిరింది. అక్కడ రత్నకుమార్ అనే వివాహితుడు పరిచయమై, అక్రమ సంబంధాలు ఏర్పడ్డయని ఆరోపణలు ఉన్నాయి. తన తండ్రికి చెందిన సింగరేణి ఉద్యోగం వారసత్వంగా ఇప్పిస్తానని రత్నకుమార్‌తో స్వాతి నమ్మబలికి అతని వద్ద నుంచి రూ.16 లక్షలు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. ఎంతకాలమైనా ఉద్యోగం రాకపోవడంతో రత్నకుమార్ అతని భార్య పార్వతి ఆమెను నిలదీశారు. వీరభద్రం భార్య నందినిని చంపాలని, అయితేనే నీ డబ్బులు నీకు తిరిగి ఇస్తానంటూ షరతు పెట్టినట్లు అభియోగం వినిపిస్తుంది. తీవ్ర ఒత్తిడి గురైన రత్నకుమార్ ఇతని భార్య పార్వతి గత నెలలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిణామాల క్రమంలో స్వాతిని అడ్డు తొలగించుకోవాలని వీరభద్రం ఈ హత్య చేసినట్టు తెలుస్తుంది. కొత్తగూడెం డిఎస్పీ రహమాన్, జూలూరుపాడు సిఐ సంఘటనా స్థలానికి వెళ్లి పాతిపెట్టిన స్వాతి శవాన్ని బయటికి తీసి విచారణ చేస్తున్నారు.

ములుగు జిల్లాలో పర్యటించిన వైద్య విధాన పరిషత్ కమిషనర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లాల్లో ఆసుపత్రిలలో డాక్టర్ల పనితీరు, రోగులకు అందిస్తున్న సేవలను గురించి వైద్య అధికారులను, వైద్య విధాన పరిషత్ రాష్ట్ర కమిషనర్ అజయ్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. బుధవారం ములుగు జిల్లాలో ములుగు, గోవిందరావుపేట, పస్రా, ఏటూరునాగారం ప్రభుత్వా సామజిక ఆసుపత్రులను, వైద్య విధాన పరిషత్ రాష్ట్ర కమిషనర్ అజయ్ కుమార్ అకాస్మికంగ తనిఖీ చేశారు. ఆసుపత్రులలో డాక్టర్‌లు రోగులకు సరైన వైద్యం అందిస్తున్నారా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదరా నర్సింహా ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో పర్యటించడం జరిగిందని అన్నారు. ములుగు జిల్లాల్లోని ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఏటూరునాగారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో డాక్టర్‌ల పనితీరును అయన అభినందించారు. వైద్యులు విధులల్లో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని అయన అన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులతో డాక్టర్‌లు ప్రేమగా చూసుకోవాలని అయన అన్నారు. ఎవరైతే విధులల్లో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ అజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1690 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అవి కూడా భర్తీ చేస్తామని అయన అన్నారు. ఏటూరునాగారం ప్రభుత్వా సామజిక ఆసుపత్రి సూపరిడెంటెంట్ సురేష్ కుమార్, వివిధ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ప్రణాళిక రూపొందించాలి

మంత్రి కోమటి రెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో కావాల్సిన మౌలిక వసతులపై ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మున్సిపాలిటీ పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్గొండ మున్సిపాలిటీలో నూతన డంపింగ్ యార్డ్ నిర్మాణానికి స్థలాన్ని చూడాలని, స్లాటర్ హౌస్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఎక్కడా ఓపెన్ డ్రైనేజీ లేకుండా చూడాలని, పట్టణం చుట్టూ మినీ డంపింగ్ యార్డ్‌లు ఏర్పాటు చేయాలని అలాగే నల్గొండ మున్సిపాలిటీలో పారిశుధ్యంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే కార్యక్రమాన్ని కొనసాగించాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ కార్యాలయంలో 30 కోట్ల రూపాయల వ్యయంతో నూతన బ్లాక్‌ను నిర్మించేందుకు ఇదివరకే మంజూరు చేయడం జరిగిందని, సాధ్యమైనంత త్వరగా టెండర్లను పిలిచి 6 నెలల్లో ఈ బ్లాక్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డైట్ కళాశాల ముందున్న శిథిలావస్థలో ఉన్న ప్రహరీని పూర్తిగా తీసేసి కొత్త ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో మొత్తానికి సెంట్రల్ లైటింగ్‌ను పూర్తి చేయాలన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ప్రతిరోజు ప్రతి ఒక్కరికి వంద లీటర్ల తాగునీటిని అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని, ఇదివరకే పట్టణంలో పాత వాటర్ ట్యాంకులు 16 ఉండగా, అమృత్‌లో మరో 10 కొత్త ట్యాంకుల నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఇందుకు తగ్గట్టుగా స్టోరేజ్ కెపాసిటీ పెంచి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం నాటికి అన్ని ప్రతిపాదనలతో సిద్ధం చేసి సమర్పించాల్సిందిగా ఆదేశించారు. అలాగే హాలియా మున్సిపాలిటీకి సంబంధించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు, అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు నాగర్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జై వీర్‌రెడ్డిని సంప్రదించి డిపిఆర్‌ను రూపొందించాలని మంత్రి ఆదేశించారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, నల్గొండ ఆర్డిఓ అశోక్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ సూపరింటెం డెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

పత్తి రైతులపై నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం

సీపీఐ రైతు సంఘం నేత దొండపాటి

విశాలాంధ్ర -ఖమ్మం : అనేక కష్ట నష్టాలతో దిగుబడి తగ్గి చేతికొచ్చిన పత్తి పంట లను సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పత్తి రైతులు దళారీల చేతిలో నలిగిపోతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్ కుమార్ లు ఆరోపించారు బుధవారం ఏనుకూరు పత్తి మార్కెట్లో సందర్శించారు ఈ సందర్భంగా అక్కడ పరిస్థితులు చూసి పత్తి మార్కెట్లో దళారీల మార్కెట్ గా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు వ్యాపారులు కుమ్మక్కై రైతుల పత్తిని 6000 రూపాయలకు కొనుగోలు చేసి రైతులను మోసం చేయటం చాలా బాధాకరమని వారు అన్నారు ఏన్కూర్ ప్రాంతంలో ప్రతి జిన్నింగ్ మిల్లు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని ఏనుకూరు మార్కెట్లో పత్తి కొనుగోలు కోసం సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు మార్కెట్లో వే బ్రిడ్జి రిపేర్ లో ఉండి ఉపయోగ లేకపోవడం వల్ల ప్రైవేట్ వే బ్రిడ్జిలు ను రైతులు ఆచరించాల్సిన పరిస్థితి ఏర్పడదని నిరు ఉపయోగంగా ఉన్న మార్కెట్లో వే బ్రిడ్జిని తక్షణమే రిపేర్ చేయించి రైతులు అందుబాటులో కావాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు మార్కెట్ కావలసిన కనీస సౌకర్యాలను కల్పించి తక్షణమే మార్కెట్ లో రైతులకు మేలుకు జరిగే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు అమరనేని వీరభద్రం తాళ్లూరి రమణ మాదినేని వెంకన్న రాచ బండి ఎల్లయ్య రమేష్ కొత్తపల్లి బసవయ్య వెంకన్న ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కారేపల్లి : మండల పరిధిలో లింగమంజర గ్రామానికి చెందిన సూరపరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి- ఉమాదేవి దంపతుల కుమారుడు మనోజ్ రెడ్డి- మౌనికల వివాహం ఈనెల 10వ తేదీన జరగగా వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌తో కలిసి నూతన జంటను అభినందించి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి విందులో పాల్గొన్నారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, జిల్లా నాయకులు బానోతు రామ్మూర్తి, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ప్రముఖ వాస్తు పండితుడు వెగ్గళం నాగ బ్రహ్మాచారి, బానోత్ దేవులనాయక్, మేదరి టోనీ, పెద్దబోయిన ఉమాశంకర్, గుగులోతు శ్రీను నాయక్, గుగులోతు బీముడు నాయక్, మేదరి రాజా, వాంకుడోత్ గోపాల్, తోటకూరి రాంబాబు, దమ్మాలపాటి రాంబాబు, అడ్డగోడ ఐలయ్య, ఎండి హనీఫ్, పురం గోవర్ధన్, మొగిలిచర్ల మల్లేశ్వరరావు, దూడ అర్జున్ రావు, ఎండి యాకూబ్ అలీ, అజ్మీర్ హేమ్లా నాయక్ తదితరులున్నారు.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఆర్థిక ఫలితాలు వెల్లడి

ముంబయి : ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన క్యూ2, హెచ్1 ఎఫ్‌వై25 త్రైమాసికం, అర్ధ సంవత్సరానికి ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. చెప్పుకోదగిన మొదటి సగం పనితీరుతో, కంపెనీ ఈ సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి సిద్ధంగా ఉంది. నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) సెప్టెంబర్ 30, 2023 నాటికి రూ. 18,885 కోట్ల నుండి 2024 సెప్టెంబర్ 30 నాటికి రూ. 22,817 కోట్లకు 21% వృద్ధి చెందాయి. సెప్టెంబర్ 30, 2024 నాటికి మొత్తం రుణ ఖాతాల సంఖ్య 2,77,000కి చేరుకుంది. పన్ను తర్వాత లాభం 24% పెరిగి రూ. హెచ్1ఎఫ్‌వై24లో 344 కోట్లు నుంచి హెచ్1ఎఫ్‌వై25లో రూ.428 కోట్లకు పెరిగాయి. 30 సెప్టెంబర్ 2024 నాటికి నికర విలువ రూ. 5,872 కోట్లుగా ఉంది.

మహిళల నైపుణ్యాలపై జెర్రీ జోష్ అభిప్రాయం

ముంబయి: నేటి అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్‌లో, నైపుణ్యాల అంతరం అనేది కంపెనీలకు, అభ్యర్థులకు ఒక ముఖ్యమైన సవాలుగా మారింది. ప్రపంచ యువతలో మూడింట రెండు వంతుల లేదా అంతకంటే ఎక్కువ మంది అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడేందుకు అవసరమైన కనీస నైపుణ్య స్థాయిలను చేరుకోవడంలో విఫలమయ్యారని ఐఎంఎఫ్ పేర్కొంది. నేడు మహిళా గ్రాడ్యుయేట్ల శాతం పెరుగుతున్నప్పటికీ, మహిళలను ఉపాధి నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ఒక పెద్ద సవాలుగా మారిందని ఐసిఐసిఐ లాంబార్డ్ హ్యూమన్ రిసోర్సెస్ చీఫ్ జెర్రీ జోష్ తెలిపారు. ఎందుకంటే భారతదేశంలోని చాలా మంది మహిళలు తక్కువ నైపుణ్యం, తక్కువ జీతంతో కూడిన ఉద్యోగాలలో, అది కూడా అనధికారిక లేదా అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. మహిళల ఉపాధిని మెరుగుపరచడానికి, తత్ఫలితంగా, కార్మిక మార్కెట్‌లో వారి ప్రమేయాన్ని మెరుగుపరచడానికి ఈ అంతరాన్ని తక్షణమే పరిష్కరించాల్సి ఉంటుందని జెర్రీ జోష్ తెలిపారు.

డయాబెటీస్ అవగాహన కోసం 5కే వాక్

హైదరాబాద్: జాతీయ డయాబెటిస్ దినోత్సవం పురస్కరించుకొని నవంబర్ 14, 2024న, డయాబెటీస్ గురించి అవగాహన పెంచడానికి 5కే వాక్ జరుగుతుందని, ఇందులో పాల్గొనాలని, డయాబెటీస్‌పై పోరాటంలో మద్దతుగా, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి మనం కలసి ముందుకు పోదామంటూ ఐడియాక్లినిక్స్ వైద్యులు పిలుపునిచ్చారు. అలాగే, ప్రపంచ డయాబెటీస్ దినోత్సవం సందర్భంగా, ఐడియాక్లినిక్స్ ఫ్రీ డయాబెటిక్ రెటినల్ స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నది. ఈ స్క్రీనింగ్ క్యాంప్ డయాబెటిక్ రెటినోపతి ప్రమాదం ఉన్నవారికి పరీక్షలు నిర్వహిస్తుంది. ముందస్తు నిర్ధారణ ద్వారా పెద్ద సమస్యలని నివారించవచ్చు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దాం

విశాలాంధ్ర- పినపాక : మాదక ద్రవ్యాలను అరికట్టడంలో యువత బాధ్యత వహించాలని వాటిని నిర్మూలించి భావితరాలకు డ్రగ్స్ రహిత సమాజాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ - బయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, మణుగూరు డిఎస్పి ఆదేశాల మేరకు ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకోవడంతో మానసిక స్థితి కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా వారం రోజుల పాటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరకగూడెం ఎస్సై రాజేందర్, స్కూల్ డైరెక్టర్ యూసఫ్, ప్రిన్సిపాల్ నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలి

విశాలంధ్ర -గజ్వేల్ : గజ్వేల్‌లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో అధునాతనమైన భూసార పరీక్ష కేంద్రం నిర్మించిన ప్పటికీ నేటి వరకు కూడా రైతులకు అందుబాటులోకి రాలేదని సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగొండ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బిజెపి నాయకులు గజ్వేల్ పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం మార్కెట్ యార్డ్‌లో నిర్మించిన భూసార పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విడుదల చేసిన 82 లక్షల 20 వేల నిధులతో అధునాతన భూసార పరీక్ష కేంద్రాన్ని నిర్మించినప్పటికీ వృధాగా ఉండిపో యిందన్నారు. భూసార పరీక్షలు నిర్వహించేందుకు డిసెంబర్ నెల, మే నెలలో మాత్రమే సాధ్యమవుతుందని కావున ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు మేలు చేయాలని సూచించారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని,సన్న వడ్లకు బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్, నాయకులు ఉప్పల మధు సుధన్, పెండ్యాల శ్రీనివాస్, అరవింద్, నాయిని సందీప్, విజయ్, వెంకట్, హరి, నవీన్, పంజా బాలు, నరసింహ, దువ్వల రాజు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై పాఠశాల పిల్లల్లో అవగాహన

హైదరాబాద్: ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా ఐటీసీ లిమిటెడ్ సహకారంతో ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్ మెంట్ అయోడిన్ లోపం గురించి చైతన్యం కలిగించడం ఆరోగ్యకరమైన ఆహారం తిను పద్ధతుల పై పాఠశాల విద్యా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ మేరకు ఆదిలాబాద్, కలెక్టర్ క్యాంప్ ఆఫీసు పక్కన , కేఆర్ కె రోడ్, టిజిటి డబ్ల్యూయుఆర్ జిసి ఫర్ బాయ్స్ విద్యాసంస్థలో అయోడిన్ ఆహారం ప్రాధాన్యత పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బీబీనగర్‌లోని ఎయిమ్స్ సీనియర్ రెసిడెంట్, కమ్యూనిట, ఫ్యామిలీ మెడిసిన్ విభాగం వైద్యులు డాక్టర్ అలేఖ్య ఈ సందర్భంగా అయోడిన్ డెఫిషియెన్సీ డిజార్డర్స్ (ఐడిడి) ప్రాధాన్యతను తెలిపారు. అయోడిన్ తీసుకోవలసిన ప్రాధాన్యత, ఐడిడి వాటి లక్షణాలు తదితర అంశాల గురించి వివరించారు. ఐటిసి లిమిటెడ్ న్యూట్రిషన్ సైన్సెస్ విభాగ హెడ్ డాక్టర్ అగాథా బెట్సీ మాట్లాడుతూ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం ద్వారా, భారతీయులలో ముఖ్యంగా విద్యార్థులు, గర్భిణీలు, పాలిచ్చు తల్లులు, ఫ్రంట్ లైన్ కార్యకర్తలలో అయోడిన్ లోపం సమస్యను పరిష్కరించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. రాజన్న సిరిసిల్లలోని తంగళ్ళపల్లి జడ్పీ స్కూల్లో కూడా అవగాహన శిబిరం నిర్వహించారు. బీబీనగర్ ఎయిమ్స్ నుంచి డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొని అవగాహన కల్పించారు.

ఆల్ ఇండియా సీనియర్ నేషనల్స్‌కు కట్ట మణిశంకర్ ఎంపిక

హైదరాబాద్: చౌటుప్పల్‌లోని డాక్టర్ ముసుకు మధుసూదన్ రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌లో చదువుతున్న కట్ట మణిశంకర్ సబ్జీ మండి వీరాభిమన్యు అంశాల నుండి కట్ట లింగం కుమారుడు కట్ట మణిశంకర్ సుల్తాన్ సాయి ప్లే గ్రౌండ్‌లో జరిగిన హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ చాంపియన్షిప్ తెలంగాణ రాష్ట్ర చాంపియన్షిప్ కోసం నవంబర్ 12న బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. 6 డిసెంబర్ 2024న బెంగళూరులో జరగనున్న ఆల్ ఇండియా సీనియర్ నేషనల్స్‌లో ఆడేందుకు ఎంపికయ్యారు. వీరికి సబ్జి మండి వీరాభిమన్యు వైశాల వారు అభినందించి ఆల్ ఇండియా సీనియర్ నేషనల్‌లో కూడా బంగారి పథకాన్ని సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పరివర్తన్‌లో 3500 పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు

ముంబయి: భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం పరివర్తన్ అయినప్పటికీ, నాణ్యమైన విద్యతో భారతదేశం వ్యాప్తంగా యువ హృదయాలను ఉద్ధరించేందుకు, సాధికారత కల్పించేందుకు తన నిబద్ధతను స్మరించుకోవడం ద్వారా బాలల దినోత్సవాన్ని ఆచరిస్తోంది. గత 10 ఏళ్లలో, పరివర్తన్ 2.16 కోట్ల కన్నా ఎక్కువ మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేయడంతో పాటు 20.22 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చింది. అలాగే 2.87 లక్షల పాఠశాలలకు మద్దతు ఇచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పరివర్తన్ మద్దతు ఇస్తున్న పాఠశాలల్లో చురుకైన యువ విద్యార్థుల కోసం బ్యాంక్ 'లిటిల్ స్మయిల్స్ బిగ్ డ్రీమ్స్' పేరుతో డిజిటల్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని జామాపూర్, వారణాసి జిల్లాల నుంచి వచ్చిన కలాష్ కోమల్‌కు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన కథనం ఇది. వీరు జార్ఖండ్‌లోని రాంచీకి చెందిన గిరిజన రోజువారీ కూలీ కార్మికుల పిల్లలు. కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన స్మార్ట్ పాఠశాలలో చేరేందుకు వర్షాకాల వలసల సమయంలో వెనుక వరుసల్లో ఉండేవారు.

మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీలో పాసివ్ ఫండ్స్‌పై సర్వే

ముంబయి : మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఎంఓఏఎంసీ) భారతదేశంలో పాసివ్ ఫండ్స్లు పెట్టుబడిదారుల సర్వే 2వ ఎడిషన్ 2024, ది రైజ్ ఆఫ్ పాసివ్ పవర్: ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియాస్ ఇన్వెస్ట్‌మెంట్ ల్యాండ్‌స్కేప్ పేరుతో సమగ్ర రూపాన్ని అందిస్తోంది. భారతదేశంలో నిష్క్రియ పెట్టుబడి వ్యూహాలు. నిష్క్రియ ఫండ్స్ ఆర్థిక ల్యాండ్‌స్కేప్‌ను పునర్నిర్మించడం కొనసాగిస్తున్నందున, పెట్టుబడిదారులు మరియు పంపిణీదారులలో వారి ఆకర్షణ అపూర్వమైన స్థాయికి చేరుకుంది. అనుకూలమైన నియంత్రణ మద్దతు, వేగవంతమైన సాంకేతిక పురోగతులు, భారతీయ పెట్టుబడిదారులలో పెరుగుతున్న అవగాహన కారణంగా, నిష్క్రియ ఫండ్‌లు చెప్పుకోదగ్గ వృద్ధిని సాధించాయి, నిర్వహణలో ఉన్న ఆస్తులు సెప్టెంబర్ 2023లో 7 ట్రిలియన్ డాలర్ల నుండి సెప్టెంబర్ 2024 నాటికి 11 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ఒక కేవలం ఒక సంవత్సరంలోనే 1.5 రెట్లు పెరిగింది. మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీలో విభిన్న పెట్టుబడిదారుల లక్ష్యాలకు అనుగుణంగా ఉండే ఉత్పత్తుల సూట్‌ను అందించడం మా లక్ష్యమని మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ, సీఈఓ ప్రతీక్ అగర్వాల్ అన్నారు.

వినియోగదారుల హాలిడే షాపింగ్‌పై గోడాడీ సర్వే

న్యూఢిల్లీ: భారతీయ వినియోగదారుల హాలిడే షాపింగ్ ప్రవర్తనలపై గోడాడీ సర్వే విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం, 86% భారతీయ కోలుగోలుదారులు బ్లాక్ ఫ్రైడే, ఈ సంవత్సరం సెలవుల సీజన్‌లో చిన్న వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. (ప్రపంచ సగటు 72%తో పోలిస్తే) వారిలో 23% మంది వరకు 15 శాతం ఎక్కువ ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ద్రవ్యోల్బణం వినియోగదారుల వ్యయంపై అధిక ప్రభావం చూపుతుండగా భారతీయులు ఆశాజనకంగానే ఉన్నారు. గోడాడీ సర్వే ప్రకారం, 35% మంది భారతీయ వినియోగదారులు ద్రవ్యోల్బణం తమ హాలిడే షాపింగ్‌ను ప్రభావితం చేయదని చెప్పారు, మరో 30% మంది ద్రవ్యోల్బణం తాము షాపింగ్ చేసే విధానాన్ని ప్రభావితం చేస్తుందని చెప్పారు. సర్వే ఫలితాల ప్రకారం, 62% మంది భారతీయులు తమ హాలిడే షాపింగ్‌లో ఎక్కువ భాగం డిసెంబర్‌లోపు చేయాలని ప్రణాళిక చేస్తున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ లండన్‌తో సిమెన్స్, టి-హబ్ భాగస్వామ్యం

హైదరాబాద్: యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యుఈఎల్), సిమెన్స్ యుకె, టి-హబ్ హైదరాబాద్ సంయుక్తంగా 13 నవంబర్ 2024న సస్టైనబిలిటీని ముందుకు తీసుకువెళ్లడంలో పరిశ్రమ, ఉన్నత విద్య పాత్రపై దృష్టి సారించి అధిక-ప్రభావ కార్యక్రమంను నిర్వహించాయి. "అచీవింగ్ సస్టైనబుల్ హయ్యర్ ఎడ్యుకేషన్: ది పార్ట్నర్‌షిప్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ యూనివర్సిటీస్ "(సస్టైనబుల్ ఉన్నత విద్యను చేరుకోవటం, పరిశ్రమ, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం) అనే పేరుతో జరిగిన ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని టి-హబ్‌లో జరిగింది. విద్యలో సస్టైనబుల్ భవిష్యత్తు కోసం వినూత్న పరిష్కారాలను చర్చించడానికి విద్యా, పారిశ్రామిక రంగాలకు చెందిన ముఖ్య నాయకులను ఒకచోట చేర్చింది. సస్టైనబిలిటీకి దారితీసే దాని కొనసాగుతున్న ప్రయత్నాలలో భాగంగా, యుఈఎల్ దాని క్యాంపస్‌ను మార్చడానికి, 2030 నాటికి నికర-సున్నా కార్బన్ ఉద్గారాలను సాధించడానికి సిమెన్స్ యుకెతో భాగస్వామ్యం కుదుర్చుకుంది.

మధుమేహ నియంత్రణకు బాదంపప్పుల తోడ్పాటు

ముంబయి: ప్రపంచ మధుమేహ దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 14న నిర్వహించబడుతుంది. దీని ద్వారా మధుమేహం గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహనను పెంచుతున్నారు. 'ప్రపంచ మధుమేహ రాజధాని'గా పిలువబడే భారతదేశం మధుమేహ సవాలును ఎదుర్కొంటోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) ఇటీవలి అధ్యయనంలో 101 మిలియన్ల భారతీయులకు మధుమేహం ఉందని, 136 మిలియన్లకు ప్రీ-డయాబెటిక్ ఉన్నట్లు వెల్లడైంది. మనం తినే ఆహారం ద్వారా సమర్థవంతమైన మధుమేహ నిర్వహణ సాధ్యమవుతుంది. బాదం వంటి పోషకమైన ఆహారాలు చేర్చడం ఇందులో కీలకమైనది, ఇందులో ప్రొటీన్, అసంతృప్త కొవ్వులు, డైటరీ ఫైబర్ వంటి 15 ముఖ్యమైన పోషకాలు ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి సహాయపడే పోషకాలు. బాదం ఆరోగ్యకరమైన రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి, టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో బ్లడ్ షుగర్ నియంత్రణను మెరుగుపరచడానికి, కార్బోహైడ్రేట్-అధికంగా ఉన్న ఆహారంలో బ్లడ్ షుగర్ ప్రభావాన్ని తగ్గించటానికి తోడ్పడుతుందని ఫోర్టిస్ సి డాక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డయాబెటిస్, మెటబాలిక్ డిసీజెస్, ఎండోక్రినాలజీ (న్యూఢిల్లీ) ప్రొఫెసర్, ఛైర్మన్ డాక్టర్ అనూప్ మిశ్రా నేతృత్వంలో నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది.

టొయోటా కిర్లోస్కర్ గ్లాంజా, టైసర్, హైర్‌డైయర్ ప్రత్యేక ఎడిషన్ పరిచయం

బెంగుళూరు: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) దాని ప్రసిద్ధ మోడళ్లైన గ్లాన్జా, అర్బన్ క్రూయిజర్ టైసర్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లలో ప్రత్యేకమైన లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేయడం ద్వారా కార్ల కొనుగోలుదారులకు ఈ సంవత్సరాంతం గుర్తుండిపోయేలా చేసింది. ఇటీవల విడుదల చేసిన ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌లకు అద్భుతమైన స్పందన వచ్చిన తరువాత, స్పెషల్ లిమిటెడ్-ఎడిషన్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ (టిజిఎ) ప్యాకేజీలను అందించడం ద్వారా వినియోగదారుల కేంద్రీకృత పట్ల టొయోటా యొక్క నిబద్ధతను మరింత ముందుకు తీసుకువెళ్లింది. స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ కాకుండా, టొయోటా గ్లాంజా, అర్బన్ క్రూయిజర్ టైసర్ అండ్ రూమియన్ (సీఎన్‌జీ మోడల్‌లు మినహా)లో రూ. 1 లక్ష పైన ప్రత్యేకమైన ఇయర్ ఎండ్ ఆఫర్‌లను అందిస్తోంది. అద్భుతమైన వినియోగదారు ప్రయోజనాలు 31 డిసెంబర్ 2024 వరకు కొనసాగుతాయని టొయోటా కస్టమర్ ఫస్ట్ ఫిలాసఫీపై శబరి మనోహర్-వైస్ ప్రెసిడెంట్, సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్, టొయోటా కిర్లోస్కర్ మోటర్ తెలిపారు.

ఐఖ్యా ఇన్‌ఫ్రా డెవలపర్స్ 'ఈ5 వరల్డ్'కు అంకురార్పణ

హైదరాబాద్: ఐఖ్యా ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో ఐకేఎఫ్ ఫైనాన్స్ సహకారంతో హైదరాబాద్‌లో ఇరవై ఎకరాల విస్తీర్ణంలో లగ్జరీతో కూడిన రిసార్ట్ శైలి జీవనమే లక్ష్యంగా 'ఈ5వరల్డ్'కు అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో ఐకేఎఫ్ ఫైనాన్స్ వ్యవస్థాపకులు, ఈ5వరల్డ్ ప్రమోటర్ వీజీకే ప్రసాద్ మాట్లాడుతూ రిసార్ట్ స్టైల్ లివింగ్‌లో సరికొత్త కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తున్నామని చెప్పారు. ఇది లగ్జరీ, వెల్నెస్, నేచర్ సమతుల్యతతో డిజైన్ చేయబడిందన్నారు. ఇరవై ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ రిసార్ట్ ప్రత్యేకంగా రూపొందించామని తెలిపారు. ప్రీమియం సౌకర్యాలు కలవన్నారు. ప్రకృతి నుంచి స్ఫూర్తి పొందే ఆర్కిటెక్చర్ ఇక్కడ ప్రత్యేకత అన్నారు. దీనిని మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. మొదటి దశలో 1 నుంచి 5 ఎకరాలు, రెండో దశలో 2 నుంచి 10 ఎకరాలు, మూడో దశలో 3 నుంచి 5 ఎకరాలు అభివృద్ధి చేయనున్నామన్నారు. లగ్జరీ, వెల్నెస్, స్థిరమైన డిజైన్‌తో హైదరాబాదులో కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తున్నామని చెప్పారు.

సంపాదకీయం

అజిత్ పవార్ నిగూఢ ప్రయోజనాలు

ఏ రహస్యమూ శాశ్వతంగా ఉండిపోదు... నిజం నిలకడ మీద తెలుస్తుంది అంటారు. 2019 నవంబర్‌లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి.) దిగ్గంత శరద్ పవార్ సోదరుడి కుమారుడు హఠాత్తుగా ఆ పార్టీకి రాజీనామాచేసి దొంగచాటుగా 2019 నవంబర్ 23న తెల్లవారకముందే హడావుడిగా జరిగిన మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఉపముఖ్యమంత్రి అయిపోయారు. అప్పుడు బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి. కానీ ఈ ప్రభుత్వం కేవలం 80 గంటలు మాత్రమే మనగలిగింది. ఫడ్నవీస్, అజిత్ పవార్ దొంగచాటుగా ఏర్పాటుచేసిన ప్రభుత్వం పతనం కాక తప్పలేదు. ఎందుకంటే ఎన్.సి.పి. నుంచి రాజీనామాచేసి వచ్చిన అజిత్ పవార్‌తో పాటు ప్రభుత్వాన్ని నిలబెట్ట గలిగినంత మంది ఎమ్మెల్యేలు రాలేదు. ఈ నాటకం అంతా జరగడానికి ముందు పెద్ద మంత్రాంగమే జరిగింది. ఓ సమావేశం హుటాహుటిన నిర్వహించారు. అందులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవిస్, ప్రఫుల్ పటేల్ పాల్గొన్నారు. అంతకన్నా విశేషం ఏమిటంటే ఎన్.సి.పి. అధినేత శరద్ పవార్ కూడా హాజరయ్యారు. కానీ అజిత్ పవార్ దిగ్భ్రాంతి కలిగించే మరో రహస్యం బయట పెట్టారు. ఆ సమావేశంలో మోదీ మిత్రుడు, బడా వ్యాపారవేత్త గౌతం అదానీ కూడా ఉన్నారట. రాజకీయ మంతనాలు జరిగేచోట అదానీకి ఏంపని అని అమాయకంగా ప్రశ్నించే వారు ఉండొచ్చు. కానీ చాలాకాలంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వాన్ని నడుపుతున్నది అదానీ అని పదేపదే చెప్తున్నారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడు కాకముందూ ఇదే మాట చెప్పారు. అప్పుడు అందరూ దీన్ని ప్రచారార్భాటంగానో, హాస్యస్ఫోరకమైందిగానో భావించి కొట్టి పారేశారు. అయితే అసలు రహస్యం న్యూస్ మింట్ వార్తా సంస్థకు చెందిన ప్రసిద్ధ పత్రికా రచయిత శ్రీనివాసన్ జైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అజిత్ పవార్ ఈ రహస్యం మంగళవారం బయటపెట్టారు. ప్రస్తుతం ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనను చీల్చి వచ్చిన ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా ఉన్న ప్రభుత్వంలో అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు కనక ఆయన విప్పిన రహస్యం అబద్ధం అయిఉండదు. ఏక్‌నాథ్ షిండే ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనను చీల్చి వచ్చారు. అజిత్ పవార్ ఎన్.సి.పి.ని చీల్చి వచ్చారు. ప్రస్తుత శాసనసభలో నిజానికి 288 మందిలో బీజేపీకి 105 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. కానీ ప్రాంతీయపార్టీలను చిన్నాభిన్నం చేసే మోదీ, అమిత్ షా మంత్రాంగంలో భాగంగా ఫడ్నవీస్ ముఖ్యమంత్రి పదవికోసం పట్టుపట్టకుండా శాసనసభలో అతిపెద్ద రాజకీయ పక్షం నాయకుడైన ఉపముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఎన్.సి.పి., శివసేన చీలికవర్గాలు, బీజేపీతో కూడిన రాజకీయ సంఘటనను మహాయుతిగా వ్యవహరిస్తారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు వచ్చే 20వ తేదీన పోలింగ్ జరగాల్సిఉంది. ప్రస్తుత వాతావరణాన్నిబట్టి మహాయుతి ఏటికి ఎదురీదుతున్నట్టు కనిపిస్తోంది. అందుకే ఎన్నికల ప్రచార బాధ్యతను దేవేంద్ర ఫడ్నవిస్ మీద వదిలేయకుండా అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగి చక్రం తిప్పుతున్నారు. ఐ.ఎ.ఎన్.ఎస్. అనే ఒక సంస్థ నిర్వహించిన సర్వేలో అజిత్ పవార్ పక్షానికి అయిదు సీట్లు మాత్రమే వస్తాయని తేలింది. ఈ సంస్థ అధిపతి గౌతం అదానీ. ఈ వాస్తవాన్ని గమనిస్తే అజిత్ పవార్ ఎన్నికల ప్రచారం కొనసాగుతున్న దశలో 2019లో జరిగిన సమావేశంలో అదానీ పాల్గొన్నారని ఎందుకు చెప్పారో అర్థం అవుతుంది.

2019లో జరిగిందంటున్న సమావేశంలో అదానీ పాల్గొనడం ఆశ్చర్యకరమైతే కావొచ్చు. కానీ ఆ సమావేశానికి హాజరైన ఎన్.సి.పి. దిగ్గంత శరద్ పవార్ ఎందుకు హాజరయ్యారో, ఆ తరవాత ఆయన అజిత్ పవార్‌ను ఎందుకు సమర్థించారో అంతుపట్టదు. అజిత్ పవార్ మాటల్లోనే చెప్పాలంటే తన బాబాయి శరద్ పవార్ మదిలో ఎప్పుడు ఏముంటుందో ఈ లోకంలో ఎవరూ చెప్పలేరంటున్నారు. శరద్ పవార్‌కు అదానీతో సత్సంబంధాలే ఉన్నాయి. శరద్ పవార్ తన ఆత్మకథలో అదానీ గురించి రెండు పేజీలు రాసి ఆయన చాలా సమర్థుడైన వ్యాపారవేత్త అని, దేశాభివృద్ధికి మహత్తరమైన కృషి చేస్తున్నారని పొగిడారు. శరద్ పవార్‌కు వ్యాపారవేత్తలతో ఎప్పుడూ మంచి సంబంధాలే ఉంటాయి. అంతేకాదు... ఆయనకు ప్రతిపార్టీలోనూ మిత్రులున్నారు. శరద్ పవార్ రాజకీయం చాలా విశిష్టమైంది. అది మామూలు అంచనాలకు ఎన్నడూ అందదు. రాజకీయ నాయకులకు, వ్యాపార రంగ ప్రముఖులకు సంబంధాలుండడం కొత్త కాదు. ఏ ప్రభుత్వానికి ఏ వ్యాపారవర్గాలు మద్దతు ఇస్తున్నాయి అన్న విషయం బహిరంగ రహస్యమే. గాంధీజీ రంగంలో ఉన్నప్పుడూ రాజకీయాలలో బిర్లా ప్రమేయం అందరికీ తెలిసిందే. 2014 ఎన్నికలకు ముందు వరకు అంబానీలు కాంగ్రెస్‌కు సన్నిహితంగా మెలిగిన వారే. డబ్బు సంచుల ఆధారంగా ఎన్నికలు కొనసాగే చోట వ్యాపార రంగంలోని వారి మద్దతు తీసుకోవడం ఆశ్చర్యకరం కాకుండాపోయి చాలాకాలం అయింది. 2019 నవంబర్ 23న ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో అదానీ కూడా పాల్గొని ఉంటే ఆ ప్రభుత్వం 80 గంటలే ఎందుకు ఉంది అన్న అనుమానమూ కలగవచ్చు. ఆ దశలో అజిత్ పవార్ ఎన్.సి.పి. నుంచి బయటికి వచ్చినా పార్టీపై శరద్ పవార్ పట్టు సడలలేదు. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి కనక శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అగాఢీ విజయం సాధించే అవకాశం ఉందన్న ఊహాగానాలు జరుగుతున్నాయి కనక శరద్ పవార్‌ను కించపరచడం కోసం అజిత్ పవార్ రహస్య సమావేశంలో అదానీ పాల్గొన్న విషయాన్ని అదును చూసి ఇప్పుడు బయటపెట్టి ఉండొచ్చు. అజిత్ పవార్ విస్తారమైన అనుభవంగల రాజకీయ నాయకుడు. ఆయన రాజకీయాలు శరద్ పవార్ శిష్యరికంలోనే ప్రారంభమైనా తరవాత తరవాత శరద్ పవార్ భుజాల మీద ఎక్కి అజిత్ పవార్ రాజకీయాల్లో కొనసాగారు. అందుకే ఆయన శరద్ పవార్ కన్నా ఎక్కువ దూరం చూడగలుగుతున్నారేమో. అజిత్ పవార్‌లో సొంత లక్షణాలూ ఉన్నాయి. శరద్ పవార్ లక్షణాలూ ఉన్నాయి. 2023లో అజిత్ పవార్ తన రాజకీయ గురువు నుంచి దూరం అయినప్పుడు ఆయన వెంట ఎక్కువమంది రాలేదు కానీ షిండే ముఖ్యమంత్రి అయినప్పుడు శరద్ పవార్ వర్గంలోని చాలామంది అజిత్ పవార్‌కు మద్దతు ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలలో అజిత్ పవార్ వర్గం మూడుసీట్లు కోల్పోయి ఒక్క సీటుతో సంతృప్తి పడాల్సివచ్చింది. అజిత్ భార్య కూడా ఓటమి పాలయ్యారు. ఇప్పుడు కూడా శరద్ పవార్ గురిచూసి అజిత్ పోటీచేస్తున్నచోట తన అన్నకొడుకును నిలబెట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో శరద్ పవార్ వర్గం బాగా పుంజుకుని ఎనిమిది లోకసభ స్థానాలు సంపాదించింది. ఆశ్చర్యకరంగా అన్ని పక్షాలకన్నా ఎక్కువ లాభపడింది కాంగ్రెస్. కాంగ్రెస్ మునుపటికన్నా 12 సీట్లు ఎక్కువ సాధించింది. అజిత్ పవార్ రహస్యం బయటపెట్టడం వెనక నిర్దిష్టమైన కారణం తెలియకపోయినా నిగూఢ ప్రయోజనాలు మాత్రం ఇమిడి ఉన్నాయి.

సామ్యవాద ప్రియుడు నెహ్రూ

డా.సోమ ఎస్ మర్ల

ఆధునిక భారత నిర్మాత, ప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూని దేశ ప్రజలు ఎంతో ఇష్టంగా గుర్తు చేసుకుంటారు. ఆయన 135 వ దినోత్సవం సందర్భంగా నవంబరు 14 వ తేదీన దేశవ్యాప్తంగా బాలల దినోత్సవంగా జరుపుకుంటాము. ఆధునిక భారత నిర్మాత నెహ్రూ దేశంలోనే గాక అనేక దేశాలలో గుర్తు చేసుకుంటారు. నెహ్రూ ఆధునిక భారతదేశానికి, ప్రజాస్వామ్యానికి చేసిన కృషి ఎనలేనిది. ఆయన జాతీయ శాస్త్రీయ సంస్థలను స్థాపించడం ద్వారా శాస్త్ర పరిజ్ఞానానికి పునాదులు వేశారు. ఆనాడు ప్రజల మనోభావాలను మార్పుచేసేందుకు సైన్సును వినియోగించారు. వెనుకబడి ఉన్న దేశాన్ని విముక్తి గావించి సామాజిక, సాంస్కృతిక మార్పు కోసం కృషి చేశారు. నెహ్రూ వారసత్వాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు ప్రస్తుతకాలంలో చాలా ముమ్మరంగా పనిచేస్తున్నారు. మధ్యయుగాల నాటి వెనుకబడిన మనసులను మార్పుచేసేందుకు వేసిన పునాదులను నాశనం చేయడానికి క్రియాశీలంగా పనిచేస్తున్నారు. సామ్రాజ్యవాదం, వలసవాద భావజాలం స్థానంలో పేదరికం, వెనుకబాటుతనాన్ని తొలగించి ఆధునిక భారత నిర్మాణానికి నెహ్రూ సైన్సు దృక్పథాన్ని అవలంబించారు. "ఆకలిని, పేదరికాన్ని, అపరిశుభ్రతను, మూఢ విశ్వాసాలను, అంధ విశ్వాసాలను, అపార వనరులను వృధా చేయకుండా నిరోధించడానికి, ఆకలితో అల్లాడుతూ నివసించే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సైన్సు మాత్రమే ఉపయోగపడుతుంది" అని నెహ్రూ 1937 లో ప్రకటించారు.

నూతనంగా స్వతంత్రం పొందిన భారత్ నిర్మాణం, సైన్సును అభివృద్ధిపరిచేందుకు నెహ్రూ కృషి చేశారు. సుస్థిరమైన, క్రియాశీలమైన తోడ్పాటు ఆయన భావజాలం వాస్తవ రూపం దాల్చింది. ఆయన పాలనాకాలంలో సైన్సుకు సంబంధించిన రంగాలలో 45కు పైగా సెంట్రల్ లేబరేటరీలను స్థాపించారు. ఇండియాను ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష పరిశోధనకు ప్రథమ చర్యలను నెహ్రూ తీసుకున్నారు. అలాగే సిఎస్ఐఆర్, డిఆర్‌డిఓ పరిధిలో భారీగా పరిశోధనా లేబరేటరీలను ఏర్పాటు చేశారు. ఇండియన్ పరిశోధనా మండలి, అణుశక్తి సంస్థలను స్థాపించిన విషయం అందరికీ బాగా తెలుసు. ఆయన శిక్షణ పొందిన శాస్త్రవేత్త కాదు. కేంబ్రిడ్జిలో ట్రినిటీ కాలేజీ నుంచి సైన్సులో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందారు. సైన్సును ఉపయోగించి ఆధునిక భారతాన్ని నిర్మించాలని ఆకాంక్షను నెరవేర్చుకొనేందుకు ప్రపంచ స్థాయి పరిశోధన, శిక్షణా కేంద్రాల నిర్మాణానికి సంప్రదించడానికి, సలహాలు పొందిన వారిలో మేఘానంద్‌షా, హోమీబాబా, జెబిఎస్‌హల్డనె, సర్ సి.వి.రామన్, సతీష్‌ధావన్, నళినీరంజన్ సర్కార్, జెసి ఘోష్ హుమయూన్ కబీర్ ఉన్నారు. వీరిలో ప్రపంచ స్థాయి శాస్త్రవేత్త, గణిత శాస్త్రవేత్త జెడి బెర్నిల్, పిఎంఎస్ బ్లాకెట్, లారెన్సు, హెూగ్‌బెన్ ఉన్నారు. ఆధునిక భారతదేశాన్ని నిర్మించేందుకు, సైన్సు అభివృద్ధిపరిచేందుకు నెహ్రూకు ఎంతో మక్కువ. ప్రాచీన భారతదేశంలో సైన్సు, సాంకేతికత, గణితం, ఖగోళ శాస్త్రం, వైద్యరంగం సాధించిన అంశాలపై గర్వించారు. ఆయన రచించిన విశిష్టమైన "గ్లిమ్‌సెస్ ఆఫ్ ఇండియా" లో ఆధునిక సైన్స్‌పై గుత్తాధిపత్యాన్ని నెహ్రూ వ్యతిరేకించారు. ఇది సర్వవ్యాప్తంగా అలాగే స్థానికంగా ఉండాలని, ఇండియాలో ఆరోగ్య సమస్యలు, పేదరికాన్ని పరిష్కరించడానికి ఉపయోగపడాలని నెహ్రూ ఎనలేని లక్ష్యం. ఆధునిక భారత నిర్మాణానికి సైన్సును ఉపయోగించ డమేగాక, నెహ్రూ వారసత్వంలో - ప్రజాస్వామ్య సంస్థల నిర్మాణం, సెక్యులరిజం, ప్రభుత్వరంగ తోడ్పాటు, ఆర్థికరంగం, శాస్త్రీయ దృక్పథం, నూతన విదేశాంగ విధానం (అలీన విధానం, పంచశీల ప్రణాళిక) తో కూడిన ఐదు మూలస్తంభాలు. ఇటీవలి సంవత్సరాలలో చరిత్ర నిర్వచనాన్ని మార్చివేస్తున్నారు. ఆయన వారసత్వాన్ని ధ్వంసం చేస్తున్నారు. ప్రత్యేకంగా సైన్సు మీద, శాస్త్రీయ దృక్పథం మీద దాడి జరుగుతోంది. నేడు జాతీయ సంస్థలు, ఐఐటీలు తమ ప్రతిష్టను కోల్పోయాయి. పరిశోధనకు నిధులు లేవు. శాస్త్రీయ దృక్పథం లేదు. కొన్ని జాతీయ లేబరేటరీలు మినహా మరే సైన్సు లేదు. మౌలిక పరిశోధనలను ఎక్కువగా ఉపేక్షించారు. మానవాళికి సంబంధించిన అనేక తక్షణ సమస్యలమీద పరిశోధనలను పట్టించుకోవడంలేదు. పరిశుభ్రమైన నీరు, పౌష్టికాహారం, నూతన ఔషధాలు, క్షయ లేదా డెంగ్యూలకు వ్యాక్సిన్‌లు, కాలుష్యం, పరిశుభ్రమైన ఇంధన వాతావరణ సమస్యలపై ప్రాధాన్యతనిచ్చి పరిశోధనలు జరగాలి. గ్రీన్ ఎనర్జీ నిలవ లేదాఎలక్ట్రానిక్ చిప్స్ లేదా, సమర్థంగా పనిచేసే ఏరోజెట్ ఇంజన్లు, సైనిక హార్డ్‌వేర్ అభివృద్ధి కోసం దేశీయ మౌలిక పరిశోధనలు లేవు. ఈ రంగాలపై పరిశోధనల కొద్ది లేబరేటరీలు మాత్రమే ఉన్నాయి. వీటిలో అంతరిక్ష సాంకేతికలపై మాత్రమే పరిశోధనలు జరుగుతున్నాయి. సైన్సు, సాంకేతికతలకు సంబంధిత కీలకమైన రంగాలకు ఏటా కేంద్ర బడ్జెట్లలో నిధుల కేటాయింపులు క్రమంగా తగ్గిస్తున్నారు. జాతీయ శాస్త్రీయ సంస్థలకు, సెంట్రల్ లేబరేటరీలకు లభించే నిధులు సిబ్బంది,



పరిశోధకులకు వేతనాలు, పెన్షన్లు చెల్లించడానికి మాత్రమే సరిపోతుంది. పరిశోధనలకు నిధులు లభించడంలేదు. ఇటీవల వివిధ పరిశోధనలకు నిధులు అందించే ఏజెన్సీలను రద్దు చేశారు. కొత్తగా జాతీయ పరిశోధనా ఫౌండేషన్‌ను నెలకొల్పారు. పరిశోధనలకు ఇచ్చే నిధులను 5 సంవత్సరాలకు రూ 50,000 కోట్లకు 28 శాతమే ప్రభుత్వ సంస్థలకు ఇస్తారు. తక్కిన మొత్తం ప్రయివేటు రంగానికి ఇస్తారు. ఈ పథకాన్ని 2020 లో ప్రవేశపెట్టారు. గడచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో ప్రయివేటు రంగానికి పరిశోధనకు 3 వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. పరిశోధనలకు సొంతంగా సంపాదించుకోవాలని ఐఐటీలు, సిఎస్ఐఆర్, ఐసిఎఆర్ సంస్థలను ప్రభుత్వం కోరింది. ప్రాచీన వైమానిక విశిష్టతలు, గో మూత్రం ఆధారంగా పరిశోధనలు చేయాలని కేంద్ర శాస్త్ర సాకేతికతల మంత్రిత్వశాఖ ఈ సంస్థలకు సిఫారసు చేసింది. మన సంస్థలు ప్రపంచ సాఫ్ట్‌వేర్ హబ్ అని డంబాలు కొట్టు కుంటున్నాము. ఐఐటీలలో మహా అయితే అల్గోరిథం అభివృద్ధి లేదా కంప్యూటర్ హార్డ్‌వేర్ ఆర్కిటెక్చర్ అభివృద్ధిపై మాత్రమే పరిశోధన జరుగుతోంది. చివరకు సాఫ్ట్‌వేర్ సర్వీసు అందించే స్థాయికి దిగజారిపోయాము. గత పదేళ్ల కాలంలో శాస్త్రీయ పరమైన రచనలు పెరిగాయి. ఇవికూడా ప్రచురణలు పెరిగాయే కాని, ప్రమాణాలు పెరగలేదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ప్రభుత్వం చేసే పరిశోధనలు దిగజారిపోయాయి. ఉత్పత్తులు ప్రస్తుతం ఎక్కువగా విదేశీ సాంకేతికల మూలంగానే జరుగుతున్నాయి. 'మేక్ ఇన్ ఇండియా' దిగుమతి అవుతున్న పరికరాలను అసెంబుల్ చేస్తున్నవే. నెహ్రూ హయాంలో అభివృద్ధిపరచిన శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధనలను పునరుద్ధరించాలి.

ప్రిన్సిపల్ సైంటిస్ట్ (రిటైర్డు)
జినోమిక్స్ వ్యవసాయ పరిశోధన జాతీయ మండలి

ఆర్థికాభివృద్ధికి ప్రజాస్వామ్యం అవసరమా?

ప్రొ.డా. కె.ఎస్. చలం

పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన వలసవాదంతో చాలా దేశాలు పేదరికంలోకి నెట్టారు. దేశాల మధ్య అసమానతలు పెరిగాయి. అయితే కొన్ని దేశాలు తమ వ్యవస్థలను పటిష్టం చేసుకోవటం ద్వారా, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించు కోవటం ద్వారా పేదరికాన్ని అధిగమించి ఆర్థికాభి వృద్ధిని సాధించాయి. ఈ ఏడాది అర్థశాస్త్ర నోబెల్ బహుమతి అసిమెగ్లూ, జాన్సన్&రాబిన్‌సన్ బృందానికి యివ్వటంతో ప్రజాస్వామ్య వ్యవస్థకు గతంలో బూర్జువా ఆర్థిక శాస్త్రంలో చెప్పిన పెట్టుబడి సంచయం, పొదుపు రేటు పెంచి కేపిటల్ అవుట్‌పుట్ రేషియో అంటే మూలధన ఉత్పత్తి నిష్పత్తి ఆధారంగా జీడీపీని పెంచే గుణకంలో మార్పు అవసరమని ఈ ఏడాది నోబెల్ బహుమతి తెలియజేస్తోంది. నిజానికి కొంతకాలంగా పెట్టుబడిదారి దేశాల ఫైనాన్స్ రంగానికి పరిమితమైన నోబెల్ బహుమతులు గత ఏడాది గ్లాడియా గోల్డిన్ శ్రామికుల మార్కెట్ సంబంధాలను విశ్లేషించిన అంశాలకు ఇవ్వటం ద్వారా వారి ఆలోచనలలో మార్పును సూచి స్తుందా లేక పెట్టుబడిదారి దేశాల ఆర్థిక వ్యవస్థల నిర్వహణలోని సంక్షోభాన్ని తెలియజేస్తుందా అన్నది పరిశీలనార్హం.

అసిమెగ్లూ గ్రంథం వై నేషన్స్ ఫెయిల్ దేశాలెందుకు విఫలమవుతున్నాయి అని 2013లో ప్రచురించినపుడు పికెటి గ్రంథానికి వచ్చిన ప్రచారమే దీనికీ వచ్చింది. అందుకే ఈ ఏడాది పికెటి పేరు కూడా ఉంటుందని కొందరు ఆశించారు. గాని పెట్టుబడిదారి దేశాలను బహిరంగంగా విమర్శించే వారికి నోబెల్ వచ్చిన సంఘటనలు లేవు. ఇక అసిమెగ్లూ చెప్పిన సిద్ధాంతం ఏమిటంటే మెక్సికో నోగాలెస్ (అమెరికా) రెండు మహా నగరాల కథను వివరించటం ద్వారా ఈ దేశాలను వేరుచేసే యినప కంచెతో ప్రారంభమవుతుంది. ఒకవైపు మెక్సికో, యింకోవైపు అమెరికా దేశాల్లోని ప్రజల సగటు ఆదాయం, సగటు జీవితం, ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని అయోమయంలో ఉండటానికి ప్రధాన కారణం ఒక దేశంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడి, వ్యక్తి ఆస్తికి రక్షణ, రూల్ ఆఫ్ లా, కొన్ని నిబంధనల కనుగుణంగా కొన్ని వ్యవస్థలు నిర్మించటం ద్వారా సాధ్యపడింది. అంటే గతంలో చెప్పిన పెట్టుబడి, టెక్నాలజీ వంటి వాటికి ప్రాధాన్యం కంటే వ్యవస్థలను ముఖ్యంగా ప్రజాస్వామిక వ్యవస్థలను, ప్రజలు పాల్గొనే అంటే కలుపుకొనే ఇంక్లూజివ్ వ్యవస్థల నిర్మాణంతో అభివృద్ధి సాధ్యమవుతుంది అని ప్రాధేయికంగా నిర్ధారించే పరిశోధనకు నోబెల్ బహుమతి లభించింది. ఒక దేశంలోని జీడీపీ ఎక్కువగాను యింకో దేశంలో తక్కువగాను, అవినీతి రాజకీయ నాయకులను మార్చలేని నిస్సహాయత వంటి అవలక్షణాల మూలంగా అభివృద్ధి కుంటుబడింది అన్నారు. వీరు చెప్పిన పరిశోధన అంశాల్లో వలసవాద దశలో యూరప్ దేశాలు చాలా దేశాల్లో కొన్ని వ్యవస్థలను నిర్మించారు. పెద్ద జనాభా గల దేశాలు తిరుగుబాటుకు ఆస్కారం ఉన్న నాటికంటే తక్కువ డబ్బులేక వేతనంతో లభించే శ్రామికులున్న దేశాలవైపు వలసవాదులు ప్రయాణించారు. ఆ దేశాల్లో ఒక శిష్ట వర్గాన్ని అభివృద్ధిచేసి ఆర్థికంగా ప్రజల నుంచి పిండే వ్యవస్థల ద్వారా వీరికి లాభించేలాగ, అక్కడ ఎక్కువ జనాభాకు నష్టం కలిగించారు. అయితే మరికొన్ని వలస దేశాల్లో ఎక్కువ మంది వలసవాదులు ప్రవేశించి కొన్ని వ్యవస్థలను నిర్మించటం ద్వారా ప్రజల నుంచి ప్రజాస్వామ్య హక్కుల కోసం వారి లాభాల్లో వాటా కోసం జరిగిన ఘర్షణల్లో కొన్ని రాజకీయపరమైన హక్కులు ఇవ్వటం ద్వారా సంపద పెంచటానికి అవకాశం ఏర్పడింది. అదే స్పానిష్ కాలనీగా ఉన్న మెక్సికో అమెరికా మధ్య గల తేడా. ఇక్కడ ఫ్రెంచ్, బ్రిటీష్, పోర్చుగీస్ తదితర దేశాల వలసవాదులు ఉన్నారు. ఇది అక్కడ పారిశ్రామిక విప్లవం ద్వారా భారతదేశం అప్పటికి అమెరికా కంటే ఆర్థికంగా ముందే ఉంది. అయితే సాంకేతికంగా వచ్చిన మార్పులు ఎక్కడయితే వ్యవస్థలు బాగా అభివృద్ధి చెందాయో అక్కడ ఎక్కువగా ఫలితాలనిచ్చాయి. అప్పట్లో వలసవాదులు తెచ్చిన జబ్బులు మూలంగా భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న ఆఫ్రికా, భారతదేశాల వంటి దేశాల్లో ఎక్కువ మానవ హరణం జరిగింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఎక్కువగా మరణాలు జరగలేదు. ఎక్కడయితే వ్యవస్థలు బలంగాలేక అవినీతి, విశృంఖలత్వం, రూల్ ఆఫ్ లా లేకుండా ఉన్నాయో అక్కడ పేదరికం పెరిగింది. ఎక్కడయితే రాజకీయ ఉన్నతి వర్గం తాలూకా విశ్వసనీయత సన్నగిల్లిందో అక్కడ ప్రజలు నాయకత్వాన్ని మార్చు కున్నారు. అందుకే రాజకీయ నాయకులు ప్రజలను నమ్మలేదు. అక్కడ ప్రజలను పీల్చే వ్యవస్థలు, పేదరికం, పెంచే పరిస్థితులు వచ్చాయి. ఎక్కడైతే ప్రజల్లో చైతన్యం పెరిగి మార్పు వైపు ప్రజా విప్లవం వచ్చే పరిస్థితులున్నాయో అక్కడ ప్రజలకు ఆర్థిక రాయితీలు ఇచ్చి కొంతకాలం అధికారం నిలబెట్టు కుంటారు. ఇక్కడ యీ శిష్ట వర్గం (దోపిడి అని వాడలేదు) కు అనిశ్చిత గందరగోళంకు కారణం ప్రజల నుంచి వచ్చే తిరుగుబాటు వ్యతిరేకత, ప్రజలు వీరు చెప్పే వాగ్దానాలను నమ్మకపోవటం ఎందుకంటే మళ్లీ పాత పద్ధతులు పునరావృతమవు తాయని. అటువంటి సందర్భంలోనే ప్రజలకు అధికారం అప్పజెప్పటం జరుగుతుంది. అప్పుడు ప్రజాస్వామ్యమే అవసరమవు తుంది. మొత్తం పశ్చిమ దేశాల్లో జరిగిన ప్రజాస్వామీకరణ ఈ విధంగానే జరిగింది. అది 1918 లో మొదటిసారి స్వీడన్‌లో ప్రారంభమయింది. సోవియట్ యూనియన్‌లో కూడా జరిగింది. తమ పరిశోధనల ద్వారా వలసవాద కాలంలో నెలకొల్పిన పీడించే వ్యవస్థలను మార్చటం అంత సులభం కాదు. వ్యవస్థల ప్రజాస్వామ్యీక రించటం ద్వారా సంపద పెంచటం, పంపిణీ, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుంది అన్నారు. ఈ ముగ్గురూ చాలాకాలంగా చేస్తున్న పరిశోధనల ఫలితాలు చాలా పుస్తకాలు, పరిశోధన పత్రాల్లో రాశారు. చర్చ జరిగింది. ఇంకా కొనసాగుతుంది. అసిమెగ్లూ బృందం చెప్పిన సిద్ధాంతాలను పరిశోధన ఫలితాలను అందరూ అంగీకరించలేదు. హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన ఎడ్వర్డ్ గ్లయిసర్ బృందం తమ పరిశోధనలలో వీరు చెప్పిన ఫలితాలకు భిన్నమైన వాదనలు వినిపించారు. వారిలాగే ఆర్థిక గణాంకాలు, పద్ధతులు వాడి ఈ ఆర్థిక పెరుగుదలకు కారణం ప్రజాస్వామ్య వ్యవస్థలు కాదు, మానవ పెట్టుబడి, టెక్నాలజీ పెరుగుదల మూలంగా వచ్చినదే. ఎక్కడయితే ఆర్థిక అభివృద్ధి ఉందో అక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా ఉన్నాయి. దీని మూలంగా అవి ఉన్నాయిగాని వ్యవస్థల మూలంగా ఇవి రాలేదు అన్నారు. అదే విధంగా మార్క్సిస్టులు కూడా వీరి పరిశోధనలను పూర్తిగా అంగీకరించలేదు. గతంలో వామపక్ష పరిశోధకులు చెప్పిన దానికి వీరు చెప్పిన దానికి ప్రజాస్వామ్య బదలాయింపులో తేడాలేదు. అయితే అది ప్రజాస్వామ్య సిద్ధాంతాల మూలంగా ప్రజలు సోషలిజం వైపు వెళ్లకుండా శిష్ట వర్గం ప్రజలకు రాయితీలు ఇచ్చి కాపాడుకుంటుంది తప్ప కొత్తేమీకాదు. ఈ సందర్భంగా హ్యూగోచావేజ్ ఉదాహరణ చెప్పారు. వీరు చెప్పిన పరిష్కారం లాటిన్ అమెరికా దేశాల్లో విఫలమయింది గదా! అక్కడ మార్తహార్నేకర్ వంటి వారు చెప్పేది ఏమిటంటే శ్రామిక వర్గం పేదరికం నుంచి, కష్టాల నుంచి బయటపడాలంటే చాలా డబ్బుతో సామాజిక అభివృద్ధి ప్రాజెక్టులపై ఖర్చు చేయవలసి వస్తుంది. అది చాలా తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. అందుకే ప్రజల నమ్మకం పొందటానికి ఈ దేశాల్లో చిన్న చిన్న సామ్యవాద ప్రాజెక్టుల ద్వారా పరిస్థితులను మార్చి ఇప్పుడున్న పరిస్థితులను మార్చటానికి ప్రయత్నించాలి అని. బ్రెజిల్‌లో తొలి ప్రభుత్వం చేసిన ఆర్థిక ప్రయోగాలు చివరకు బడా కాంట్రాక్టర్ల అధీనంలోకి వెళ్లి వారిపై ఆధారపడి రాజకీయాలు నడిపే స్థితికి వచ్చింది. అందుకే ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీవ్యవస్థ లాటిన్ అమెరికాలో పేదరికం, అసమానతలు తగ్గించలేకపోయింది. వెనుజులాలో ప్రజాస్వామ్యాన్ని పట్టుకొని క్రూడ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని మార్కెట్ ఆధారితంగా వేతనాలు పంచటం ద్వారా సాధ్యపడుతుందా, లేక ప్రజలకు రాజకీయ అధికారం ఇవ్వటం ద్వారా ప్రజా కౌన్సిల్‌లు ఏర్పాటు చేసి అధికార వికేంద్రీకరణ ప్రజలకు ఎక్కువ అధికార బదిలీ చేయటం ద్వారా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమా లేక వామపక్ష ప్రొలిటేరియన్ నిరంకుశత్వమా అన్నది ప్రశ్నార్థకమయింది. చావెజ్ చివరకు మార్పులు కోరుతూ రాజ్యాంగం సవరణలో 2008 ఓటమి పాలయ్యాడు. ఈ ప్రయోగంలో ఆ దేశంలో పేదరికం బాగా పెరిగింది. మిలిటరీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేయటం ద్వారా సాధ్యమా! మిలిటరీలో పనిచేసి రిటైరయిన ఆఫీసర్లను 26 శాతం ప్రభుత్వంలో చేర్చుకున్నాడు. ఘర్షణలు పెరిగాయి.

ప్రభుత్వంలో రెండు సమూహాలు ఏర్పడ్డాయి. సంక్షోభం పెరిగింది. అంటే మిలిటరీ మోడల్ పనిచేయలేదు. 2013 లో చావెజ్ మరణానంతరం అధికారంలోకి వచ్చిన మదురో ఎన్నికలు నిర్వహించాడు. 2024 జూలైలో ఏర్పడ్డ ప్రభుత్వంను ప్రతిపక్షం అంగీకరించలేదు. అమెరికా ఆంక్షలు విధించింది. ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో వెనిజులా ఉంది. ఈ వివరాల మూలంగా అర్థమవుతున్నది కొతమంది పరిశీలకుల ప్రకారం, ప్రజాస్వామ్యాన్ని ఇప్పుడు తీవ్రంగానే పరిగణించి సోషలిజం సాధించటానికి ఎలా వాడుకోవాలో ప్రయత్నించాలి. అయితే సమస్య ఏమిటంటే వామపక్ష గుర్తింపు దానికి ఉండదు. ఇది జఠిలమైన అంశం. చర్చ జరగాలి. ఇదే సందర్భంలో రాహుల్‌గాంధీ సూచించిన ఒక ప్రతిపాదన ఇటీవల వ్యాసంగా ప్రచారమయ్యింది. అది ఏమిటంటే భారతదేశంలోని బడా పెట్టుబడదార్లు చిన్న పరిశ్రమలను దెబ్బతీశాయి. వారి ఆర్థికస్థితి కోలుకోలేని దశకు చేరుకుంది. వారంతా అంటే ఎమ్.ఎస్.ఎమ్.ఇ పరిశ్రమలు గుత్తాధిపత్య అధీనంలో నడిచే స్థితికి చేరుకున్నాయి. సంపద సృష్టించినా అది పంపిణీ జరగకుండా కొద్దిమంది వ్యాపార కుటుంబాలకు చేరేలా ఇప్పటి ప్రభుత్వం చేస్తోంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రజాస్వామ్యయుతంగా అందరికీ అవకాశాలు వచ్చేలా చేయాలి. అందరికీ వ్యాపార నిర్వహణకు ప్రజాస్వామ్య బద్ధంగా అవకాశాలు కల్పించాలి. ఉద్యోగ అవకాశాలు కల్పించాలి అని అసిమెగ్లూ లాంటి వారు సూచన చేశారు. విభిన్న రాజకీయ, సాంస్కృతిక వైవిధ్యం ఉన్న దేశంలో ఆర్థిక విధానాల్లో ప్రజాస్వామ్యం సాధ్యమా, అది ఎలా సాధించాలి అన్న దానిపై ప్రజాస్వామ్యవాదులంతా చర్చించి ఇప్పుడు ఉన్న గుత్త పెట్టుబడిదారీ రాజకీయాలను మార్చటానికి ప్రయత్నించాలి.

సెల్: 7702200026

మీడియారంగ తటిల్లత సౌరవ్

ఓ పత్రికా రచయిత ఓ పత్రికలో ఓ కథనం రాస్తారు. దాని నిడివి 44 పేజీలు. ఆ పత్రికా రచయిత ఆ వార్తా కథనాన్ని పుస్తకంగా కూడా ప్రచురిస్తాడు. అది చూస్తూ చూస్తూ ఉండగా క్షణాల్లో అమ్ముడైపోతుంది. మార్కెట్లోంచి మాయమైపోతుంది. ఆయన ఏ మీడియా సంస్థలోనూ ఉద్యోగి కారు. స్వతంత్ర పత్రికా రచయితే. కేవలం నాలుగేళ్ల పత్రికా రచనానుభవంతో అందరి దృష్టినీ ఆకర్షించారు. న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ పదవీ విరమణ చేసిన సమయంలోనే "కారవాన్" పత్రిక 2024 నవంబర్ ఒకటో తేదీనాటి సంచికలో ఆయన "పర్ఫార్మేటివ్ జస్టిస్: ది ఈక్వివొకేషన్స్ ఆఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్" అన్న వార్తా కథనం మీడియాలోనే కాదు, న్యాయ రంగంలోనూ అపూర్వమైన రీతిలో చర్చనీయాంశం అయింది.

ఆ పత్రికా రచయిత సౌరవ్ దాస్. వయసెంతో తెలియదు కాని ఫొటోలు చూస్తే మూడు పదుల లోపు వాడిగానే కనిపిస్తున్నారు. సౌరవ్ దాస్ కు పత్రికా రచనలో పట్టా ఉంది. ఆయన కళాశాలలో చదివే రోజుల్లోనే పరిశోధనాత్మక పత్రికా రచన మీద ఆసక్తి కలిగింది. ఆయన రాసే పరిశోధనాత్మక కథనాలకు ప్రధాన వనరు సమాచార హక్కు చట్టమే. అల్ జజీరా, ది హిందూ, లైవ్ లా, ఫస్ట్ పోస్ట్, ఆర్టికల్ 14 లాంటి చోట్ల ఆయన పరిశోధనాత్మక కథనాలు రాస్తూ ఉంటారు.

మూలభూతమైన బాధ్యతలనే మీడియా విస్మరిస్తున్న దశలో సౌరవ్ దాస్ లాంటి వారి కృషి ఈ దేశం అంతరాత్మ పరిరక్షణకు ఉపకరిస్తుంది. ఆయనకు న్యాయ వ్యవహారాలు, పరిపాలనా విధానాలు, దాపరికంలేని తత్వం లాంటి అంశాలమీద ఆసక్తి ఎక్కువ. ప్రభుత్వం మరింత దాపరికంలేని రీతిలో ఉండాలని ఆయన తీవ్ర కాంక్ష. తనకు కావలసిన ముడిసరుకు సమాచార హక్కు చట్టం ద్వారా కూడా సంపాదించడం దుర్లభమైన సందర్భాలలో సౌరవ్ కోర్టు మెట్లెక్కడానికి కూడా వెనుకాడరు.

ఏళ్లతరబడి పోరాడి సాధించుకున్న సమాచార హక్కు చట్టం మోదీ

ఒకే ఒక్కడు

అధికారంలోకి వచ్చిన తరవాత కొన్నేళ్లు బాగానే పనిచేసింది. అయితే అయిదారేళ్లనుంచి కుంటుతోంది. ఈ మధ్య కాలంలో ఈ చట్టాన్ని వినియోగించుకునే వారికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. దాపరికంలేని తత్వం ఉండవలసిన చోటును రహస్యం ఆవరిస్తోంది. సమాచార కమిషన్ సచేతనంగా ఉన్నప్పుడు రాజకీయ పార్టీలు కూడా ఆ చట్టం కిందకే వస్తాయని ప్రకటించడానికి సాహసించింది. ప్రధానమంత్రి విద్యార్హతల లోగుట్టు లాగడానికి నిర్భయంగా కృషిచేసింది. ఉద్దేశ పూర్వకంగా తీసుకున్న అప్పులను ఎగవేస్తున్న వారి జాబితా వెల్లడించి తీరాల్సిందేనని రిజర్వు బ్యాంకు మీద ఒత్తిడి చేయగలిగింది. కానీ ఇప్పుడు ఆ పదును కనిపించడం లేదని సౌరవ్ దాస్ భావిస్తున్నారు.

డి.వై. చంద్రచూడ్ రెండేళ్ల కింద ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఆశాజ్యోతిలా కనిపించారు. ఆయన ఉదారవాది అనీ, పౌరుల హక్కులు కాపాడడానికి పాటుపడతారని, కింది నుంచి పై దాకా న్యాయస్థానాల్లో పేరుకుపోయిన కేసుల గుట్టలను కొంతమేరకైనా కరగదీస్తారని, ప్రభుత్వ అకృత్యాలకు ఎదురొడ్డి నిలిచే సాహసం ప్రదర్శిస్తారన్న భావన అందరిలోనూ ఉండేది. ఈ ఆశ ఎలా కరిగి నీరై పారిపోయిందో సౌరవ్ దాస్ కారవాన్ పత్రికలో రాసిన సుదీర్ఘ వ్యాసంలో వివరించారు.

న్యాయమూర్తులను నియమించడానికి సుప్రీంకోర్టు కొలీజియం చేసే సిఫార్సులను ప్రభుత్వం నిరవధికంగా తొక్కి పెడ్తున్నా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు చంద్రచూడ్ పెద్దగా పట్టించుకోలేదంటారు సౌరవ్ దాస్. దీనికి సంబంధించిన కేసును న్యాయమూర్తి సంజయ్ కిషన్ కౌల్ నాయకత్వంలోని బెంచి విచారిస్తూ ఉండేది. 2023 డిసెంబర్‌లో చంద్రచూడ్ ఈ కేసును సంజయ్ కిషన్ కౌల్ నుంచి లాగేశారు. ఆ తరవాత దీని ఊసే వినిపించలేదు అని సౌరవ్ దాస్ అంటారు. నిజానికి న్యాయమూర్తి సంజయ్ కిషన్ కౌల్ ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతున్న సమయంలో ఆయన దగ్గర నుంచి ఈ కేసు లాగేశారు. న్యాయమూర్తి కౌల్ ఒత్తిడివల్లే దాదాపు 95 మంది న్యాయమూర్తుల నియామకానికి కొలీజియం చేసిన సిఫార్సులను ప్రభుత్వం అంగీకరించకతప్పలేదు. చంద్రచూడ్ హయాంలో అసలు సిఫార్సులే తగ్గిపోయాయంటారు సౌరవ్ దాస్.

ఈశాన్య ఢిల్లీలో మతకలహాలను ప్రేరేపించాడన్న ఆరోపణతో నాలుగేళ్ల పై నుంచి జైలులో మగ్గుతున్న జె.ఎన్.యు. నుంచి పిహెచ్.డి. పొందిన ఉమర్ ఖాలిద్ బెయిలు కోసం కనీసం 14 సార్లు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కిదిగినా ఫలితం లేకపోవడం, కిరాతకమైన చట్ట వ్యతిరేక కార్య కలాపాల (నిరోధక) చట్టం కేసు, తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న పళనిస్వామి మీద, చంద్రబాబు నాయుడు మీద, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, తమిళ నాడు మంత్రి సెంథిల్ బాలాజీ, బీమా కోరేగావ్ కేసు తతంగం, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కేసులు అప్పగించడంలో మాస్టర్ ఆఫ్ ది రోస్టర్ గా చంద్రచూడ్ నిర్వహించిన పాత్రపై సౌరవ్ దాస్ కారవాన్ లో రాసిన వ్యాసంలో దుయ్యబట్టారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని సవరిస్తూ ఎన్.వి.రమణ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయానికే దాదాపు రెండువందల పిటిషన్లు దాఖలైనాయి. వీటిని పట్టించుకోకపోవడంలో చంద్ర చూడ్ కూడా రమణ దారినే నడిచారు. ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఎన్.వి.రమణ గంభీరమైన ఉపన్యాసాలు ఇచ్చేవారు. ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో చంద్రచూడ్ ప్రతి వారాంతంలో ఎక్కడో ఓ చోట ధర్మోపన్యాసం చేసేవారు. చంద్రచూడ్ హయాంలో ఆయన నోట ఒలికిన ముత్యాలు తీర్పుల్లో ప్రతిఫలించేవి కావు. ఈ వైపరీత్యాన్ని సౌరవ్ దాస్ ఉతికి ఆరేశారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి రాజీవ్ కుమార్, కమిషనర్లు గ్యానేశ్ కుమార్, డా. సుఖ్బీర్ సింగ్ సంధూ వెన్నెముక లేని వారేనని సౌరవ్ దాస్ నిర్భయంగానే చెప్తారు. అంత దిగజారుడు వ్యక్తిత్వంగల వీళ్లు తమ కుటుంబాల, పిల్లల ముఖం ఎలా చూడగలుగుతారో అని సౌరవ్ దాస్ ప్రశ్నిస్తారు. ఇది సౌరవ్ ధైర్యానికన్నా ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠ ఎన్ని లోతుల్లోకి దిగజారిందో చూడడానికే ఎక్కువ ఉపకరిస్తుంది.

చంద్రచూడ్ పదవీకాలంలో మాటలు ఎంత భీకరంగా ఉన్నాయో చేతలు అంత నిస్సారంగా ఉన్నాయని సౌరవ్ దాస్ వాదన. 2018లో నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు - జాస్తి చలమేశ్వర్, రంజన్ గొగోయ్, మదన్ బి.లోకూర్, కురియన్ జోసెఫ్ దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారి వీధికెక్కి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారి ప్రధాన విమర్శ అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా వ్యవహార సరళిమీదే. కేసులు అప్పగించడంలో మిశ్రా వైఖరిని ఆ నలుగురూ తూర్పారబట్టారు. ఆ దోషపూరిత విధానాన్నే చంద్రచూడ్ కొనసాగించారని సౌరవ్ దాస్ విడమర్చారు. కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు పోకడలు పోతున్న గాఢాంధకార స్థితిలో సౌరవ్ దాస్ లాంటి పత్రికా రచయితలు తటిల్లత లాగా కనిపిస్తారు.

అనన్య వర్మ

స్వాతంత్ర్య సమరంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు పాత్ర లేదు

మల్లికార్జున ఖర్గే

లాతూర్: దేశ ఐక్యత, స్వాతంత్ర్య సమరంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ తోడ్పాటు శూన్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 'బటేంగేతో కాటేంగే, ఏక్ హై తో సేఫ్ హై' వంటి బీజేపీ నినాదాలు ప్రజలను విభజించేవని దుయ్యబట్టారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో ఖర్గే బుధవారం లాతూర్‌లో ప్రచారం చేశారు. ర్యాలీలో మాట్లాడుతూ అధికార మహాయుతిని దొంగల ప్రభుత్వమన్నారు. దానిని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతలు ప్రదర్శించే రాజ్యాంగం ప్రతిపై ప్రధాని మోదీ విమర్శలను తిప్పికొట్టారు. కుల గణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. అన్ని వర్గాల వారికి ప్రయోజనాలు సమానంగా అందాలని, వారంగా కలిసిమెలిసి ఉండాలనే కులగణనకు నడుం బిగించినట్లు తెలిపారు. కుల గణన ద్వారా విభజన జరగబోదన్నారు. దేశ ఐక్యత కోసం కాంగ్రెస్ నేతలు తమ ప్రాణాలర్పించారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోగానీ, దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో బీజేపీకి దాని సైద్ధాంతిక గురువు ఆర్‌ఎస్‌ఎస్‌కుగానీ ఎటువంటి పాత్ర లేదని ఖర్గే ఉద్ఘాటించారు. మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలను ప్రస్తావించారు. 'నిత్యం ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. దేశ సంపదలో 62శాతం

కేవలం ఐదు శాతం మంది వద్ద ఉండగా... 50శాతం మంది పేదల చేతుల్లో ఉన్నది 3శాతం సంపద మాత్రమే. ఇది మోదీ, ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ప్రభుత్వం' అని ఖర్గే వ్యాఖ్యానించారు. అబద్ధాలను ప్రచారం చేయడాన్ని మానుకోవాలని, పనితీరు గురించి చెప్పుకోవాలని మోదీకి హితవు పలికారు. 2014 ఎన్నికలప్పుడు ఇచ్చిన రూ.15లక్షల జమ, 2కోట్ల ఉద్యోగాల కల్పన వంటి హామీలను గుర్తుచేశారు. విద్య హక్కు, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ, ఆహార హక్కు వంటివి కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతలని ఖర్గే తెలిపారు. ఫ్యాక్టరీల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు పనిచేస్తే... అబద్ధాలతో పబ్బం గడుపుకోవడానికి బీజేపీ ప్రభుత్వం అంకితమైందని విమర్శించారు. రాజ్యాంగ ప్రతిని చూపుతూ సమ సమాజం కోసం బీఆర్ అంబేద్కర్ అందించిన తోడ్పాటును గుర్తుచేశారు. 'ఇది ఖాళీ పుస్తకమని మోదీ అంటారు... ఇది ఖాళీ పుస్తకమా' అంటూ రాజ్యాంగాన్ని చూపుతూ ఖర్గే ప్రశ్నించారు. 'ఎరుపు రంగు కవర్‌తో ఉండే రాజ్యాంగాన్ని... నక్సలిజానికి చిహ్నంగా మోదీ చెబుతారు. ప్రతిపక్షాన్ని అర్బన్ నక్సల్స్ అంటారు. మరి ఇదే ప్రతిని (రాజ్యాంగం) నాటి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌కు ఆయన అందజేశారు. మేము కూడా వారిని అర్బన్ నక్సల్స్ అనాలా' అని ఖర్గే ప్రశ్నించారు. విపక్షాలపై బురద జల్లడాన్ని మోదీ, బీజేపీ నేతలు మానుకోవాలని, తమ పాలన విజయాలను చెప్పుకోవాలని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఎంత వరకో చెప్పాలని ఖర్గే సవాల్ విసిరారు.

మహారాష్ట్ర రైతులకు బీజేపీ వెన్నుపోటు

జైరాం రమేశ్

న్యూదిల్లీ: మహారాష్ట్రలో రైతులను బీజేపీ వెన్నుపోటు పొడిచిందని కాంగ్రెస్ విమర్శించింది. ఇన్‌పుట్ ధరలకు పైసా సాయం ఇవ్వలేదని, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించేందుకు నిరాకరించిందని, తద్వారా అన్నదాతలను మోసం చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం విమర్శలు గుప్పించారు. ఈనెల 20న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా అధికార బీజేపీపై కాంగ్రెస్ నేత విరుచుకుపడ్డారు. అధిక-లోటు వర్షపాతం, కరువు పరిస్థితులు రైతన్నలను ఇబ్బంది పెడుతున్నాయని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఏడాది వలే అధిక వర్షాలు కురిస్తే దిగుబడి పెరిగి... ధర పడిపోతుందని, ఇది రైతులకు సమస్య అవుతోందని ఆయనన్నారు. రైతుల సమస్యలకు కాంగ్రెస్ చెప్పినట్లు చేయడం ద్వారానే పరిష్కారం సాధ్యమని జైరాం రమేశ్ అన్నారు. జాతీయ-రాష్ట్ర స్థాయిలో ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పన, స్వామినాథన్ కమిషన్ ఫార్ములా ఆధారంగా ఎంఎస్‌పీ ఇవ్వడానికి కాంగ్రెస్ హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 'సోయా బీన్ క్వింటాకు రూ.6వేలు ఇస్తానని రైతులకు 2013లో దేవేంద్ర ఫడ్నవీస్ హామీనిచ్చారు. గుజరాత్‌కు పూర్తిస్థాయి బయోలాజికల్ సీఎంగా ఉన్న ఆయన స్వామినాథన్ కమిషన్ రిపోర్టు (ఇది ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పనను సూచిస్తుంది) అమలు చేస్తామని అప్పట్లో చెప్పారు కానీ 2024లో సోయాబీన్ క్వింటా ధర రూ.4,200గా ఉంది. ఫడ్నవీస్ చెప్పిన రూ.6వేల కంటే చాలా తక్కువ ధర పలుకుతోంది. రూ.4,892 ఎంఎస్‌పీ కంటే ఇది తక్కువ' అని జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. మహారాష్ట్రలో దాదాపు 50లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగవుతుందని చెప్పారు. ఇటీవల కాలంలో పత్తి ధర పడిపోయిందన్నారు. ఎంఎస్‌పీ కంటే తక్కువకు అమ్ముడవుతోందన్నారు. రాష్ట్రంలో పత్తి 40లక్షల ఎకరాల్లో సాగవుతుందని జైరాం రమేశ్ తెలిపారు. ఈ రెండు పంటలను సాగుచేసే రైతులకు పూట గడవడం కష్టమైందన్నారు. '1.3 మిలియన్ టన్నుల సోయాబీన్ సేకరణకు ప్రభుత్వం గొప్పగా హామీలు ఇచ్చింది కానీ రెండువేల టన్నులకు మించి సేకరించలేదు. పత్తిని పెద్దఎత్తున సేకరించేది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కాగా ఈ ఏడాది అదీ జరగలేదు. రైతులను వెన్నుపోటు పొడవకుండా ఒక్క నియోజకవర్గాన్నీ బీజేపీ వదిలిపెట్టలేదు' అని జైరాం రమేశ్ విమర్శించారు.

వ్యక్తిగత ఆశయాలకు కాదు...
రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యతివ్వండి

ఎంవీఏ రెబల్స్‌కు ఉద్ధవ్ పిలుపు

సావంత్‌వాడి: వ్యక్తిగత ఆశయాలను పక్కకుపెట్టి మహారాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మహా వికాస్ అగాడీ (ఎంవీఏ) రెబల్స్‌కు శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే పిలుపునిచ్చారు. కొంకన్ ప్రాంతంలోని కోస్తా సావంత్‌వాడిలో పార్టీ అభ్యర్థి రాజన్ తేలి తరపున ప్రచారం చేశారు. సీట్ల సర్దుబాటు సమయంలో తర్జనభర్జన జరిగినప్పటికీ ఎంవీయేలో విభేదాలు లేవని, భాగస్వామ్య పార్టీలు ఐక్యంగా ఉన్నాయని ఉద్ధవ్ చెప్పారు. 'కాంగ్రెస్ కొన్ని స్థానాలు కోరుకుంది. మేము కూడా కొన్నింటికి మొగ్గుచూపాం. మహారాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి ముందుకెళ్లాలని నిర్ణయించిన తర్వాత సంకీర్ణ ధర్మాన్ని పాటించాలి. ఎంవీయే కూడా అదే చేస్తోంది' అని అన్నారు. మహారాష్ట్ర ద్రోహులకు మద్దతు ఇవ్వద్దని ఎంవీయే తిరుగుబాటు నేతలను ఉద్ధవ్ కోరారు. సింధుదుర్గ్ జిల్లా, మల్వాన్ తాలూకలోని రాయ్‌గఢ్ కోట వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిపోవడానికి సముద్ర గాలులపై షిండే ప్రభుత్వం నింద మోపడాన్ని తప్పుపట్టారు. రాజు కట్టిన సింధుదుర్గ్ కోట శతాబ్దాలుగా బలమైన సముద్ర గాలులను తట్టుకొని నిలబడింది కానీ వాటి ధాటికి విగ్రహం కులిందని చెప్పడానికి సిగ్గు ఉండాలని వ్యాఖ్యానించారు. 2019లో ముఖ్యమంత్రిగా రాయ్‌గఢ్ కోట పునరుద్ధరణ, రైతు రుణమాఫీకి నిధులు ఇవ్వాలని మొదటి నిర్ణయం తీసుకున్నట్లు గుర్తుచేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈవీఎం కాదన్నారు. ఎంవీయేపై నమ్మకం ఉంచి గెలిపించాలని కొంకన్ ప్రజలను కోరారు. లేకపోతే ముంబై వలే తమ ప్రాంతాన్ని కూడా అదానీ సంస్థకు పళ్లెంలో పెట్టి ఎన్‌డీయే వడ్డించేస్తుందని హెచ్చరించారు. కొంకన్‌కు కాపాడుకుందామంటూ పిలుపునిచ్చారు. తాను మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేయగా రెండున్నరేళ్లలో అందుకోసం చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. మహారాష్ట్ర సెక్రటేరియట్ మంత్రాలయనూ గుజరాత్‌కు మార్చేసినా ఆశ్చర్యం లేదని ప్రాజెక్టుల మళ్లింపునుద్దేశించి ఉద్ధవ్ విమర్శించారు.

సీఎం, డిప్యూటీ సీఎం బ్యాగుల తనిఖీ

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ రాష్ట్రంలో నేతల బ్యాగులు తనిఖీ చేయడం ఆసక్తికరంగా మారింది. రెండు రోజుల క్రితం శివసేన (యూటీబీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే బ్యాగ్‌ను అధికారులు తనిఖీ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా బ్యాగులను కూడా తనిఖీ చేశారా అంటూ ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే బ్యాగులను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం ఏక్‌నాథ్ షిండే బ్యాగును అధికారులు పాల్ఘర్ పోలీస్ గ్రౌండ్ హెలిప్యాడ్ వద్ద తనిఖీ చేశారు. హెలికాప్టర్ ల్యాండ్ కాగానే అక్కడికి వెళ్లిన అధికారులు నిబంధనల ప్రకారం... సీఎం వెంట తెచ్చుకున్న సూట్‌కేస్, ఇతర బ్యాగ్‌లు తనిఖీ చేశారు. అదేవిధంగా కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే బ్యాగును కూడా అధికారులు చెక్ చేశారు. హెలికాప్టర్‌లో పూణెకి వచ్చిన కేంద్ర మంత్రి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్‌గా మారాయి. అజిత్ పవార్ విషయంలోనూ బుధవారం ఇదే జరిగింది. ఎన్నికల ప్రచారం కోసం బారామతి వచ్చినప్పుడు ఎన్నికల అధికారులు తన బ్యాగులను తనిఖీ చేసినట్టు అజిత్ పవార్ ట్వీట్‌లో తెలిపారు. బారామతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్‌సీపీ అభ్యర్థిగా ఆయన పోటీ చేస్తున్నారు. 'ఈరోజు తాను ఎన్నికల ప్రచారంలో ఉండగా ఎన్నికల కమిషన్ అధికారులు నా హెలికాప్టర్, బ్యాగులు తనిఖీ చేశారు. పూర్తిగా సహకరించాను. స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరగడానికి ఇలాంటి చర్యలు తప్పనిసరని నమ్ముతున్నాను. చట్టాన్ని అందరూ గౌరవించాలి. ప్రజాస్వామ్య సమగ్రతను పరిరక్షించాలి' అని అజిత్ పవార్ ట్వీట్ చేశారు.

ఎంవీఏ గెలిస్తే... కాంగ్రెస్‌కు ఏటీఎం

అమిత్ షా

జల్గావ్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి గెలిస్తే మహారాష్ట్రను కాంగ్రెస్ ఏటీఎంలా మార్చుకుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. రాష్ట్రంలోని వనరులు ఉపయోగించుకొని, నిధులు విత్‌డ్రా చేసి దిల్లీకి తరలిస్తారని ఆరోపించారు. ఈ నెల 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ జల్గావ్ జిల్లాలోని చాలిస్‌గాన్‌లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమికి ఓటు వేసి గెలిపిస్తే... ప్రధాని మోదీ సహకారంతో మహారాష్ట్ర మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. జార్ఖండ్‌లో బీజేపీ ప్రభుత్వమే ఏర్పాటువుతుందని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోనూ 'మహాయుతి' గెలుపు ఖాయమని ఆయన విశ్వాసం వెలిబుచ్చారు. కాంగ్రెస్ నకిలీ హామీలతో ప్రజలను తప్పుదోవపట్టించడమే ఇందుకు కారణమన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీల్లో ప్రదర్శించే రాజ్యాంగ ప్రతి అసలైంది కాదని, అది నకిలీదన్నారు. కొందరు పాత్రికేయులు దాన్ని చూడగా... అందులో ఖాళీ పేజీలే ఉన్నాయన్నారు. నకిలీ ప్రతి చూపించి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడం ద్వారా బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించారని ధ్వజమెత్తారు. యూపీఏ పాలనలో ఓటు బ్యాంకు రాజకీయాలతో దేశంలో నక్సలిజం, ఉగ్రవాదం సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ రాజకీయమంతా మోసంతోనే నడుస్తుందని, మహారాష్ట్రలో 'మహాయుతి' ప్రభుత్వం వచ్చాక పెట్టుబడులు తగ్గిపోయాయని ప్రచారం చేస్తున్నారన్నారు. కానీ, ఏక్‌నాథ్ షిండే సారథ్యంలో 'మహాయుతి' పాలనలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో మహారాష్ట్ర నంబర్ వన్‌గా నిలిచిందని తెలిపారు. శరద్ పవార్‌ను టార్గెట్ చేస్తూ... ఆయన సీఎంగా, కేంద్రమంత్రిగా ఎన్నో సంవత్సరాలుగా పనిచేసినా మరాఠా భాషకు ప్రాచీన హోదా కల్పించేందుకు కృషిచేయలేదని విమర్శించారు.

బుల్డోజర్లు ఇక గ్యారేజీలకే: అఖిలేశ్

లక్నో: రాష్ట్ర ప్రభుత్వాల బుల్డోజర్ చర్యలపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వేళ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై ఎస్పీ అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బుల్డోజర్లు ఇక గ్యారేజీలకే పరిమితమవుతాయని ఎద్దేవా చేశారు. 'సుప్రీంకోర్టు ఏం చెప్పిందో మీరు తెలుసుకోవాలి. ఈ ప్రభుత్వ చిహ్నంగా మారిన బుల్డోజర్‌కు వ్యతిరేకంగా మాట్లాడింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. ప్రజల ఇళ్లను కూల్చివేసేవారి నుంచి ఏం ఆశిస్తాం? కనీసం ఆ బుల్డోజర్లు గ్యారేజీకి పరిమితమవుతాయి. పేదలకు చెందిన ఏ ఒక్క ఇల్లు ఇక కూలదు' అని కాన్పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో అఖిలేశ్ యాదవ్ అన్నారు. యూపీలో నవంబర్ 20న తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అధికారులు ఒక వ్యక్తి దోషి అని తేల్చి చెప్పలేరని, జడ్జిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులు కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, ఆయా ప్రభుత్వాల అధికారులు మితిమీరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ధిక్కార చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది.

ప్రజలే గెలిపిస్తారు: ప్రియాంక

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక పోలింగ్ తీరును కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా బుధవారం పరిశీలించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ ఈ ఎన్ని కలో ప్రజలు తనకు ఓ అవకాశం ఇస్తారని ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. ఓటర్లు తనపై చూపించిన ప్రేమను తిరిగి ఇవ్వాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలంతా ఓటు హక్కు వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. కేరళలోని వక్ఫ్ చట్టం, కొండ చరియలు విరిగిపడిన వయనాడ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సహాయం అందకపోవడం వంటి విషయాల గురించి విలేకరులు ప్రశ్నించగా... ఇవాళ ఎలాంటి వివాదాస్పద అంశాల జోలికి వెళ్లదల్చుకోలేదని ఆమె సమాధానమిచ్చారు. వయనాడ్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3 లక్షల మెజార్టీతో రాహుల్ గాంధీ విజయం సాధించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్... సీపీఐ నాయకురాలు అనీ రాజాపై 3.6 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంతోపాటు యూపీలోని రాయ్‌బరేలీలోనూ రాహుల్ గెలుపొందడంతో వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానం నుంచి బరిలోకి దిగిన ప్రియాంకను ఐదు లక్షల మెజార్టీతో గెలిపిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేసింది.

హిందీ సహా భారతీయ భాషల్లో వైద్య విద్య

పాట్నా: త్వరలోనే హిందీ సహా అనేక భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లు జోడించామని, రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. బీహార్ లోని దర్భంగాలో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన చేసి, రూ.12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రధాని కొనియాడారు. ఆటవిక రాజ్యంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశాయని, కానీ రాష్ట్రంలో నితీశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు.. ముందు ముందు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మోదీ పాదాలకు నితీశ్ వందనం

కాగా, ప్రధాని మోదీ కాళ్లకు నమస్కరించడానికి నితీశ్ కుమార్ మరోసారి ప్రయత్నించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

దర్భంగాలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన

ఎయిమ్స్‌కు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై మోదీ వైపు నడుస్తూ నితీశ్ రెండు చేతులు జోడించి నమస్కరించారు. వెంటనే మోదీ పాదాలు తాకేందుకు ప్రయత్నించారు. అది గమనించిన ప్రధాని... తన పాదాలు తాకకుండా సీఎంను ఆపారు. నితీశ్‌కు కరచాలనం అందించారు. మోదీ పాదాలు నితీశ్ తాకడం ఇది తొలిసారి కాదు. గత జూన్‌లో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రధాని కాళ్లకు నమస్కరించేందుకు ఆయన ప్రయత్నించారు. అంతకముందు ఏప్రిల్‌లోనూ నవాడాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో నితీశ్ కుమార్... మోదీ కాళ్లు ముట్టుకున్నారు.

ఎవరిపై ఆధారపడొద్దు

అజిత్ వర్గానికి సుప్రీం హితవు

న్యూదిల్లీ: ఎన్‌సీపీ అధినేత అజిత్ పవార్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఎన్‌సీపీ వ్యవస్థాపకుడైన శరద్‌పవార్ ఫొటోలు, వీడియోలు ఎన్నికల ప్రచారంలో వినియోగించొద్దని ఆదేశించింది. అలాగే సొంతకాళ్లపై నిల్చోవడం నేర్చుకోవాలని చురకలు వేసింది. గత ఏడాది ఎన్‌సీపీ నుంచి చీలిపోయి మెజార్టీ ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీ- శిండే ప్రభుత్వానికి మద్దతు పలికిన అజిత్ పవార్... డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయన వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలూ మంత్రులయ్యారు. దాంతో పార్టీ రెండుగా చీలిపోగా... అజిత్ పవార్ వర్గాన్నే అసలైన ఎన్‌సీపీగా ఎన్నికల సంఘం గుర్తించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీలో ఎక్కువమంది ఎమ్మెల్యేలు కలిగిన అజిత్ వర్గమే పార్టీ చిహ్నం, ఎన్నికల గుర్తును దక్కించుకుంది. అయితే ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో శరద్ పవార్ ఫొటోలు వాడుతున్నారని ఆరోపిస్తూ ఆయన మద్దతుదారులు సుప్రీంను ఆశ్రయించారు. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది.

తప్పుడు ప్రకటనలు చేయొద్దు

కోచింగ్ సెంటర్లకు కేంద్రం మార్గదర్శకాలు

న్యూదిల్లీ: వివిధ పోటీ పరీక్షలకుగాను విద్యార్థులకు శిక్షణనిచ్చే కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రకటనలు చేయకూడదని కేంద్రం హెచ్చరించింది. కోచింగ్ కేంద్రాలు చేసే 100 శాతం జాబ్ గ్యారెంటీ, 100 శాతం సెలెక్షన్ వంటి తప్పుడు ప్రకటనలను నియంత్రించేందుకు కేంద్రం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిపై కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థకు అనేక ఫిర్యాదులు వస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. 'తమ సక్సెస్ రేటు, సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తీసుకున్న కోర్సులు మొదలైన విషయాల గురించి కోచింగ్ సెంటర్లు ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల నుంచి కొంత సమాచారం దాచిపెట్టడం మేము గమనించాం. అందువల్ల వాటి నిర్వాహకుల కోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించాం' అని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే వెల్లడించారు. కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అయితే ప్రకటనలనేవి వినియోగదారుల హక్కులను దెబ్బతీయకూడదని ఆమె అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి ఇప్పటికే జరిమానాలు విధించామని తెలిపారు. కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారికి వినియోగదారుల రక్షణ చట్టం కింద పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తామని అధికారులు పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్లు అందించే కోర్సులు, వాటి వ్యవధికి సంబంధించి తప్పుడు ప్రకటనలు చేయకూడదు. అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైన తర్వాత వారి రాతపూర్వక అనుమతి లేకుండా కోచింగ్ సెంటర్‌లు అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉపయోగించకూడదు. కోర్సుల గురించి ముఖ్యమైన సమాచారాన్ని బహిర్గతం చేయాలి. చాలామంది యూపీఎస్సీ అభ్యర్థులు సొంతంగా చదువుకొని ప్రిలిమ్స్, మెయిన్స్ క్లియర్ చేసి, కేవలం ఇంటర్వ్యూలకు మాత్రమే కోచింగ్ తీసుకుంటారు. అటువంటి విషయాలను కోచింగ్ సెంటర్లు బహిరంగంగా తెలియజేయాలి. ఉద్యోగాలకు ఎన్నికైన అభ్యర్థులు తమ వద్ద ఏ కోర్సులో శిక్షణ తీసుకున్నారో తెలియజేయాలి. చట్టబద్ధంగా అనుమతి తీసుకున్న భవనాల్లో మాత్రమే కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. అభ్యర్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, భద్రత కల్పించాలని కేంద్రం ఆదేశించింది.

దిల్లీని కమ్మేసిన పొగ

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీని కాలుష్యపు పొగ కమ్మేసింది. గాలి నాణ్యత సూచీ 400 దాటడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దిల్లీతో పాటు నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్‌లో తీవ్రమైన పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 మార్క్‌ను అధిగమించి 'తీవ్రమైన కేటగిరి'లోకి చేరింది. నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్‌లో గాలి నాణ్యత 188గా ఉంది. దీంతో హాట్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో నీటిని జల్లులుగా చిలకరించడంతో పాటు నిర్మాణ, కూల్చివేత ప్రదేశాలలో ధూళి నియంత్రణ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బీహార్‌లోని మూడు నగరాలతో పాటు హర్యానాలోని రెండు నగరాలు, చండీగఢ్ ప్రాంతాలు దేశంలోని టాప్ 10 కాలుష్య ప్రదేశాలుగా గుర్తించారు. ఇదిలా ఉండగా పొరుగున గల పాకిస్థాన్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఐక్యరాజ్యసమితి చిల్డ్రన్ ఫండ్ (యూఎన్‌ఐసీఈఎఫ్) పేర్కొంది. దీంతో పాక్‌కు హెచ్చరికలు సైతం జారీ చేసింది. దట్టమైన పొగమంచు కమ్మేయడంతో దిల్లీ, అమృత్‌సర్ నుంచి కొన్ని ఇండిగో విమానాలు ఆలస్యంగా నడిచాయి. మంగళవారం అర్ధరాత్రి పంజాబ్ నుంచి దిల్లీకి వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం సైతం కొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలిపారు.

కశ్మీర్ లోయలో భూకంపం



శ్రీనగర్: కశ్మీర్ లోయలో బుధవారం ఉదయం 10.43 గంటల ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 5.2గా నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం... భూకంపం తీవ్రత 5.1గా ఉంది. అయితే, పాకిస్థాన్ వాతావరణ విభాగం దానిని 5.3 తీవ్రతగా నివేదించింది. భూకంపం కేంద్రం అఫ్గనిస్థాన్‌లోని హిందూకుష్ పర్వత ప్రాంతంలో గుర్తించినట్లు ఇస్లామాబాద్‌లోని నేషనల్ సీస్మిక్ మానిటరింగ్ సెంటర్ తెలిపింది. భూమికి 220 కిలోమీటర్ల లోతులో ఇది కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపింది. ఈ భూకంపం ధాటికి లోయలోని పలుచోట్ల ప్రకంపనలు వచ్చాయి. ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పాకిస్థాన్‌లోని ఖైబర్‌ఫంక్తుఖ్వా, ఇస్లామాబాద్, పంజాబ్‌లోని వివిధ ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ భూకంపం ధాటికి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు.

విశాలాంధ్ర హైదరాబాద్

దాడి వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకుంటాం

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై లగచర్లలో జరిగిన దాడి ఘటన వెనుక ఎవరు ఉన్నారో గుర్తించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇలాంటి ఘటనల ద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడి ఘటనకు సంబంధించి నిందితులను మీడియా ముందు ప్రవేశపెడతామన్నారు. రైతుల పేరుతో కొంతమంది గులాబీ ముసుగు వేసుకొని దౌర్జన్యానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఈ ఘటన వెనుక ఎవరు ఉన్నారో బయటకు రావాల్సి ఉందన్నారు. వికారాబాద్ ఘటన వెనుక ఉన్నది ఎవరో త్వరలో తేల్చుతామన్నారు. ప్రజలకు మంచి చేద్దామని తాము భావిస్తే బద్నాం చేయాలనుకోవడం దారుణమన్నారు.

రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - కాప్రా : కాప్రా డివిజన్ పరిధిలోని శ్రీ సాయి ఎన్ క్లేవ్‌లో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నోచుకుంది. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో డ్రైనేజీ నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరు చేశారు. దీంతో బుధవారం కాప్రా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, మందుముల పరమేశ్వర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియచేసారు ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు నాగ శేషు, మేడ్చల్ అగ్రికల్చర్ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, తోటకూర శ్రీకాంత్, డైరెక్టర్ పూర్ణ యాదవ్, మేడ్చల్ అగ్రికల్చర్ మాజీ డైరెక్టర్ కొబ్బరి నాగరాజు, ఎస్సీ సెల్ చైర్మన్ కాప్రా వినోద్, పి మల్లారెడ్డి, బాబురావు, శ్రీధర్ రెడ్డి, రాజన్ సతీష్ యాదవజ్యోతి, లక్ష్మి, రాకేష్ యాదవ్, సంతోష్ చారి, సంతోష్ నాగరాజు యాదవ్ జి సత్యనారాయణ శ్రీహర కమలాకర్, రాజు, శివ, సాయి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - కాప్రా : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతతతో పాటు దైవభక్తి పెరుగుతుందని ఆ దిశగా ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలని అలవర్చుకోవాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. మల్లాపూర్ మున్సిపల్ మైదానంలో శ్రీ జగన్నాథ మహాప్రభు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన హరే రామ హరే కృష్ణ మహా మంత్ర పఠన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక ఆలోచనలు మనిషిలో కోపాన్ని, ఉద్వేగాన్ని, క్రోధాన్ని తగ్గిస్తాయన్నారు. అలాగే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. నాయకులు దయాకర్ రెడ్డి, శ్రీశైలం, ఉత్సవ కమిటీ నిర్వాహకులు సత్యవరిక్, ప్రకాష్ రావు, ఉపేందర్, మీనా రావు, కళ్యాణ్, రామారావు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ లోగల పాపిరెడ్డి నగర్ నుండి జిహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం వరకు చేపట్టిన లింకు రోడ్డు పనులను, రాజీవ్ గృహ కల్పనలోని పలు సీసీ రోడ్డు పనులను ఏఈ భాస్కర్ తో కలిసి పరిశీలించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అనంతరం కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప పరిసర ప్రాంతాల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు. దాదాపుగా రోడ్లు పూర్తవ్వగా మిగిలిన కొన్ని చోట్ల నూతన సీసీ రోడ్ల పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బస్తీల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణను గాడిలో పెట్టాలని ఆ విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బస్తీలు, కాలనీల్లో విస్తృతంగా పాదయాత్రలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి కాలనీ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, వార్డ్ మెంబర్ శ్రీకళ, వార్డ్ మెంబర్ రాంబాబు, కొయ్యడ లక్ష్మణ్ యాదవ్, వెంకటేశ్వర్లు, లింగ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సుధారాణి, కుమారి, శశికళ, పద్మిని, కీర్తి, పుష్ప, విశాల్, తిరుపతి రావు, శ్రీను, రెబెక, సునీత తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో నింధితులను పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై దాడి జరిగింది. స్థానికులతో కలిసి గంజాయి బ్యాచ్ విచక్షణారహితంగా దాడి చేయడంతో ఎస్ఐకి గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి అమ్మకాలకు సంబంధించి పక్కా సమాచారం అందడంతో నార్కోటిక్ అధికారులు హబీబ్ నగర్ లోని మాంగర్ బస్తీకి వెళ్లారు. సీఐలు దీపక్, రాజశేఖర్, ఎస్ఐ శివకుమార్ తో పాటు కొంతమంది కానిస్టేబుళ్లు అక్కడికి వెళ్లారు. అయితే, వీరి రాకను గుర్తించిన పాత నేరస్తుడు, గంజాయి వ్యాపారి కంబ్లీ దీపక్ పరారయ్యేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంటపడి దీపక్ ను పట్టుకున్నారు. స్టేషన్ కు తరలించే ప్రయత్నం చేస్తుండగా స్థానికులతో కలిసి దీపక్ తమ్ముడు అరుణ్ పోలీసులను అడ్డుకున్నాడు. దాదాపు వంద మంది పోలీసులపై దాడికి దిగారు. బీర్ బాటిల్ తో కొట్టడంతో ఎస్ఐ శివకుమార్ తలపై గాయమైంది. స్థానికుల దాడి నుంచి తప్పించుకున్న పోలీసులు ఎస్ఐ శివకుమార్ ను ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో ఎస్ఐ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు పోయిందని పోలీసులు తెలిపారు. గంజాయి వ్యాపారి కంబ్లీ దీపక్, అతడి తమ్ముడు పరారయ్యారని వివరించారు.

ఈథనాల్, హైడ్రోజన్ బయోఫ్యూయల్స్ పురోగతే లక్ష్యం

పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : ఈథనాల్, హైడ్రోజన్, బయోఫ్యూయల్స్ పురోగతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. బెంగుళూరులో సెంటర్ ఫర్ హై టెక్నాలజీ (సీహెచ్టీ) ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఇండియన్ ఆయిల్) సహకారంతో నిర్వహిస్తున్న 'ఎనర్జీ టెక్నాలజీ మీట్ (ఈటీఎం) 2024' ను మంత్రి ప్రారంభించారు. ఈ ఈవెంట్ 12వ తేదీన ప్రారంభమైంది. 14వ తేదీన ముగియనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పురోగతి ద్వారా 'వికసిత భారత్'కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మన దేశ ఎనర్జీ డిమాండ్ 2047 నాటికి రెట్టింపు అవుతుందన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో భారతదేశం నుంచి మాత్రమే 25 శాతం వృద్ధి డిమాండ్ ఉంటుందన్నారు. నికర జీరో లక్ష్యాలను సాధించడంలో చురుకుగా ఉన్న చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు), ప్రైవేట్ ఇంధన కంపెనీలను ప్రశంసించారు. భారతదేశం ప్రస్తుత జీవ ఇంధనం మిశ్రమం రేటు 16.9 శాతానికి చేరుకుందని, 2030కి నిర్దేశించబడిన 20 శాతం లక్ష్యాన్ని, షెడ్యూల్ కంటే ఐదేళ్ల ముందే అధిగమించే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. జీవ ఇంధన కార్యక్రమాలలో వ్యవసాయ రంగానికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని తెలిపారు. దిగుమతి బిల్లులలో రూ. 91,000 కోట్లను ఆదా చేశామన్నారు. జీవ ఇంధనాల మిశ్రమంలో భారతదేశం ప్రపంచంలో రెండో స్థానంలో ఉందన్నారు. భారతదేశం 250 రకాల క్రూడ్ ఆయిల్‌ను ప్రాసెస్ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. ప్రస్తుత 258 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక శుద్ధీకరణ సామర్థ్యం ఉందని, ఇది 310 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరగనుందని చెప్పారు. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్. 2027 నాటికి భారత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మార్కెట్ 70 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేసిందన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ చైర్మన్, మార్కెటింగ్ డైరెక్టర్ వీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఇంధన పరిశ్రమ భవిష్యత్తు గ్రీన్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను శుద్ధి ప్రక్రియలలోకి చేర్చడంపై ఆధారపడి ఉందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, వనరుల ఆప్టిమైజేషన్ ద్వారా పర్యావరణ బాధ్యత కలిగిన పరిశ్రమను నిర్మించగలమని పేర్కొన్నారు. ఈ ఈవెంట్ మా రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ రంగానికి అవకాశాలను తెరుస్తుందని తెలిపారు. ఇది దేశం ఆకాంక్షలను నెరవేర్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ ఈవెంట్‌కు దేశ, విదేశాల నుంచి 1300 మంది హాజరయ్యారు. డొమైన్ నిపుణులు, విద్యావేత్తలు, లైసెన్సర్లు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

క్రిమినల్ మైండ్ రాజకీయాలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు క్రిమినల్ మైండ్‌తో రాజకీయాలు చేస్తారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లు బరితెగించిన అధికార పక్షాన్ని చూశామని, నిరసనలు చేస్తే అరెస్టులు, హౌస్ అరెస్టులు చేసేదని, నాడు ఒక అప్రకటిత ఎమర్జెన్సీ గా ఉండేదని ఇప్పుడు అవే మూకలు బరితెగించిన ప్రతిపక్షాన్ని చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ అరెస్టు అవుతానో అని డిల్లీ పెద్దలతో బేరసారాలకు కేటీఆర్ వెళ్ళాడని ఆరోపించారు. ఖలిస్తాన్ ఉగ్రవాదులతో దేశానికి ఎంతటి ప్రమాదము ఉందో, కల్వకుంట్ల కుటుంబం తో కూడా తెలంగాణ కు అంతే ప్రమాదం ఉందన్నారు. ఫార్మసిటీ కోసం మీ హయంలో 12వేల ఎకరాలను సేకరించారని, అప్పుడు మీకు కాంగ్రెస్ బీజేపీ సహకరించాయని గుర్తు చేశారు. కానీ అధికారుల మీద ఎవరూ దాడి చేయలేదని స్పష్టం చేశారు. కుట్రపూరితంగా కలెక్టర్ మీద హత్యాయత్నం జరిగిందని, ఈ కుట్రకు ప్రధాన సూత్రధారి కేటీఆర్ అని తేలిందని ఆయన ఆరోపించారు. భూసేకరణ ఇంకా పూర్తి కాలేదని, అప్పుడే సీఎం కుటుంబ సభ్యుల మీద ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజలు ఆదరిస్తే మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటదని కేటీఆర్ తెలుసుకోవాలని. ఇప్పుడే నీ రాజకీయ జీవితం అయిపోలేదని హితవుపలికారు. తెలంగాణ రాజకీయాల నుంచి భవిష్యత్ లో కల్వకుంట్ల కుటుంబం కనుమరుగు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. వచ్చే పదేళ్ల తర్వాత మరో ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి రావచ్చు కానీ బీఆరెస్ మాత్రం ఎప్పటికీ అధికారంలోకి రాదని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. యశోద హాస్పిటల్ తో మీకున్న బంధం ఎవరికి తెలియదని సూటిగా కేటీఆర్ ను ప్రశ్నించారు. అర్బన్ మినిస్ట్రీగా ఉన్నప్పుడు ఏ ఫైల్స్ చకచక కదిలించారో తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలు మెచ్చిన రీతిలో ప్రతిపక్ష పాత్ర పోషించాలనే ఇంకిత జ్ఞానం కూడా కేటీఆర్‌కు లేదని, అధికారుల మీద దాడి చేయించే నీచ రాజకీయాలు చేయాలని కేటీఆర్ చూస్తున్నారని మండిపడ్డారు. రైతులను రెచ్చగొట్టడమే కేటీఆర్, నరేందర్ రెడ్డి పని అని, వారి కుట్రలను బయటపెడతామని, నరేందర్ రెడ్డి వెనుక ఎవరున్నారో కూడా తేలుస్తాం అని, ఆయన హెచ్చరించారు. కొడంగల్ లాంటి వెనకబడిన ప్రాంతానికి పరిశ్రమలు తీసుకురావడం తప్పా అని ప్రశ్నించారు. కొడంగల్ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించవద్దా అని ప్రశ్నించారు.

ఘనంగా 'వాలెంటిన్ హాయ్' జయంతి వేడుకలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అంధులలో అక్షర జ్యోతిని వెలిగించిన గొప్ప సంఘసంస్కర్త వాలంటిన్ హాయ్ అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పిలుపునిచ్చారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 - సుభాష్ నగర్ డివిజన్ లూయిస్ బ్రెయిలీ భవనం నందు వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "వాలెంటిన్ హాయ్" జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ సమాజంలో అంధుల పట్ల జరుగుతున్న వివక్షతకు చలించి వారి కోసం 1784లో ప్రపంచంలోనే మొట్టమొదటి అంధ పాఠశాలను ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త "వాలెంటిన్ హాయ్" అని అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు నా దృష్టికి తీసుకువస్తూ సమస్యల పరిష్కారానికి "వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్" సంఘ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయం.రానున్న రోజుల్లో కూడా "వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్" సంఘం సభ్యులకు నా మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు. అనంతరం పలువురు అంధులు, వికలాంగులకు ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు పెద్ద వెంకటస్వామి, గుబ్బల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, ఇస్మాయిల్, జావిద్, మధు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ సంఘ అధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు యాదయ్య యాదవ్, సభ్యులు దేవి, శేఖర్, ఆంజనేయులు, సత్యం, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిజాం కళాశాల స్నాతకోత్సవం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: విద్యార్థులు డిగ్రీ పట్టాలతో పాటు అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉన్నప్పుడే అవకాశాలను అందుకోగలరని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ బాసుత్కర్ జగదీశ్వర్ రావు (ప్రొ.బిజె.రావు) పేర్కొన్నారు. రవీంద్ర భారతి ఆడిటోరియంలో బుధవారం నిజాం కళాశాల మూడవ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బి.జె.రావు మాట్లాడుతూ ఆకాశమే హద్దుగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రకాల ఉన్నత అవకాశాలు ఉన్నాయని వాటిని దక్కించుకునే విధంగా విద్యార్థులు కృషి చేయాలని కోరారు. తమకు విద్యను అందించిన విద్యాసంస్థలను, తమ ప్రాంతాన్ని తల్లిదండ్రులను మరచిపోవద్దని ఆయన విద్యార్థులను కోరారు. ఉన్నత స్థానాల్లోకి ఎదిగిన విద్యార్థులు తమ వంతు బాధ్యతను సమాజం పట్ల చూపాలని సూచించారు.అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ మాట్లాడుతూ విద్యార్థులే భావి భారత నాయకులని, ఆలోచన పరులని, నూతన ఆవిష్కర్తలని పేర్కొన్నారు. అందువల్ల విద్యార్థులు సామాజిక మార్పు కోసం, దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. నిజాం కళాశాలతో పాటు ఓయూలో పెరుగుతున్న విద్యార్థినిల (అమ్మాయిలు) సంఖ్యకు అనుగుణంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి హాస్టల్ వసతితోపాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని విసి చెప్పారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. బీమా మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా వివిధ కోర్సులను తమ కళాశాలలో ప్రవేశపెడుతూ ఉత్తమమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు. అలాగే కళాశాల ప్రగతి నివేదికను ఆయన ప్రవేశపెట్టారు. వివిధ యూజీ కోర్సుల్లో మెరిట్ మార్కులు సాధించినందుకు గాను 49 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ ఎంపిక కాగా ఇందులో 80శాతం అమ్మాయిలేనని చెప్పారు. ఇందులో ఒక అమ్మాయి 6 గోల్డ్ మెడల్స్ సాధించిందన్నారు. ఇక వివిధ యూజీ కోర్సుల్లో కలిపి 520మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొందుతుండగా వీరిలో 60 శాతం అమ్మాయిలు 40 శాతం అబ్బాయిలని తెలిపారు. కళాశాల నుంచి అమ్మాయిలే అధిక భాగంగా ఉండడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ బీమా హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎక్కువమంది జాతీయ స్థాయి విద్యా సంస్థలైన ఐఐటి లు, సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ కోర్సుల్లో సీటు పొందుతున్నారని చెప్పారు. ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం రాములు, నిజాం కళాశాల ఎగ్జామ్స్ కంట్రోలర్ డాక్టర్ చాంద్ పాషా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఉపేందర్ రెడ్డి, డా. పసునూతి మనోహర్, డాక్టర్ ఆవుల ఏడుకొండలు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సరికొత్త స్టోర్లను ప్రారంభించిన విశాల్ కంప్యూటెక్

విశాలాంధ్ర- జూబిలీహిల్స్ : టెక్ రంగంలో విశేష సేవలను అందిస్తున్న విశాల్ కంప్యూటెక్ మరో ముందడుగు వేసింది. సికింద్రాబాద్‌లో రెండు సరికొత్త స్టోర్లను ప్రారంభించింది. వాటిలో ఒకటి సీటీసీలో మరొకటి ఎస్.పి రోడ్‌లో ఏర్పాటు చేసింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో లలితా దేవి హిసారియా, వికాస్ హిసారియా, విశాల్ హిసారియా, బిజయ్ కేశన్, రమేశ్ బాబు పైలా (ఏఎండీ - నేషనల్ సేల్స్ హెడ్), ప్రకాశ్ నాయక్ (ఆర్ఎస్ఎం - అస్రాక్) తదితరులు పాల్గొన్నారు. అలాగే హెచ్.పి, లెనోవో, డెల్, ఏసర్, ఆసుస్ తదితర సప్లయర్‌లు, సిబ్బంది హాజరయ్యారు. ఈ కొత్త స్టోర్లు విద్యార్థులు, గేమర్లు, టెక్ ప్రియులకు ఎంతగానో ఉపయోగపడతాయి. మన దేశంలో సాటిలేని రిటైల్ ఎక్స్ పీరియన్స్‌ను అందిస్తాయి. సాంకేతిక విభాగంలో వన్ స్టాప్ సొల్యూషన్‌గా నిలుస్తాయి. భారత్‌లో తొలి మైక్రాన్ ఎక్స్ క్లూజివ్ స్టోర్, తొలి ఎం.ఎస్.ఐ ఎక్స్ క్లూజివ్ కాంపోనెంట్ స్టోర్, తొలి అస్రాక్ ఎక్స్ క్లూజివ్ స్టోర్. ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలు విశాల్ కంప్యూటెక్ సొంతం.

వాహనాల కొరత లేకుండా చూడాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : వరి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా రవాణా శాఖకు సంబంధించిన లారీలు, ఇతర వాహనాలను సమకూర్చేలా చూడాలని రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా రవాణా శాఖ తీసుకుంటు న్న చర్యలపై అధికారులతో చర్చించారు. జిల్లా కలెక్టర్లు స్థానిక రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

ఈనెల 19న టెక్నీషియన్ పోస్టులకు జాబ్ మేళా

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో బొండాడ సర్వీసెస్ ప్రయివేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. కంపెనీలోని 50 టెక్నీషియన్ పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. ఐ.టి.ఐ, డిప్లొమా, బీ.టెక్, ఎలెక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ చేసిన 18 నుండి 50 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. మరిన్ని వివరాలకు హెచ్ ఆర్ రాహుల్ (సెల్.9398722629) ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా నవంబర్ 19న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఈనెల 21, 22 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ నెల 21, 22 తేదీల్లో భారత రాష్ట్రపతి రెండు రోజులపాటు నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేందుకు మాన్యువల్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆమె ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా ఏర్పాట్లు, సరైన ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని అన్నారు. అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు అన్ని వేదికల వద్ద తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. వైద్యారోగ్యశాఖ సహాయక సిబ్బందితోపాటు అర్హులైన వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రపతి బస చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ శాఖను ఆదేశించారు. అన్ని వేదికల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖను ఆదేశించారు. డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డీజీ అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ బీ వెంకటేశం, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ హరీశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ రెడ్డికి మావుళ్లమ్మ చిత్రపటం అందజేసిన లక్ష్మీపతి రాజు

విశాలాంధ్ర - దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 11 డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అల్లూరి లక్ష్మీపతిరాజు భీమవరం మావూళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకుని తన అభిమాన నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి కొరకై ప్రసాదం, అమ్మవారి చిత్రపటం తీసుకువచ్చి బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అందించారు.కార్యక్రమంలో 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ఏలూరి సత్య, పంగా శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో చిత్రపటాన్ని అందజేశారు.

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION):: GUNTUR

OS No: 357/ 2019

Between:
State Bank of India, RACPC, Guntur, Rep. by it's Manager-Recovery - Plaintiff
And
Pamidala Sanjay& Others - Defendants
To,
D-3: Pamidala Balaram, S/o. Tirupathaiah, R/o.#7-7-123, Near Hanuman Temple, Ameerpet, Hyderabad.

పై నెంబరు దావాలో 3వప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:06-12-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగాగానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:06-12-2024

కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్,
వాది తరపు అడ్వకేట్, రవీంద్ర నగర్, గుంటూరు.

మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, వినుకొండ

ఓ.యస్.నెం.21/2024

బిట్విన్
మేకల ఏడుకొండలు - వాది
వర్సెస్
1. మందూరు రవికుమార్, 2. మందూరు ఆషా
3. మందూరు సాయి రోహిత్ చౌదరి
4. మందూరు మణిదీప్, 5. కోనేరు శివాణి
6. వీరమాను గాలెయ్య - ప్రతివాదులు

నోటీసు

1. మందూరు ఆషా, భర్త రవికుమార్ (డి2)
2. మందూరు సాయి రోహిత్ చౌదరి తండ్రి రవికుమార్ (డి3)
3. మందూరు మణిదీప్, తండ్రి రవికుమార్ (డి4)
ఇంటి నెం.13/5 లైఫ్ లైను, హాస్పిటల్ కాప్రా సివిల్ కోర్టు, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం

పై నెంబరు గల దావాలో మీరు 2,3,4 ప్రతివాదులైయున్నారు. మీకు శ్రీ కోర్టు వారు అనేక పర్యాయములు నోటీసులు పంపినప్పటికిన్నీ, మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందు వలన శ్రీ కోర్టు వారు పేపరులో ప్రకటించమని ది.20-11-2024 తేది నాటికి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజున అనగా ది.20.11.2024వ తేదిన ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ కోర్టు నందు హాజరై మీకు ఉన్న ఆక్షేపణలను తెలియజేయవలసినదిగా మిమ్ములను కోరడమైనది. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 20-11-2024

పి. జాన్ లూకా, బి. ఎ.బి.యల్
అడ్వకేట్ వాది తరపు న్యాయవాది
సెల్ : 9703975179
వినుకొండ, తేది:13-11-2024

ఎర్రకుంట చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్

విశాలాంధ్ర - కాప్రా : హైడ్రా కమీషనర్ రంగనాథ్ బుధవారం తార్నాక డివిజన్ పరిధిలోని ఎర్రకుంట చెరువును సందర్శించి పరిశీలించారు. చెరువుల పరిరక్షణ సమితి కన్వీనర్ కొమ్మగల్ల వెంకటేశ్వర్లు అన్యాక్రాంతం అవుతున్న చెరువులను పరిరక్షించాలనీ కోరుతూ హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎర్రకుంట చెరువును పరిశీలించారు. సమాచారం తెలుసుకున్న ఎర్రకుంట బస్తీ వాసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని చెరువును పునరుద్ధరించాలనీ కోరారు. చెరువు తూముపై అక్రమంగా చేసిన కమర్షియల్ నిర్మాణాన్ని తొలగించాలనీ కమీషనర్ ఫిర్యాదు చేశారు. దీంతో పాటుగా చెరువు భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలనీ ఎర్రకుంట వాసులు, తార్నాకలోని పలు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కమీషనర్ కు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రంగనాథ్ తార్నాక ఎర్రకుంట చెరువుపై సమగ్ర విచారణం చేస్తామన్నారు. 6 ఎకరాల విస్తీర్ణంలోని ఎఫ్‌టీఎల్ ను ముందు అభివృద్ధి చేస్తామన్నారు. అన్యాక్రాంతమైన 26 ఎకరాల చెరువు భూములపై విచారణ చేస్తామన్నారు. చెరువు భూములను కొనుగోలు చేసిన వారు తమ పత్రాలను హైడ్రా కార్యాలయంలో సమర్పించాలనీ సూచించారు. హైడ్రా కమీషనర్ రంగనాథ్ వెంట డిప్యూటీ కలెక్టర్ సుధా, మారెడుపల్లి తహసీల్దార్ బీమయ్య గౌడ్ తదితరులున్నారు.

వీడియో గేమింగ్ డెవలపర్ కాన్ఫరెన్స్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గేమ్ డెవలపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మూడు రోజుల ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్‌గా ప్రపంచవ్యాప్తంగా ఉన్న గేమింగ్ నిపుణులు హెచ్ఐసీసీ హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈవెంట్ 1వ రోజున 6000 కంటే ఎక్కువ మంది హాజరైన వారితో ఈవెంట్ అద్భుతమైన ప్రతిస్పందనను చూసింది. ఐజీడీసీలో జరిగిన ఎక్స్‌పో 100o కంటే ఎక్కువ గ్లోబల్ లోకల్ గేమింగ్ డెవలపర్‌లు, పబ్లిషర్‌లతో సందర్శకులకు లీనమయ్యే, ఇంటరాక్టివ్ వినోదాన్ని అందిస్తుంది. భారతదేశంలోని ప్రముఖ వీడియో గేమింగ్, ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీల వ్యవస్థాపకుల, సీఎక్స్ ఒలతో పాలసీ మీటింగ్‌లలో భారత ప్రభుత్వ సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొనడం ఐజీడీసీ 2024 మొదటి రోజుముఖ్యాంశం. ఐజీడీసీ 2024లో మీడియాను ఉద్దేశించి సంజయ్ జాజు మాట్లాడుతూ, వీడియో గేమింగ్, ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమకు రియల్ మనీ గేమింగ్ పరిశ్రమకు మధ్య ఉన్న తేడా గురించి ప్రభుత్వానికి తెలుసు అనే వాస్తవాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలుసునని పంచుకున్నారు. వీడియో గేమింగ్ పరిశ్రమ తప్పనిసరిగా కంటెంట్ మరియు సృజనాత్మకతతో ముందంజలో ఉందని జాజు నొక్కి చెప్పారు. ఎంఐబీ మంత్రిత్వ శాఖ గేమ్ డెవలపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి భారతదేశంలో స్కేల్‌లో అధిక నాణ్యత గల ప్రతిభను సృష్టించేందుకు పని చేస్తుందని, తద్వారా భారతదేశం ప్రపంచ గేమింగ్ స్పేస్లో ఆధిపత్యం చెలాయిస్తుంది.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వారికే కేటాయించాలి

చైర్మన్ బక్కి వెంకటయ్య

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వారికే కేటాయించాలని ఎస్సీ ఎస్టీ కేసుల పరిష్కారంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, 15 రోజుల్లో పరిష్కరించి వాటి నివేదిక అందజేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో భూ, అట్రాసిటీ సమస్యలపై రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, సాంఘిక సంక్షేమ శాఖ, డి ఆర్ డి ఓ, జడ్పీ సీఈవో, ట్రైబల్ వెల్ఫేర్, సంక్షేమ గృహాల శాఖల మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ, అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వచ్చిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యకు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, మొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ కేసుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జిల్లాస్థాయిలో వసతి గృహాల నిర్వహణ, విద్యా, వైద్యం అన్ని విభాగాలకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, ఎస్సీ,ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం సూచనల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దళితుల భూమి సమస్యకు సంబంధించి వారం రోజుల్లో నివేదిక ను తమకు అందజేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ రాజ్యాంగబద్ధ కమీషన్ అని పేర్కొన్నారు. వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్లకు వచ్చే ఎస్సీ ఎస్టీల సమస్యలను పోలీసులు ఓపికగా వినాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వము, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్నేహపూర్వక పోలీసింగ్‌ను అమలు చేస్తున్నారని అన్నారు. అట్రాసిటీ కేసులు పెండింగ్లో ఉండకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, మాట్లాడుతూ జిల్లాలో నమోదైన కేసులపై తహసీల్దారుల నుండి ప్రాథమిక నివేదికలు అందాయని, వాటిపై 15 రోజులలో సమగ్ర నివేదికను కమిషన్‌కు అందజేస్తామని, సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డిఓ గణేష్, కృష్ణవేణి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు నునావత్ రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, గుండాల నరసయ్య, కే.సంజీవరావు, పి సుధాకర్, గుగులోతు కిషన్ నాయక్, పి.అశోక్ కుమార్, అడిషనల్ ఎస్పీ చేన్నయ్య, జెడ్పి సీఓ పురుషోత్తం, డీఆర్డిఓ మధుసుదన్ రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డిహెచ్ఓ మరియన్న, సిపిఓ సుబ్బారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహస్వామి, డిపిఓ హరిప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర - మేడిపల్లి : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చొరవతో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ సహకారంతో రూ.10 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరులో భాగంగా బుధవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 12, 24 వార్డ్ లో ఇంద్ర యూత్ అసోసియేషన్ నూతన భవనం పనులకు రూ.20 లక్షల నిధులతో, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్ బొమ్మకు కళ్యాణ్, గుర్రాల రమ వెంకటేష్ యాదవ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బద్దుల సత్యనారాయణ యాదవ్, జెనిగ వెంకటేష్ యాదవ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైడ్ అందజేసిన ఐలయ్య

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తుర్కయంజాల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య వాటర్ ప్యూరిఫైడ్ అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22వ వార్డు కమ్మగూడ శ్రీ శ్రీ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తాగునీటికి బుధవారం ఐలయ్య తన సొంత ఖర్చుతో వాటర్ ప్యూరీఫైర్ అందజేశారు. అదేవిధంగా విద్యార్థులకు అందరికీ ఉచితంగా షూ, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ డిఈ బిక్షపతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు తావు నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారి ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్

విశాలాంధ్ర - ఆమనగల్లు : ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆపదలో ఉన్న అభాగ్యులకి ఆర్థిక భరోసా సిఎంఆర్ఎఫ్ అని కెఎస్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా చెప్పారు. బుధవారం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జంతుక ఎల్లయ్య జంగయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన అరవై వేల రూపాయల చెక్కును స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్యుఐ జిల్లాకార్యదర్శి ఫరీద్, కొండల్, మద్దూరి శ్రీనివాస్, మహేష్, నరేష్, శీను, రమేష్, జంతుక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : లింగంపల్లి డివిజన్, హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ లో రోడ్ వేయడానికి తవ్వేసి నెల రోజులు అవుతున్న పట్టించుకోలేదని, దీనివలన ఇద్దరు క్రిందపడి గాయాలు అయ్యాయని అలాగే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, కాలనీ లోపలికి ఎవరైనా రావాలంటే భయపడుతున్నారని, కాలనీ వాసులు తెలియజేయగా లింగంపల్లి కంటేస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేశ్‌తో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్ కాలనీలో పర్యటించారు. వారు మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వారు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నిధులు సరిపోని పక్షంలో ఎంపీ నిధుల ద్వారా అయిన పూర్తి చేయిద్దమని కాలనీ వాసులకు హామీ ఇవ్వగా వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రాజాయాదవ్, వనం నాగరాజు, పాశం రాజ, పాశం రాజ్ కుమార్, పాశంరాజు, చిన్నబాబు, రంజిత్, వెంకట రమణ, శేషు, మహేష్, శ్రీధర్, ఎస్జీ టవర్స్ ప్రతినిధులు, గంగా ఫార్చ్యూన్ ప్రతినిధులు, ఎల్‌వీయు అపార్ట్మెంట్ ప్రతినిధులు, సాయి సద్గురు అపార్ట్మెంట్ వాసులు, స్థానిక కాలనీ వాసులు, సోమయ్య యాదవ్ పాల్గున్నారు.

గుర్రపు డెక్కను తక్షణమే తరలించాలి

విశాలాంధ్ర - కాప్రా : నాచారం హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుమారు 100 ఎకరాలలో గుర్రపు డెక్క పూర్తిగా నిండి ఉన్నది. సుమారు 20 రోజులుగా తొలగింపు పనులు వస్తున్నాయని దాదాపుగా గుర్రపు డెక్క తొలగింపు పనులు పూర్తయ్యాయి. కానీ చెరువులో నుంచి తీసిన గుర్రపు డెక్కను చెరువు కట్టపై వేయడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, తక్షణమే తొలగించిన గుర్రపు డెక్కను చెరువు కట్ట నుండి తరలించాలని అధికారులకు కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్వైజర్ నరసింహ గ్రేటర్ బారాస నాయకులు సాయి జన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, శేకర్ యాదవ్, తాడికొండ ఆంజనేయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవోకి వినతి

విశాలాంధ్ర - పెనుబల్లి : పెనుబల్లి మండలంలోని గ్రామ పంచాయతీల సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పెనుబల్లి మండల ఎంపీడీవో అన్నపూర్ణకి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. గత కొన్ని నెలలుగా తమ జీతాలు రావడం లేదని రెండు మూడు నెలల చెక్కులు ట్రెజరీకి అందించామని ఇప్పటివరకు తమ వేతనాలు జమ కాలేదని జీతాలు జమ చేయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కరోబార్ అండ్ బిల్ కలెక్టర్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి చెన్నారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశన రంగారావు, మండల కార్యదర్శి జంగాల వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు వేముల ఇజ్రాయిల్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - వనపర్తి : కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం ధాన్యం కొనక రైతులు కష్టాలు పడుతున్నారని, వెంటనే కొనుగోలు చేయాలని సిపిఐ అనుబంధ భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. కళావతమ్మ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్ డిమాండ్ చేశారు. బుధవారం పానగల్ మండలం కేతేపల్లి రైతు వేదిక వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేతేపల్లి ధాన్యం కేంద్రంలో ఒడ్లు పోసి 25 రోజులు అవుతున్నా పలకరించే నాథుడు లేరన్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు కిందపరిచే పదాల ను అద్దెకు తెచ్చుకున్నారని వాటి అద్దె పెరిగిపోతుందన్నారు. రోజు వొడ్లను ఆరబెట్టటం, వర్షం చినుకులు పడటంతో మళ్లీ కుప్పలు చేస్తున్నడంతో చేతులకు బొబ్బలు వచ్చాయని పలువురు రైతులు చేతులను చూపారన్నారు. మంగళవారంరాత్రి వర్షం పడితే నిద్ర లేకుండా కుప్పలు కట్టామని చెప్పారన్నారు. ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. శ్రీరంగాపురం వనపర్తి ప్రాంతాల నుంచి బాయిల్డ్ రైస్ మిల్లర్లు కొనుగోలుకు వచ్చారని, ఆలస్యమైతే తక్కువకైన అమ్ముతామని వారు చెప్పారన్నారు. వర్షం వస్తే కప్పేందుకు టార్పలిన్‌లు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా ఎక్కడ ఒక్క టోర్పలిన్ ఇవ్వలేదన్నారు. కేంద్రం వద్ద నీడ కోసం టెంట్లు లేక, ఎండకు మాడుతున్నారన్నారు. తాగునీటి వసతి లేదన్నారు. అన్ని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయకుంటే రైతులతో ధాన్యం కేంద్రాల వద్ద ధర్నా, రోడ్లపై రాస్తారోకో చేస్తామన్నారు. సిపిఐ మండల కార్యదర్శి దంగు కుర్మయ్య, మాజీ గ్రామ శాఖ కార్యదర్శి అంజి, సీనియర్ నాయకులు కాకం చిన్న నారాయణ, కురువ హనుమంతు, చిన్న కుర్మయ్య, ఎలగొడ్డు రాముడు, నరసింహ, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా లోని రాఘవపూర్ కన్నాల వద్ద జరుగుతున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి రైల్వే జంక్షన్ పరిధిలో రాఘవపూర్ కన్నాల రైల్వే ట్రాక్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు ఘటనాస్థలానికి చేరుకొని అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి 8.30 గంటలకు రాఘవపూర్ కన్నాల రైల్వే ట్రాక్ వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పి ప్రమాదం జరిగిందని, ఈ సమాచారం అందుకున్న కలెక్టర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బుధవారం తెల్లారుజామున వరకు ఉండి పోలీసు సిబ్బందితో కలసి అవసరమైన చర్యలు చేపట్టారు. సింగరేణి సంస్థతో మాట్లాడి ఘటన స్థలానికి వెంటనే భారీ క్రేన్లు తీసుకుని వచ్చి పట్టాలు తప్పిన గూడ్స్ రైలును క్లియర్ చేసే పనులు ప్రారంభించారు. బుధవారం ఉదయం మళ్లీ ఘటన స్థలానికి వెళ్ళిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులను ట్రాక్ పై ట్రాలి పై వెళ్లి పరిశీలించి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రైల్వే జీఎంను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి తహసిల్దార్ జ్యోతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎంపీ రఘునందన్‌రావుకు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఖచ్చితంగా ఏర్పాటు చేయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. మెదక్‌లో పదవ తరగతి మూల్యాంకన కేంద్రం లేకపోవడం వలన సంగారెడ్డి జిల్లాలోని బెల్‌కు ఉపాధ్యాయులు మూల్యాంకనానికి వెళ్లడం చాలా వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - హుస్నాబాద్: అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టుకున్నట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. బుధవారం ఆబ్కారీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి శ్రీనివాసమూర్తి ఆదేశానుసారం కొహెడ మండలం చంచెల్ చెరువుపల్లి గ్రామంలో గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం రాగా, గ్రామంలో ఎస్సై రూపు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా నారోజు గణేష్ చారి అను వ్యక్తి వద్ద 830 గ్రాముల గంజాయి లభించిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని హుస్నాబాద్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా హుస్నాబాద్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన గుడుంబా, గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేసినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

విశాలాంధ్ర - (మహబూబాబాద్) తొర్రూర్: పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తొర్రూర్ మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య తెలిపారు. బుధవారం తొరూరు మండలంలోని మాటేడు, పత్తేపురం ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలలో విద్యార్థుల శాతాన్ని పెంచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలన్నారు. కాకుండాఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని విద్యార్థులను వారి సామర్థ్యాల విద్యార్థులను అడిగి తెలుసుకు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని అన్నారు. ఒక పాఠ్యాంశాన్ని బోధించి ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పత్తేపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిఆర్పి ఎస్ రమేష్ పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో పులి సంచారం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్ జోన్‌గా మారుస్తూ గత ప్రభుత్వం, కోర్ ఏరియాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ జన్నారం ఖానాపూర్ అటవీ డివిజన్ పరిధిలో అటవీ కోర్ ఏరియాగా నియమించింది. అందులో భాగంగానే ఉట్నూర్ మండల కేంద్రం లోని పల్లెలే కాకుండా కడెం మండల కేంద్రంలో టైగర్ జోన్ పులులను ఆవాసం కొరకు వదిలేయడంతో పులులు రాత్రులు పగలు తేడా లేకుండా అక్కడక్కడ రోడ్లపై తిరుగుతున్నాయి. అటవీ సీసీ కెమెరాలలో పెద్ద పులులు తిరుగుతున్నాయి అనడానికి ఆనవాళ్లుగా కనబడుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అనుకొని ఉన్న అభయారణ్యంలో తిరుగుతూ గత మూడు రోజుల క్రితం పెంబి ఏరియాలో ఒక రైతు ఎద్దును చంపి కొంతవరకు తిని వదిలేసి వెళ్లిందని పెంబి అటవీ అధికారుల పరిశీలనలో తేలింది. కానీ తదుపరి జిల్లా వ్యాప్తంగా మారుమూల పల్లెలుగా అడవిని అనుకొని రైతుల పంట పొలాలు వందల ఎకరాల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్నప్పటికీని వాటి కాపుకు వెళ్లే రైతులు గజగజ వణుకుతూ బాంబేలెత్తిపోతున్నారు. రైతులు వారి పంట పొలాలకు వెళ్లేందుకు రక్షణగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అడవిలో పులులు తిరుగుతున్నాయని, అటవీ ప్రాంతంలోకి ఎవరు వెళ్ళవద్దు వెళ్లి ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్దు అంటూ ఖానాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఎఫ్ ఆర్ ఓ కిరణ్ అడవికి అనుకొని ఉన్న ఖానాపూర్ డబల్ బెడ్రూంలో దండోరా వేయించినట్టుగా తెలిపారు.

చేనేత రంగానికి బిర్లా 'ఆద్యం' సహకారం: సవిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చేనేత వస్త్రాలకు మార్కెటింగ్‌తో పాటు నేతన్నలకు 365 రోజుల పని కలప్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన 'ఆద్యం'తో ఒప్పందం చేసుకోనున్నట్లు బుధవారం ఒక ప్రకటన చేశారు. ఉప్పాడ-కాటన్ జమధాని, పులగుర్త-మల్కా ఖాదీ, అంగర-కాటన్ చీరలు, వెంకటగిరి-కాటన్ చీరలు, కోడుమూరు గద్వాల్ - కాటన్ చీరలకు ఆద్యం సంస్థతో కలిసి మార్కెటింగ్ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.

హైదరాబాద్‌లో ఉన్న ఆద్యం కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధి మనీశ్ సక్సేనాతో భేటీ అయి, ఈ ఒప్పందంలోని అంశాలను గురువారం ఖరారు చేయాలని శాఖ కమిషనర్ రేఖారాణిని ఆదేశించినట్లు మంత్రి సవిత పేర్కొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలి
- అప్పటివరకు మా పోరాటం ఆగదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి జిల్లా: నిరుపేదలందరికీ ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండల కేంద్రంలో సీపీఐ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోరాట కార్యక్రమంలో రామకృష్ణతో పాటు సీపీఐ జిల్లా జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటికి స్థలం కేటాయించి, తామే స్వయంగా ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చినందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేర్చాలని కోరారు. సీపీఐ చూపించిన ఖాళీ స్థలాల్లో ఇంటి పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి దృష్టికి, జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి పేదలందరికీ ఇంటి స్థలాలు వచ్చేలా కృషి చేస్తామని, అంతవరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. వేమయ్య యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు మతం భూమిని కొట్టివేయాలని అనేక ప్రయత్నాలు చేశారని, కానీ వారి ఆటలను సీపీఐ సాగనివ్వలేదని తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో పేదల కోసం సీపీఐ అధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తున్నామని, హిందూపురం, సోమందేపల్లి బత్తలపల్లి, అనేక మండలాల్లో ఇంటి స్థలాల కోసం ఉద్యమించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుల్లాయప్ప, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి పి.రవికుమార్, సహాయ కార్యదర్శి వై.రమణ, మండల కార్యదర్శి బండల వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బత్తుల నాగభూషణం, సన్న పెద్దన్న రామకృష్ణ, ఆదినారాయణ, నారాయణస్వామి, రవి, నారాయణ, జయమ్మ, గంగాధర్, సత్యమయ్య, ఓబులేసు, రామాంజనేయులు తదితర సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు

పలిశెట్టి దామోదరరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలను అందించాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. విజయవాడలో దాసరి భవన్‌లో బుధవారం ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి దామోదరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తున్న తరహాగా జీవో నంబరు-114 ప్రకారం పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగులకు నిలుపుదల చేసిన నైట్ అవుట్ (ట్రావెలింగ్) ఇవ్వాలని, ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న ఖాళీల్లో డ్రైవర్లు, కండక్టర్లు, నిర్వహణ విభాగం సిబ్బంది, సూపర్ వైజర్లు ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ప్రకటించాలన్నారు. గతంలో ఉన్న రిటైర్డు ఎంప్లాయిస్ మెడికల్ హెల్త్ స్కీమ్ (ఆర్ఈఎంఎస్) వర్తింపజేసేలా సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్ మాట్లాడుతూ పీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగులకు చెల్లించాల్సిన 2017 పీఆర్సీ బకాయిలు, పదోన్నతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎస్.రమేశ్, జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాగర్, ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపాటి శంకరరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు టి.వి.భవాని, జి.ఎస్.నారాయణ, జోనల్ కోశాధికారి పి.రామకృష్ణతో పాటు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి విజయవాడలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ: జాతీయ పుస్తక వారోత్సవాల సందర్భంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి టి.మనోహర్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనను గురువారం సాయంత్రం అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. సివిల్ కోర్టు ఎదురుగా ఉన్న బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆవరణలోని వేమూరి అనిల్‌కుమార్ స్వాతి వేదికపై ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వివరించారు. సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు ఎస్.వెంకట నారాయణ అధ్యక్షతన జరిగే సభకు సాహితీవేత్త డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

అన్యాయం జరగనివ్వం

మునంబమ్ ప్రజలకు వినయ్ విశ్వం భరోసా

తిరువనంతపురం: కేరళలోని మునంబమ్ ప్రజలకు అన్యాయం జరగనివ్వమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. వారి సమస్య పరిష్కారానికి సీపీఐ కట్టుబడి ఉందన్నారు. పరిష్కారం లభించే వరకు మునంబమ్ ప్రజలకు అండగా నిలుస్తామని హామీనిచ్చారు. ఇక్కడి భూమి స్థానికులది, దీనిని ఎవరూ లాక్కోలేరని నొక్కిచెప్పారు. పలాయంలోని మార్టైర్స్ స్క్వేర్ వద్ద వివిధ క్రైస్తవ సంఘాల ఆందోళనకు వినయ్ విశ్వం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా హేతువాదులు, ఆధ్యాత్మిక వాదుల ఐక్యతకు పిలుపునిచ్చారు. మునంబమ్ సమస్య పరిష్కారానికి ఏకం కావాలని కోరారు. 'ఇది మనోభావాలను రెచ్చగొట్టే సమయం కాదు. కొన్నుకున్న స్థలంలో ఉండే హక్కు ప్రజలకు ఉంది. దీనిని ఎవరూ కాదనలేరు. ప్రభుత్వానిదీ ఇదే వైఖరి' అని వినయ్ అన్నారు. మునంబమ్-వక్ఫ్ సమస్య పరిష్కారంలో అవరోధాలు ఉన్నట్లు తెలిపారు. హేతువాదులు, ఆధ్యాత్మిక వాదులు చేయి చేయి కలిపితేనే పరిష్కారం సాధ్యమని వినయ్ విశ్వం అన్నారు. మునంబమ్ వక్ఫ్ సమస్య పరిష్కారానికి గాను అఖిలపక్షాన్ని పిలవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని లాటిన్ ఆర్చ్‌బిషప్ థామస్ జె నెట్టో డిమాండ్ చేశారు. మత సామర స్యానికి భంగం కలగనివ్వవద్దని కోరారు. సీఎం తమ విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తారని ఆందోళనకారులు ఆశిస్తున్నట్లు థామస్ తెలిపారు.

బాబు వ్యవస్థీకృత నేరస్తుడు

సూపర్ 6 మోసాలపై నేనే ట్వీట్ చేస్తా: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సూపర్ 6 మోసాలపై ట్వీట్ చేస్తానని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. ఎంత మందినైనా అరెస్టు చేయండి... ఆ అరెస్టులు నాతోనే మొదలు కావాలి... అరెస్టుల భయం లేదు అంటూ వ్యాఖ్యానించారు. సూపర్ 6కు బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కడ? చంద్రబాబుపై 420 కేసు ఎందుకు పెట్టరాదు? అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు చేస్తున్న వ్యవస్థీ కృత నేరం కాదా అంటూ దుయ్యబట్టారు. జగన్ బుధవారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందన్నారు. బాబు బడ్జెట్ మోసాలు ప్రజలకు తెలియాలని, వీటిపై తన పార్టీ నేతలతో పాటు తాను కూడా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టనున్నట్లు తెలిపారు. ఓటాన్ అకౌంట్‌తో చంద్రబాబు ప్రభుత్వం కాలం వెళ్లదీసిందని విమర్శించారు. బడ్జెట్ ప్రవేశపెడితే చంద్రబాబు చెప్పిన అబద్ధాలు, చేసిన మోసాలు బయటపడతాయనే ఇలా చేసిందని దుయ్యబట్టారు. బడ్జెట్ అంశాలు, అందులోని గణాంకాలను బట్టి చంద్రబాబు ఎంతటి డ్రామా ఆర్టిస్ట్, వ్యవస్థీకృత నేరస్తుడో స్పష్టమవుతుందని జగన్ వ్యాఖ్యానించారు. అనుకూల మీడియాతో ప్రచారం, తన దత్తపుత్రుడితోనూ, ఇతర పార్టీలోని తమ వారితోనూ మాట్లాడిస్తూ దృష్టి మళ్లింపు రాజకీయాలు చేస్తున్నారని చంద్రబాబును విమర్శించారు. 2018-19 నాటికి రాష్ట్ర అప్పులు రూ.2,57,509 కోట్లు, ప్రభుత్వ హామీతో కార్పొరేషన్లు చేసిన అప్పు మరో రూ.55,000 కోట్లు కలిపి రూ.3.13 లక్షలకోట్లని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ప్రభుత్వ అప్పులు రూ.4,91,734 కోట్లు, ప్రభుత్వం పూచీ పడ్డ అప్పు రూ.1.54 లక్షలకోట్లు, మొత్తం రూ.6,46,000 కోట్లు అని జగన్ తెలిపారు. రూ.14 లక్షల కోట్లు అప్పు ఏదంటూ చంద్రబాబు ప్రచారాన్ని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవకముందే ప్రజలపై రూ.17,899 కోట్ల భారం మోపారని, ఇందులో రూ.6,072 కోట్ల ట్రూఅప్ చార్జీల భారాన్ని నవంబరులో మోపగా... మిగతా రూ.11వేల కోట్ల భారాన్ని డిసెంబరులో ప్రజల నెత్తిన వేస్తారని జగన్ వ్యాఖ్యానించారు. యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి..అంటే రూ.7,200 కోట్లు బడ్జెట్‌లో ఎక్కడ? మేము అధికారంలోకి వచ్చిన 6 నెలలకే గాంధీ జయంతికి ముందే 1.34 లక్షల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు ఇచ్చాం. 58 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాం. ఐదేళ్లల్లో 6.31లక్షల ఉద్యోగాలు ఇచ్చాం' అని జగన్ అన్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల విధులు, జాబ్ చార్టులపై త్వరలో నిర్ణయం: అనిత

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మహిళా సంరక్షణ కార్యదర్శుల విధులు, జాబ్ చార్టులపై సంబంధితశాఖలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. గ్రామ సచివాలయాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శుల విధులపై పూర్తి సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గౌరు చరితారెడ్డి, మాధవిరెడ్డి అసెంబ్లీలో కోరగా మంత్రి అనిత సమాధానం ఇచ్చారు. యూనిఫామ్, జాబ్ ఛార్టులపై కోర్టుల్లో ఏడు రిట్ పిటిషన్లు దాఖలయ్యాయన్నారు. గత ప్రభుత్వానికి జాబ్ చార్టులపై కనీస అవగాహన కూడా లేదని విమర్శించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు రిపోర్ట్ చేయాల్సింది గ్రామ సెక్రటరీకి, పని చేయాల్సింది పోలీస్ శాఖలో, జీతాలు, సెలవులు ఇచ్చేది ఎంపీడీవోలు అని చెప్పారు. ఇన్ని శాఖల సంబంధం వల్ల మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అశ్లీల, అసభ్య పోస్టులు పెడితే ఊరుకోం

మహిళలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెడితే ఊరుకోబోమని అనిత హెచ్చరించారు. సోషల్ మీడియాలో అశ్లీల,అసభ్య పోస్టులు పెడుతున్న వారిని అరెస్టులు చేస్తుంటే వైసీపీ నేతలు జాతీయ మానవ హక్కుల సంస్థను ఆశ్రయించడం విడ్డూరమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వేదికగా ఆమె మాట్లాడుతూ... వైఎస్ జగన్ కుటుంబ సభ్యులను సోషల్ మీడియాలో దూషిస్తున్న వారిని అరెస్టు చేయడం తప్పెలా అవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి రాకపోవడంపై ఆమె సెటైర్లు వేశారు. స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు సభలో ఉన్నారనే భయంతో జగన్ అసెంబ్లీకి రావడం లేదని ఆమె ఎద్దేవా చేశారు.

నాలుగు కార్పొరేషన్‌లకు 60 మంది డైరెక్టర్‌ల నియామకం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో మరో నాలుగు కార్పొరేషన్‌లకు డైరెక్టర్‌లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా సావిత్రి, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా పీవీజీ కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్‌గా ఎం.సురేంద్ర, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా ఆర్. సదాశివలను ఇటీవలే నియమించగా, తాజాగా ఆయా కార్పొరేషన్‌లకు 15 మంది చొప్పున 60 మంది డైరెక్టర్‌లను నియమించింది.

బీమా ప్రీమియం చెల్లింపునకు ప్రాధాన్యం

శాసన మండలిలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రబీ సీజన్ 2022-23 నుంచి బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించాల్సి ఉందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రీమియం మొత్తాన్ని చెల్లించడానికి ప్రాధాన్యతనిస్తున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు. శాసన మండలి ద్వితీయ (బడ్జెట్) సమావేశాల్లో భాగంగా బుధవారం వివిధ అంశాలపై ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. ఉచిత పంటల బీమా పథకంపై సభ్యులు కవురు శ్రీనివాస్, ఎల్లారెడ్డిగారి శివరామిరెడ్డి, డాక్టర్ పండుల రవీంద్ర బాబు అడిగిన ప్రశ్నకు అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ... 2022-2023 రబీ కోసం ఏఎంఎఫ్‌బీవై (దిగుబడి ఆధారిత) ఉచిత బీమా పథకం కింద రూ.644.56 కోట్ల ప్రీమియంను గత 15 నెలలకు సంబంధిత బీమా కంపెనీలకు చెల్లించలేదని చెప్పారు. 2023-24 ప్రీమియం రూ.1,344.64 కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. పంట రుణాల అధికవడ్డీపై దువ్వారపు రామారావు, బి. తిరుమలనాయుడు, పంచుమర్తి అనురాధ అడిగిన ప్రశ్నకు అచ్చెనాయుడు బదులిస్తూ... ఆర్బీఐ నిబంధనల ప్రకారం సంస్థాగత బ్యాంకు ఛార్జీలు పంట రుణాలపై ఏడు శాతం వడ్డీ రూ. మూడు లక్షల వరకు ఏడాదిలోపల తిరిగి చెల్లించాలని వివరించారు. ఖరీఫ్-2019, రబీ 2021-22 సీజన్లకు సంబంధించి రూ.లక్ష వరకు పంట రుణాలకు నాలుగు శాతం వడ్డీ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం వర్తింపచేసిందని, వ్యవసాయ శాఖకు సంబంధించి రాష్ట్ర వాటా ఇవ్వనందుకు 2019-24 మధ్య కాలంలో ఏ ఒక్క కేంద్ర ప్రతిపాదిత పథకాలను నిలిపివేయలేదని వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగానికి కేంద్రం రూ.50 కోట్లు, భూసార పరీక్షలకు రూ.14.8 కోట్లు కేటాయిస్తే... గత ప్రభుత్వం ఆ నిధులను పక్కదారి పట్టించిందన్నారు. ఫ్రీహోల్డ్ భూముల క్రమబద్ధీకరణపై భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, బి.తిరుమల నాయుడు, కంచర్ల శ్రీకాంత్ అడిగిన ప్రశ్నకు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సమాధానమిస్తూ... 2019-24 మధ్య అసైన్డ్ భూముల ఉచిత కమతాల పథకం కింద క్రమబద్ధీకరించినవి 9,93,285 ఎకరాలని వివరించారు. కైకలూరు నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు దెబ్బతినడంపై జయమంగళ వెంకట రమణ అడిగిన ప్రశ్నకు రోడ్లు-భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమాధానమిస్తూ... రోడ్ల మరమ్మతులకు రూ.24.53 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మద్యం విక్రయాల్లో అక్రమాలపై... ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. కేవలం ఏడు కంపెనీలకు 38 నూతన బ్రాండ్లను పంపిణీ చేసేలా అనుమతులిచ్చారని వివరించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ... పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గోదాములపై దాడులు నిర్వహించగా బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ ఉన్నట్లు కనగొన్నామన్నారు. పాఠశాల బస్సులపై పన్ను గురించి ఎంవీ రామచంద్రా రెడ్డి అడిగిన ప్రశ్నకు రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 2019-24 కాలంలో పాఠశాల బస్సులపై 300 శాతం పన్నును పెంచలేదన్నారు.

శాసనమండలి ప్యానల్ వైస్ చైర్మన్లుగా నలుగురి ఎంపిక

శాసన మండలి ప్యానల్ వైస్ చైర్మన్లుగా పర్చూరి అశోక్ బాబు, పంచుమర్తి అనురాధ, రవీంద్రనాథ్, సుబ్రహ్మణ్యంలను ఎంపిక చేసినట్లు చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు ప్రకటించారు. వైసీపీ సభ్యులు తోట త్రిమూర్తులు, తూమాటి మాధవరావు, భరత్... విద్యుత్ ఛార్జీలపై ఇచ్చిన వాయిదా తీర్మానం, పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు 12వ వేతన సంఘం ఉద్యోగుల సమస్యలపై చర్చించుటకు ఇచ్చిన వాయిదా తీర్మానాలను చైర్మన్ తిరస్కరించారు.

పోలింగ్ ప్రశాంతం

జార్ఖండ్‌లో ముగిసిన తొలి విడత : 65శాతం పోలింగ్ నమోదు

10 రాష్ట్రాల్లో 31 స్థానాలకు ఉప ఎన్నికలు: అక్కడక్కడ స్వల్ప ఉద్రిక్తత

న్యూఢిల్లీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ ప్రశాంతంగా ముగిసింది. 64.86శాతం పోలింగ్ నమోదైంది. అలాగే 10 రాష్ట్రాల్లోని 31 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. చెదురుమదురు ఘటనల నడుమ గురువారం పోలింగ్ జరిగింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు లోక్‌సభకు ఎన్నిక కావడం, మరికొందరు చనిపోవడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. రాజస్థాన్‌లోని ఏడు స్థానాలకు, బెంగాల్‌లో ఆరు, అసోంలో ఐదు, బీహార్‌లో నాలుగు, కేరళలో మూడు, మధ్యప్రదేశ్‌లో రెండు, మేఘాలయ, గుజరాత్, చత్తీస్‌గఢ్, కర్నాటక రాష్ట్రాల్లో ఒక్కోస్థానంలో ఉప ఎన్నికలు జరిగాయి. సిక్కింలోని రెండు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అధికార సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం) పోటీ లేకుండా ఆ స్థానాలను గెలుచుకుంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండియా ఐక్య సంఘటన ఓటమితో ఈ ఉప ఎన్నికలు అగ్ని పరీక్షగా మారాయి. రాజస్థాన్‌లోని ఝున్‌ఝును, దౌస, డియోలి-ఉనియార, కిన్స్‌వర్, చౌరసి, సలుంబర్, రామ్‌ఘర్ స్థానాల్లో పోలింగ్ జరిగింది. అలాగే పశ్చిమ బెంగాల్‌లోని తల్‌దంగ్రా, సిటై-ఎస్సీ, నైహటి, హరో, మెదినిపూర్, మదారిహాట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో; అసోంలోని దొలై, బెహలి, సంగురి, బోంగైగావ్, సిద్లీ స్థానాలకు, బీహార్‌లోని రామ్‌ఘర్, తరారీ, ఇమామ్‌గంజ్, బెలగంజ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మధ్యప్రదేశ్‌లోని బుద్నీ, విజయపుర... కేరళలోని చెలక్కర, వయనాడ్, గుజరాత్‌లోని వావ్, చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ సౌత్, మేఘాలయలోని ఘంబెగ్రే (ఎస్టీ) స్థానాలకూ ఎన్నికలు జరిగాయి. షెడ్యూల్ ప్రకారం గురువారం ఎన్నికలు జరగాల్సిన ఉత్తరప్రదేశ్‌లోని తొమ్మిది, పంజాబ్‌లోని నాలుగు, కేరళలోని పలక్కాడ్ స్థానానికి ఉప ఎన్నికలను పండుగల దృష్ట్యా ఈనెల 20వ తేదీకి ఎన్నికల సంఘం వాయిదా వేసింది.

మావోయిస్టుల వద్దన్నా ఓటేసిన జార్ఖండ్ ప్రజలు

జార్ఖండ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఓటింగ్ చురుగ్గా సాగింది. పోలింగ్ బహిష్కరణకు మావోయిస్టులు పిలుపు ఇచ్చినప్పటికీ ఓటర్లు వెనక్కు తగ్గలేదు. పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ బహిష్కరించాలన్న పోస్టర్లు, బాంబు లభ్యతతో ఓటింగ్ ఆలశ్యంగా మొదలైంది. పోలీసులు ఆ ప్రాంతాలను జల్లెడ పట్టి హానికర వస్తువులు తొలగించారు. దీంతో ఓటర్లు భయం లేకుండా పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. మావోయిస్టులు జగన్నాథ్‌పూర్‌లో రోడ్లను దిగ్బంధించారు. అయితే మార్గానికి అడ్డు పెట్టిన వాటిని పోలీసులు తొలగించారు. అటు కొల్హాన్ జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ గట్టి భద్రత నడుమ ప్రశాంతంగా జరిగింది. ఇచాఘర్, సెరైకేలా, ఖార్స్‌వన్ నియోజకవర్గాల్లో మధ్యాహ్నం ఒంటి గంట సమయానికే 50శాతం మేర పోలింగ్ నమోదైంది. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో పోలింగ్ కేంద్రాల వద్ద హడావిడి కనిపించింది. రంబంగా గ్రామంలో 30 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ మొదలైంది.

ఆకట్టుకున్న థీమ్డ్ పోలింగ్ కేంద్రాలు

జార్ఖండ్‌లోని 15 జిల్లాల్లో 50కుపైగా థీమ్డ్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక సంప్రదాయాలు, క్రీడలు, సామాజిక అవగాహన కల్పించేలా వాటిని తీర్చిదిద్దారు. జార్ఖండ్‌కు చెందిన ఒలింపిక్ క్రీడాకారుల గౌరవార్థం రాంచీలో హాకీ థీమ్‌తో బూత్ ఏర్పాటు చేశారు. అలాగే, గిరిజనుల ఆచారాల ఆధారిత పోలింగ్ కేంద్రాన్ని తమర్ మండలంలో, మాదక ద్రవ్యాలపై

అవగాహన కల్పిస్తూ ఛాత్ర జిల్లాలో బూత్‌లు ఏర్పాటు చేశారు.

బెంగాల్‌లో హింస: 70శాతం పోలింగ్

బెంగాల్‌లో చెదురు మదురు హింసాత్మక ఘటనల నడుమ పోలింగ్ జరిగింది. ఆరు నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 69.29శాతం పోలింగ్ నమోదైంది. నైహటి అసెంబ్లీ నియోజకవర్గంలో హింస జరిగింది. టీఎంసీ కార్యకర్త హత్యకు గురి కాగా, భట్‌పారా వద్ద నాటు బాంబు దాడి జరిగింది. టీఎంసీ కార్యకర్త అశోక్ షా హత్యతో ఓటర్లను భయపెడుతున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ఘటనపై నివేదిక ఇవ్వాలని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సూచించారు.

వయనాడ్‌లో కన్నీళ్లతో ఓటింగ్

వయనాడ్‌లో 60.79శాతం మేర పోలింగ్ నమోదైంది. క్యూలైన్లలో వేచివున్న వారికి పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా ఓటేసేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. దీంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. మరోవైపు కొండచరియలు విరిగి పడిన ఘటన బాధితులు పోలింగ్ కేంద్రాలకు చేరుకోగా అక్కడ భావోద్వేగభరిత వాతావరణం నెలకొంది. ఓటు వేసేందుకు వచ్చిన వారు కన్నీళ్లు పెట్టుకున్నారు. తోటి వారిని హత్తుకున్నారు. భావోద్వేగానికి గురయ్యారు. ఓ వైపు బాధ మరోవైపు దృఢనిశ్చయంతో వయనాడ్‌లో ఓటింగ్ జరిగింది. జులై 30న జరిగిన విపత్తుతో దూరమైన తమ వారిని ఓటర్లు గుర్తుచేసుకున్నారు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వారంతా వచ్చి ఓటు వేయడాన్ని స్మరించుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు. బాధితులను తాత్కాలిక ఆవాసాల నుంచి పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు ఉచిత వాహన సేవలను ప్రత్యేకంగా అందించారు.

రాజస్థాన్‌లో...

రాజస్థాన్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎన్నికల అధికారులు తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదన్నారు. రామ్‌ఘర్‌లో అధికంగా 61శాతం ఓటింగ్ జరిగిందని, ఆ తర్వాత 59శాతంతో ఖిన్స్‌వర్, 56శాతంతో చోరసి, 49శాతంతో సాలుంబర్, 50శాతంలో డియోలి ఉనియాన, 50శాతంతో ఝున్‌ఝును, 45శాతంతో దౌస నిలిచాయన్నారు.

అధికారిని కొట్టిన స్వతంత్ర అభ్యర్థి: కాంగ్రెస్ రెబల్ నరేశ్ మీనా స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచారు. అధికారి అమిత్ చౌదరిని చొక్కా పట్టుకొని లెంపకాయ కొట్టారు. టోంక్‌లోని డియోలి-ఉనియారలో ఈ ఘటన జరిగింది. ఏరియా మెజిస్ట్రేట్, రాజస్థాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారిపై చేయి చేసుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయితే తమ డిమాండ్లకు మద్దతుగా ఎన్నికలను స్థానికులు బహిష్కరించగా, వారితో ఓటు వేయించే ప్రయత్నంలో ఈ ఘటన జరిగింది.

అసోంలో...: అసోంలో ఐదు నియోజకవర్గాల్లో 66శాతం పోలింగ్ జరిగింది. చెదురు మదురు ఘటనలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఓటింగ్ మొదలైన తొలి ఎనిమిది గంటల్లో మొత్తం 9,09,657 మంది ఓటర్లలో 64.27శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. 34 మంది అభ్యర్థుల రాజకీయ భవిష్యత్ ఈ ఎన్నికల్లో తేలనున్నది. బొంగైగావ్‌లో 67శాతం, సమగురిలో 67శాతం, బెహాలీలో 65శాతం, సిద్లీలో 65శాతం, దోలైలో 61శాతం మేర పోలింగ్ నమోదైంది. ఉదయం 5.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు కనిపించినట్లు సీఈవో అనురాగ్ గోయెల్ తెలిపారు. సమగురి, బెహాలీలో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నట్లు చెప్పారు.

కర్నాటకలో: కర్నాటకలోని చెన్నపట్నం, షిగ్గావ్, సందూర్ స్థానాల్లో ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తంగా 77శాతం పోలింగ్ నమోదైంది. చెన్నపట్నంలో 85శాతం, షిగ్గావ్‌లో 75శాతం, సందూర్‌లో 72శాతం చొప్పున పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు ఓటింగ్ జరిగింది. ఏడు లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 770 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.